01-1980






తప్పక చూడండి!
కె.ప్రభాకరరావు సమర్పించు తిరుపతి ఇంటర్నేషనల్
బుర్రిపాలెం బుల్లోడు
ఈస్ట్‌మన్ కలర్
సమర్పణ: పి.సత్య పి.మధు
నిర్మాత: కె.విద్యాసాగర్ M.Com.
స్క్రీన్‌ప్లే-దర్శకత్వం: బీరం మస్తానరావు
VEEKAY

సంస్థాపకులు
కీ॥ శే॥ వి. వి. రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్
శ్రీమతి వి. లీలావతి రాఘవయ్య

జనవరి 1980

సంపుటి 17 — సంచిక 12


## విషయ సూచిక



ఈ నెల నవలానుబంధం


### ఇంద్ర ధనుస్సు

డా. ఏ. ఎస్. వి. ప్రసాద్ రచన

ముఖచిత్రం: 'నిండు నూరేళ్ళు'లో జయసుధ, సుభాషిణి


జ్యోతి, 17-B రాజారాం కాలనీ, మద్రాసు-600 024. ఫోన్ : 423123

సంవత్సర చందా (ప్రత్యేక సంచికతో) 43 రూపాయలు




## ఇంగ్లీషు తెలుగు వివాదం

తెలుగు కథలో ఇంగ్లీషు పదాలువయో గించితీరాలనిగానీ, అసలు తెలుగు కథ రాయాలంటే ఎక్కువ భాగం మరో భాషమీద ఆధార పడక తప్పదనిగానీ, నేనెక్కడా ఉద్ఘాటించ లేదు. కాపీ, భావస్పష్టతకి ఒకటీ - ఆరా ఇంగ్లీషు పదాలు వాడాల్సొచ్చి వాడితే నష్ట మేమిటనే స్పష్టంగా ప్రశ్నించాను.

అచ్యుతరావు పదహారణాల నాలుగుపైసల (నూరుపైసలనకూడదేమో ఏకంగా) తెలుగు వాడు. తెలుగే మాట్లాడేడు. అయితే ఇంగ్లీషులో ఆలోచించి, తెలుగులో. అప్పుడప్పుడూ ఇంగ్లీషులో. అందువల్ల కథాగమనం ఏమాత్రం దెబ్బ తినలేదన్నది నిర్వివాదాంశం. పైగా ఆ పాత్రకి తెలుగు ఇంగ్లీషు పదాలుపయోగించకుండా మాట్లాడ్డం రాదు. ఎందుకనిః తెలుగుతో 'టచ్ పోయింది గురూ' అనే తెలుగు జాతికి చెందినదవడంవల్ల. అది పూర్తిగా పాత్ర చిత్రీకరణకి సంబంధించిన విషయం.

తెలుగుదనం తెలుగువాళ్ళందరికీ అర్ధమయ్యేదిగ యుండాలిటః అట్లు యుండకపోతే? ఈ తెలుగు అర్థమేమిటి? ఇంకా పాతకాలపు గ్రాంధికవాసనల్లోంచి, వ్యావహారికపు తెలుగులో కడుగు పెట్టేందుకిష్టపడని ఈ విమర్శకుడికి అచ్చ తెలుగులో రాస్తేమాత్రం అర్ధమవుతుందా? మరి ఈనెల ప్రచురితమైన మధ్యతరగతి మందహాసం గురించి ఏమాలోచించారు? రామశాస్త్రిగారికి, కాటూరి రవీంద్ర త్రివిక్రమ్‌గారికున్నపాటి ఓపిక కూడా వున్నట్లు లేదు.

ఉత్తరాల శీర్షిక 'ముఖచిత్రం బ్రహ్మాండం' సినిమా బొమ్మలు అద్భుతం-సీరియళ్ళ వడగళ్ళలా వున్నాయి'లాటి వుత్తరాలు రాసి పేరు చూసుకోడానికాదని గమనించాలి.

ఈ ఉత్తరాల శీర్షికకు కేటాయించే రెండు మూడు పేజీలు నా దృష్టిలో ఎంతో విలువైనవి. అయితే ఈ శీర్షిక ప్రయోజనం ఒక్క జ్యోతిలోనే సిద్ధిస్తోంది.


—రాజ్‌కుమార్ మెహ్రా,
గుంటూరు.

డిసెంబరునెల జ్యోతిలో సూర్యప్రభగారు తమ వుత్తరంలో అడిగిన ప్రశ్న - ఇద్దరు తెలుగువాళ్లు కలిస్తే తెలుగే మాట్లాడుతున్నారా? నేను పది సంవత్సరాలుగా కలకత్తాలో వుంటున్నాను. అక్కడ ఎప్పుడయిన మన తెలుగు వాళ్లు కలిస్తే వాళ్లు మాట్లాడుకునేది ఇంగ్లీషు, లేక బెంగాలీ. కొంతమంది తెలుగువారి పిల్లలకు తెలుగు రాదంటే నమ్ముతారా? ఇది మన తెలుగువారికున్న తెగులు. నేను కొన్ని నెలల క్రితం మన రాష్ట్రానికి వచ్చాను. మన రాజధానిలో ఎక్కడ చూసినా (బస్సులలోకానీ, దుకాణాలలోకానీ, హోటల్సులోకానీ) ఉర్దూ ఎక్కువగా వినబడుతోంది. తెలంగాణాలో పల్లె ప్రాంతాలలో మాటాడే తెలుగులో సగం ఉర్దు పదాలు వుంటాయి. ఏమంటే అది నిజాం ప్రభావం అంటారు.

సూర్యప్రభగారు వ్రాసినట్లు ఇంగ్లీషు







పేర్లతో ఎన్నో నవలలు, కథలు వచ్చాయి. అప్పుడు ఎందుకు విమర్శించలేదు ఒక మంచి కథను ఎందుకు విమర్శించారు అన్నారు. ఒక్క మనవి, ఎన్ని పత్రికలు ఇలా సూటిగా విమర్శ నాత్మకమైన ఉత్తరాలను ప్రచురిస్తున్నాయి? ప్రవాసాంధ్రుడిగా, తెలుగుఅభిమానిగా కాటూరి గారి కథని విమర్శించాను. ఆ కథ ఉత్తమ మైనది కాదనికాదు. అదొక మంచి యాంటీ సెంటిమెంటు కథ. ఆ కథమీద నా విమర్శలో తప్పులుంటే రచయిత సహృదయంతో స్వీక రిస్తారని ఆశిస్తున్నాను. నా ఉత్తరాన్ని సహృద యంతో విమర్శించిన, సమర్థించిన పాఠకు లకు కృతజ్ఞతలు.

జె. విజయ్‌మోహన్‌రెడ్డి,
ప్రకాశ్‌రెడ్డిపేట.

## వందేమాతరంవారి లేఖ

ఈ మధ్య జ్యోతి ఉత్తరాల శీర్షికలో కొన్ని ఉత్తరాలు జ్యోతి విలువను పెంచాయి. అక్టోబరునెల జ్యోతిలో తెలుగు. కథలో ఆంగ్ల పదాలమీద శ్రీ విజయ మోహన్‌రెడ్డిగారి వుత్తరం చదివాను. దానిమీద విమర్శించి, సమర్థించే వుత్తరాలు చదివాక ఈ వుత్తరం వ్రాస్తున్నాను. ఈమధ్య కథలలో, నవలల్లో ఎక్కువగా ఆంగ్లపదాలు వాడటం ఒక అల వాటయిపోయింది. డిసెంబరు నెలలో గౌరవ॥ పాఠకులు వ్రాసినట్టు ఇద్దరు తెలుగువాళ్లు కలిస్తే ఒక్క తెలుగే మాట్లాడకపోవచ్చు. తెలంగాణాలో ఉర్దూమాట్లాడుకోవచ్చు. రాయల సీమ (చిత్తూరు, తిరుపతి, కడప)లో తమిళం కలిసిన తెలుగు మాట్లాడవచ్చు. అంతమాత్రాన అలా కథలు వ్రాయంకదా! వారన్నట్లు చాలా కథలు, నవలలు ఇంగ్లీషు పేర్లతో వచ్చాయి, వస్తున్నాయి. నేను సూటిగా ఆ పాఠకుడిని, రచయితలను, రచయిత్రులనూ అడిగే ప్రశ్న- ఆ కథలకు, నవలలకు తెలుగుపేర్లు పెట్ట లేరా? మన వాడుక భాషలో కొన్ని ఇంగ్లీషు, హిందీ ఉరుదూ పదాలు చేరివుండవచ్చు. వాటిని అనువదించటానికి వీలుకాకపోవచ్చు. తెలుగులో అనువదించకలిగి వుండీ అనువ దించకపోతే అది తెలుగుకు ద్రోహం చేసి నట్లుకాదా? శ్రీ విజయమోహన్‌రెడ్డిగారి లేఖ వలన కొంతమంది తెలుగువాళ్ళలో చలనం కలిగిందంటే అతిశయోక్తికాదు. ఇటువంటి మంచిచర్చ ఉత్తరాల శీర్షికలో రావటానికి సహాయపడిన జ్యోతి సంపాదకులకు అభి వందనాలు.

వందేమాతరం రామచంద్రరావు,
హైదరాబాదు.

డిసెంబరు "జ్యోతి" సంచికలోని శ్రీమతి హేమలతా కృష్ణమూర్తిగారి "ఆలస్యంగా అందిన ఉత్తరం" చదివాను. ఒక్క విషయం స్పష్టం చెయ్యదలచి ఈ ఉత్తరం రాస్తున్నాను. హేమలతా కృష్ణమూర్తిగారూ—

దయచేసి బీనాదేవినీ రావిశాస్త్రినీ అంత తొందరగా ఉపమానాల్లోకి తీసుకురాకండి. నా ఉద్దేశం - ఈనాటి కొత్త రచయితల్లో వారితో పోల్చదగ్గవారు లేరనికాదు. కథలో సిన్సియారిటీ, డెప్తు, నేటివిటీ. ఫీలింగ్ లేని ప్రతికథనీ పై రచయితల రచనలతో పోల్చేస్తే తెలుగు కథనే అవమానపరచినట్లని నా భావన.

రాధమ్మ పెళ్ళి ఆగిపోయింది—ఫస్ట్‌కేస్ లాంటివి మాస్టర్ పీసెస్. వాటికవే సాటి.

అనూగీతగారి "చదరంగంలో చచ్చేది" నేనూ చదివాను, బేంక్‌లో ఎన్నికోట్ల బిజినెస్ సాగుతోందీ మొదలైనవి తెలుసుకోవడానికి అనూగీతగారు చాలా కష్టపడిపోయి వుంటారు. అనుగీతగారూ—

హైలీని చదివి "చదరంగంలో చచ్చేది" రాశారు. ఈ సారి ఇర్వింగ్ వెల్లేస్‌ని ట్రై చెయ్యండి.

—అక్కిరాజు మురళీకృష్ణ,
పుల్లేటికుర్రు.

## శ్రీ శ్రీ ప్రహేళిక గురించి

నవంబరు ప్రహేళికలో 8 నిలువు ఆధారం 'శ్రేష్ఠవాచకం'. దానికి మీరిచ్చిన సమాధానం

"జగా" ఎలాగో వివరించగోర్తాను. డిసెంబరు ప్రహేళికలో 32 అడ్డం, ఆధారం "పావలా వంతు శరీరాంగం" అని వుండాలి.

శ్రీశ్రీ 70 వ జన్మదిన సందర్భంగా చిన్న సలహా. ఇంతవరకూ శ్రీశ్రీ తయారు చేసిన ప్రహేళికల నన్నటిని ఒక పుస్తక రూపంలో ప్రచురిస్తే నాలాటి ప్రహేళికాభిమానులెందరికో ఉపయోగకారిగా వుంటుంది.

—తోట చంద్రశేఖరరెడ్డి, ప్రొద్దుటూరు.

డిసెంబరు నెల జ్యోతిలో బెహరా సాహితి గారి కాత్యాయని నవల మాకెంతో నచ్చింది. మధ్యతరగతి కుటుంబాలలోని ఆర్థిక ఇబ్బందు లను, నవలలో కాత్యాయని పాత్రను చక్కగా మలచిన రచయిత్రికి మా అభినందలు. యద్దనపూడి సులోచనారాణి ప్రేమసింహాసనం, లక్ష్మి గారి మీరా ఊహించని మలుపులు తిరుగుతూ ముందు ముందు ఏం జరుగుతుందా అనే ఉత్కంఠను కలిగిస్తున్నాయి. కథలలో మై కంట్రీ, మూడు జంటల కథ, మధ్యతరగతి మందహాసం కథలు చాలా బాగున్నాయి.

—డి. శ్యామల, డి. నిర్మల, కారంచేడు.

"దీప" ముఖచిత్రంతో వెలువడిన డిసెం సంచిక చాలా బావుంది. కె. రాధాకృష్ణమూర్తి గారి "మై కంట్రీ" కథలో భావన, ప్రసాద రావులాంటి నిర్దోషులు నేటి సంఘంలో బలైపోవడం కళ్ళారా చూస్తూ, చెవులారా వింటున్నాము.

అలాగే "మరో పులి పులి కథ" - కథ పాతదే అయినా చెప్పిన తీరు కొత్తగా ఉన్నది.

విద్యార్థుల పోటీ కథలలో "ఎదలోయలలో" మమ్మల్ని ఉక్కిరి బిక్కిరి చేసింది.

—కుమారి సూర్యాపద్మిని, నెల్లూరు.

జ్యోతి అక్టోబరు '79 సంచికలోని "చదరంగంలో చచ్చేది" ఒక మంచి కథ. మంచి కథ రాయడంలోనే కాదు ఆ కథకు సరిపోయే పేరు పెట్టడంలో కూడ "ఆ రచయిత్రి" తన తెలివితేటల్ని చూపించింది. మంచి కథలురాసే వారేకాదు అలాంటివాటిని ఎన్నుకొని వాటికి ప్రాథాన్యత ఇచ్చే పత్రికలు కూడ ఎంతేనా అవసరం. అందుకే ఆ కథ వ్రాసిన "ఆ అమ్మాయి"కి, ఆ కథ వేసిన "జ్యోతి"కి త్రీ ఛీర్స్.

మహాకవుల్ని గౌరవించి కాపాడుకునే పొరుగు భాషలవారి దారిలో మనం కూడా నడుద్దాం! గుర్తుంచుకోండి—ఇది "జ్యోతి" శ్రీశ్రీ నిధి, విరాళాలివ్వడం మీ విధి! ఇలాంటి వాక్యాలు, ఇలాంటి నిధులు ఈ రోజున తెలుగు వాళ్ళకి ఎంతేనా అవసరం. మీ ప్రయత్నం విజయవంతమగుగాక. ప్లీజ్ కీపిటప్.

—మధుర సుందరేష్‌చల్లా, మద్రాసు.

దీప ముఖచిత్రంతో వెలువడిన డిసెంబరు నెల జ్యోతి సర్వాంగసుందరంగా వున్నది. సీరియల్స్ రెండూ పోటీపడుతున్నట్లుగా వున్నవి. ఈ మధ్య జ్యోతిలో ఉత్తరాల శీర్షిక ఆకర్షణీయంగా వుంటున్నది. ఇక కథలలో సుబ్బయ్య మనుమరాలు, సౌమ్మా వాడిదే సోకూ వాడిదే, ఆట కథలు బాగున్నాయి. మధ్యతరగతి మందహాసంలాంటి కథలు ఇంతకు ముందు చాలా వచ్చాయి. "తెలుగుకథలలో ఆంగ్ల పదాలు" చర్చకు మరింత దోహదం చేస్తుంది ఈ కథ. ఈనెల నవల 'కాత్యాయని' ఆరంభంలో చాలా బాగా అనిపించినా చివరకు వచ్చేసరికి ఆ పాత్రను రచయిత్రి సరిగా ఉపయోగించుకో లేదనిపించింది. యండమూరి వీరేంద్రనాధ్‌గారి "యుగాంతం" సీరియల్, 'అల్లావుద్దీన్ అభినవ దీపం' ప్రచురిస్తున్నందుకు మా కృతజ్ఞతలు. ఇటువంటి రకరకాల సీరియల్స్, కథలు ప్రచురిస్తున్న జ్యోతి ఒక వినూత్న మాసపత్రిక అనటంలో అతిశయోక్తిలేదు.

—మూసీలత, అన్నెమమ్మ, లూర్దుమేరి, హన్మకొండ.

## గమనిక

అనివార్య కారణాల వలన గత సంచికలో ప్రకటించిన విధంగా 'మంజులనాదం' నవలని ఈ నెల నవలానుబంధంలో ప్రచురించలేక పోతున్నందుకు చింతిస్తున్నాము.

—ఎడిటర్

# సాంస్కృతిక విశేషాలు

## వెంకట్ అవార్డు కార్టూన్ల పోటీ

యువ వ్యంగ్య చిత్రకారుడు కీ. శే. "వెంకట్" (ఎ. పి. ఎల్. ఎన్. ప్రసాద్) పేరిట అవార్డుల బహూకరణకై క్రిందటేడు వలెనే ఈ ఏడాది కూడా కార్టూన్ల పోటీ నిర్వహించి న్యాయనిర్ణేతల సిఫార్సుల ప్రకారం అత్యుత్తమ కార్టూన్‌కు, రెండొందల రూపాయలు, ఆ తర్వాతి మూడు ఉత్తమ కార్టూన్‌లకు ఒక్కొక్కదానికి నూరు రూపాయల చొప్పున నాలుగు నగదు అవార్డులు ఇవ్వడానికి సాధన సమితి హైదరాబాదు నిశ్చయించింది. మూడు వందరూపాయల అవార్డులలో ఒక దానిని 1979 సంవత్సరంలో వివిధ తెలుగు పత్రికలలో ప్రచురితమైన కార్టూన్‌లలో ఉత్తమంగా ఎన్నిక చేసే కార్టూనుకై ప్రత్యేకించారు. కాబట్టి మూడు అవార్డుల నిమిత్తం కొత్త కార్టూన్‌లతో పాటుగా ఒక అవార్డుకొరకు ఈ సంవత్సర కాలంలో ప్రచురితమైన కార్టూన్లు కూడా పంపవచ్చు. ఎంట్రీలను 1980 జనవరి 16 వ తేదీవరకు "కార్యదర్శి, వెంకట్ అవార్డు కార్టూన్ల పోటీ, 1-1-336/20, వివేక్‌నగర్, చిక్కడ్‌పల్లి, హైదరాబాదు-500 020 చిరునామాకు పంపాలి.

## మద్రాసు 'కళాభారతి' తొమ్మిదవ జన్మదినం

కళాభారతి తన తొమ్మిదవ జన్మదిన మహోత్సవాన్ని చెన్నపురి ఆంధ్రమహాసభ కొత్తా సూర్యనారాయణరావు హాలులో ఇటీవల జరుపుకున్నది. ఆ సందర్భంగా ఆంధ్రరాష్ట్రంలోని కళాసంస్థలలో ఒకటైన కాకినాడ ఆంధ్ర సేవాసంఘం వారిచే 'భగవద్గీత' నాటకం ప్రదర్శింపబడింది. ఈ నాటకాన్ని కీ. శే. చంద్రపట్ల రామారావుగారు రచించగా క్రొవ్విడి విశ్వనాథంగారు కీ. శే. కిళాంబి కృష్ణమాచార్యులుగారు మున్నగు కాకినాడ రంగస్థల ప్రముఖులు ప్రదర్శన యోగ్యంగా తీర్చిదిద్దారు. అధ్యక్షులు శ్రీ బ్రహ్మయ్యగారు, నగరంలోని ప్రముఖులైన శ్రీ ఎమ్. ఎస్. రెడ్డి, శ్రీ పినిశెట్టి శ్రీరామమూర్తి, శ్రీ బి.ఎస్. ఆర్. కృష్ణ, శ్రీ 'మన' సత్యం, శ్రీ జి.సి. శేఖర్, శ్రీ ఐ.ఎమ్. రావు, శ్రీ కోట రంగయ్యశాస్త్రి, డా. సత్యనారాయణ శ్రీ జె. పి. సోమయాజులు, శ్రీమతి డి. టి. కమలాదేవిగార్లు 'భగవద్గీత' నాటక నటీనటులను సత్కరించారు.

ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ ఎమ్. ఎస్. రెడ్డిగారు కళాభారతి తన కృషితో తెలుగు కళలను వెలుగులోకి తెస్తున్నదని కళాకారులను ఎంతో ఘనమైన రీతితో సత్కరిస్తున్నదని ఈ సంస్థ ఇంకా వృద్ధిలోనికి రావాలని ఆశీస్సులు పలికారు. కళాభారతి ఉపాధ్యక్షుడు శ్రీ డి.వి. కృష్ణారావుగారు వందన సమర్పణ చేశారు.

## కళాసాగర్ సప్తమ వార్షికోత్సవం

మద్రాసులోని ప్రముఖ సాంస్కృతికసంస్థ 'కళాసాగర్' నవంబరు 18 న సుమారు నాలుగువేలమంది ప్రేక్షకుల ముందు మద్రాసు యూనివర్సిటీ సెంటినరీ హాలులో తన సప్తమ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకుంది. ప్రముఖ దర్శక నిర్మాత శ్రీ ఎల్. వి. ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ వార్షికోత్సవ సభలో ఫిలిం అవార్డులు, లిటరరీ-అవార్డుల ప్రదానం జరిగిన పిమ్మట, కళాప్రపూర్ణ సాలూరి రాజేశ్వరరావు గారిని వేదిక నలంకరించిన పదిహేను మంది ప్రముఖ సంగీత దర్శకుల సమక్షంలో-కళాసాగర్ ఘనంగా సన్మానించింది. ఫిలిం అవార్డుల విజేతల తరఫున శ్రీ దాసరినారాయణరావు, శ్రీ అల్లురామలింగయ్య, కుమారి మాధవి సంగీత దర్శకుల తరఫున శ్రీ పెండ్యాల నాగేశ్వరరావు శ్రీ తాతినేని చలపతిరావు కవుల తరఫున డా॥ సి. నారాయణరెడ్డి మాట్లాడారు. కళాసాగర్ సప్తమ వార్షికోత్సవ సంచికను శ్రీ ఎల్. వి. ప్రసాద్ ఆవిష్కరించగా మొదటి ప్రతిని సహజకవి శ్రీ మల్లెమాల అందుకున్నారు.

# తొలిమాట

జ్యోతి ప్రకటించిన శ్రీశ్రీ నిధికి శ్రీశ్రీ అభిమానుల నుంచి ప్రతిస్పందన ప్రారంభమైంది. ఈ నిధి విషయం నాలుగు చెరగులా వ్యాపించడానికి కొంత వ్యవధి అవసరమని మాకు తెలుసు. ఆ మహాకవిని గౌరవించి కాపాడుకోవడం తెలుగువారి బాధ్యత అని పదే పదే మీకు గుర్తు చేయవలసిన అవసరంలేదు. నాలుగు ముక్కలు చదవనూ, రాయనూ నేర్చిన వారికి కూడా శ్రీశ్రీ అనే రెండక్షరాలకి అర్థం తెలుసు.

* * *

యండమూరి వీరేంద్రనాథ్‌గారి 'యుగాంతం' సీరియల్ ప్రచురణ ఈ సంచికలో ప్రారంభిస్తున్నాం. 'యుగాంతం' తెలుగు నవలా రచనలో ఒక కొత్త ధోరణికి తలుపులు తెరుస్తుందని ఆశిస్తున్నాం. మీ అభిప్రాయాలు తెలియజేయండి.

* * *

ఈ సంచికలోనే ప్రారంభమవుతున్న 'కొత్త పుస్తకంతో కొంతసేపు' శీర్షికలో యెన్నిక చేయబడిన కొత్త పుస్తకాలమీద విపులమైన సమీక్షలుంటాయి. తెలుగు కథా రచనలో వినూత్నమైన విలోమ ప్రయోగం చేసిన నగ్నముని గారి కథల సంపుటితో ఈ శీర్షిక మొదలెడుతున్నాము. దాస్‌బాబుగారి 'అల్లావుద్దీన్ అభినవ దీపం' కూడా వ్యంగ్య రచనల్ని అభిమానించే మా పాఠకులను ఆకర్షిస్తుందనుకొంటున్నాము.

* * *

జ్యోతిలో సాగుతున్న 'ఇంగ్లీషు తెలుగు' చర్చ, విమర్శ-ప్రతివిమర్శలతో - ప్రయోజనకరంగానే వుంటున్నదని మీ ఉత్తరాలవల్ల తెలుస్తోంది. 'తనమీదికి విసరబడిన రాళ్ళతోనే రక్షణదుర్గాన్ని నిర్మించుకోగల స్థైర్యం యెవరికుంటుందో అతడే జీవితాన్ని జయించిన వాడు' అని ఒక నానుడి వుంది. ఈ వాద ప్రతివాదాల రాపిడిలో తెలుగు యెంత రాటు తేలుతుందో వేచిచూద్దాం.

# శ్రీశ్రీ డెబ్భయ్యో జన్మదిన సందర్భంగా
# జ్యోతి శ్రీశ్రీ నిధి

మన మహాకవి శ్రీశ్రీ డెబ్భయ్యో జన్మదినం సాహిత్య మహోత్సవంగా 1980 మార్చి 2 న కాకినాడలో ఘనంగా జరగబోతోంది. ఈ సందర్భంగా తెలుగువారి సాహిత్య పెన్నిధి అయిన శ్రీశ్రీకి ఉడతాభక్తిగా ఒక చిరు నిధిని సమర్పించాలని జ్యోతి నిర్ణయించిన విషయం మీకు తెలుసు. (వివరాలకు దయచేసి జ్యోతి డిసెంబరు 1979 సంచిక చూడండి) జ్యోతి ఇచ్చిన పిలుపు నందుకుని శ్రీశ్రీ అభిమానులు కొంద రప్పుడే యథాశక్తి విరాళాలు పంపడం ప్రారంభించారు. ఈ సంచిక అచ్చుకి వెళ్ళేనాటికి అందిన విరాళాల వివరాలు పక్క పేజీలో యిస్తున్నాము. శ్రీశ్రీ అభిమానులు, శ్రీశ్రీని అభిమానించే రచయితలు కూడా ఈ యజ్ఞంలో తలా సమిధఒక వేయడానికి మరింత ఉత్సాహంతో ముందుకు రావాలని కోరుతున్నాము.

## శ్రీ శ్రీ సన్మాన వేదికమీద మీ పేరు

ఈవిధంగా మీ వంటి అభిమానుల నుంచి వసూలైన నిధిని కాకినాడ సన్మాన వేదికమీద, నిండుసభలో మహాకవి శ్రీశ్రీకి "జ్యోతి" సమర్పిస్తుంది. "జ్యోతి శ్రీశ్రీ నిధి" సేకరణకి తోడ్పడిన శ్రీశ్రీ అభిమానుల పేర్లన్నీ సభలో ప్రకటిస్తాము. రండి, మహాకవుల్ని గౌరవించి కాపాడుకునే పొరుగు భాషల ప్రజల దారిలో మనం కూడా నడుద్దాం! గుర్తుంచుకోండి. ఇది జ్యోతి శ్రీశ్రీ నిధి. విరాళా లివ్వడం మీ విధి.

## శ్రీశ్రీ ఫొటో ఒకటి

"జ్యోతి శ్రీశ్రీ నిధికి విరాళా లిచ్చినవారికి అప్పటికప్పుడు శ్రీశ్రీ సంతకం చేసిన శ్రీశ్రీ ఫొటో పంపిస్తాము. చిన్న మనవి—శ్రీశ్రీగారి ఫొటో కావాలనుకున్న వారు తమ విరాళానికి మరొక నాలుగు రూపాయలు అదనంగా చేర్చి పంపితే పోస్టు ఖర్చులు మేమే భరించి శ్రీశ్రీగారి జ్యోతి ప్రత్యేక ఫొటో పంపుతాము. గత సంచికలో చేసిన ప్రకటనకి ఇది చిన్న సవరణగా దయచేసి గమనించండి.



విరాళాలు పంపవలసిన చిరునామా:

"జ్యోతి శ్రీశ్రీ నిధి' C/o జ్యోతి,
17-B రాజారాం కాలనీ,
మద్రాసు-600 024.

## శ్రీశ్రీ అభిమానులు:

| | |
|---|---|
| వాసిరెడ్డి సీతాదేవి, హైదరాబాదు | రు. 116-00 |
| దుర్గా ట్రేడర్స్, గుంటూరు | రు 50-00 |
| వి. వి. రుద్రమూర్తి, వాల్తేరు | రు 10-00 |
| ఎస్. తారాదేవి, సుధపాలెం | రు 10-00 |
| కె. రామారావు, జంషెడ్‌పూర్ | రు 10-00 |
| ఎం. అరుణకుమార్, నిజామాబాద్ | రు 10-00 |
| కె. గోపాలకృష్ణ, బరంపురం | రు 11-00 |
| సి. సుందరేశ్, మద్రాసు | రు 10-00 |
| సి. హెచ్. వాసుదేవరావు, హైదరాబాదు | రు 10-00 |
| ఎం. రామచంద్రరావు, బెంగుళూరు | రు 10-00 |
| కె. పాండురంగారావు, గుంటూరు | రు 10-00 |
| వి.వి. బద్రిరాజు, రామచంద్రపురం | రు 10-00 |
| శ్రీమతి వి. సుబ్బలక్ష్మీదేవి | రు 10-00 |
| వి. రమాదేవి | రు 10-00 |
| వి. ఎస్. ఆర్. కుమార్ | రు 10-00 |
| టి. ప్రభాకరమూర్తి | రు 10-00 |
| వి. సుజాత | రు 10-00 |
| వి. ఉష | రు 10-00 |
| వి. సత్యవాణి | రు 10-00 |
| వి. సరోజ | రు 10-00 |
| కావలి ఫిలిం సొసైటీ, కావలి | రు 27-00 |
| కె. దుర్గామల్లేశ్వరరావు, పెనుగొండ | రు 10-00 |
| డా॥ కె. నాగేశ్వరరావు, నెల్లూరు | రు 10-00 |
| వి. వి. ఎస్. శివప్రసాద్ మైలవరం | రు 10-00 |
| ఆర్. గౌరీపతిశాస్త్రి(లతిక)వాల్తేరు | రు 10-00 |
| ఎ. సత్యనారాయణ, హైదరాబాదు | రు 10-00 |

శ్రీశ్రీ ఫొటో కావలసిన వారు ఈ నాలుగు ఫొటోలలో మీకు నచ్చిన నంబరు జ్యోతికి తెలియజేయండి.



కళాశాల విద్యార్థుల కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కథ

# తప్పదు మరి....!

కన్నెగంటి చంద్రశేఖరరావు, బి. టెక్ విద్యార్థి, వరంగల్

"ఎందుకాపేశావ్?" ఆదుర్దాగా అడిగిందామె.

"రేడియేటర్‌లో వాటర్ పోయాలి" అతనన్నాడు మొహంమీద చెమట తుడుచుకుంటూ.

"ఇక్కడెక్కడుంది వాటర్?" నుదురు చిట్లించి చుట్టూ చూస్తూ అడిగింది ఎండిపోయిన పెదాలను నాలుకతో తడుపుకుంటూ.

"అదుగో అటువేపు చూడు! చెట్లచాటుగా గుడిసెనో లేక పూరిల్లో కన్పించడం లేదూ! పొగ కూడా........" వేలుతో చూపిస్తూ అన్నాడు.

"ఇప్పుడక్కడి దాకా వెళ్ళి రావలసిందేనా?...."

"తప్పదు మరి!" ఇకముందైనా అంతకంటే దగ్గరగా రోడ్డు నానుకుని ఉన్న ఊళ్ళు లేవు సిటీ చేరేదాకా.

"నాకు దాహమూ వేస్తోంది. ఆకలిగానూ వుంది" నీరసంగా అందామె.

"ఆ హోటల్లో తిందామంటే కాదన్నావు."

"అబ్బ అది హోటలా, ఛీ ఛీ! దాని మాటెత్తకు నాకు కంపరం పుడుతుంది"

"సర్లే! నువ్విక్కడే ఉంటావా నాతో వస్తావా?"

"అమ్మో! ఇక్కడుండడమే!" నిర్మానుష్యంగా ఉన్న ఆ ప్రాంతాన్ని చూస్తూ బెదురుతూ అంది ఆమె. "నేనూ వస్తాను" పెద్ద వాటర్ బ్యాగ్ తీసుకుని అతను దిగాడు. ఆమె కూడా దిగింది.

"అబ్బ ఏమెండ! మాడ్చేస్తోంది కదూ!" అంటూ పైటచెంగును తలచుట్టూ కప్పుకుంది.

"ఊ!" అన్నాడు. "ఈ వెధవ రోడ్డు మీద యిన్ని గంటల ప్రయాణం....ఖర్మ! అందులోనూ మంచి ఎండలో బయలుదేరదీశావు. అక్కడేం ముంచుకుపోతుందని? ఈ బ్యాగ్‌లో వాటరైనా పోసి ఉండకూడదూ?"

"ఇట్లా ఉంటుందనుకున్నానా నేను మాత్రం!" ఎండకు మాడుతున్న మొహాన్ని మరింత మాడ్చుకుంటూ అంది.

ఇద్దరూ రోడ్డు దిగి ఆ గుడిసె దిక్కుగా ముందుక్కదిలారు. వట్టి రాళ్ళు. ముళ్ళకంపలు. ఎగుడు దిగుడు నేల.

సగం దూరం నడిచారో లేదో ఆమె అలిసిపోయింది. "అబ్బ! ఇక నావల్ల కాదు బాబూ" అంటూ కూలబడింది.

"లే! ఈ నాలుగడుగులేగా!" ఆమె చేయి పట్టుకుని లేపుతూ అన్నాడు.

ఆమె ఉస్సురంటూ లేచి అతనితోపాటు ముందుకు నడిచింది.

ఐదు నిముషాలు నడిచేసరికి "అబ్బా!" అంటూ బ్యాగ్ వదిలేసి బొటనవేలు పట్టుకున్నాడతను వంగి. "ఏమయింది?" ఆదుర్దాగా గాభరాగా అడిగిందామె.

"ఎదురు దెబ్బ" కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుండగా అన్నాడతను.

"రక్తం కారుతోందా?"

"లేదులే!" పళ్ళు బిగబట్టుకుని లేస్తూ అన్నాడు.

ఆ మధ్యాహ్నపు మండే ఎండలో, ఆ ముళ్ళల్లో, రాళ్ళల్లో మౌనంగా మరో పదినిముషాలు నడిచాక ఆ గుడిసె చేరుకున్నారు. మబ్బుల్లేని ఆకాశం క్రింద నిశ్చలంగా నిలబడ్డ ఆ ఒంటరి గుడిసె ముందు వాళ్ళు రెండు క్షణాలాగే నిలబడ్డారు. ఒకరి మొహంలోకి ఒకరు చూసుకున్నారు. తర్వాత ఇద్దరూ వాకిలివేపు చూశారు. అతను మెల్లగా నిట్టూర్పి తడిక అడ్డం లేని వాకిలివేపు కదిలాడు. వాకిట్లో అడుగుపెట్టి, లోపలినుంచి వచ్చేపొగకు కళ్ళు మూసుకుని, మెల్లిగా తెరిచే ప్రయత్నంలో ఉన్నప్పుడు వినిపించిందతనికి.

"ఎవరూ? ఎవరూ అంటే పలకవేం?"

మరింత దగ్గరగా వచ్చిన ప్రశ్నకు అతి కష్టంమీద కళ్ళు విప్పి ఏదో చెప్పేలోగా మళ్ళీ ప్రశ్నించిందా ఆకారం "ఎవరు కావాలి?"

"వాటర్....ఉహూ... నీళ్ళు కావాలి."

ఆ ఆకారం యాభైయేళ్ళ ముసలావిడ. ముసలితనం వయసు మూలాన కాక పేదరికం మూలాన వచ్చినట్లుంది. చినిగిపోయిన బట్టలు. వదులవుతూ జారి ముడతలు పడే మొహంమీది తోలు. పొడుగు, నలుపు, అతని కళ్ళకు వికారంగా ఉంది.

"మంచినీళ్ళా?" సగం తెల్లబడ్డ జుట్టులో వేళ్ళు దూర్చి గోక్కుంటూ అంది.

"కాదు. మామూలు నీళ్ళే కారులో పోయాలి. ఇదుగో ఈ డబ్బాలో పట్టుకుపోతాము" అప్పుడు చూసింది ముసలామె అతని వెనక నిల్చున్న ఆమెను.

"మీ రిద్దరేనా వొచ్చింది?"

"అవును."

"మరి ఇంట్లో నీళ్ళు లెవ్వు. బాయికాడికెళ్ళాలి. ఇటురా చూపిస్తా" అంటూ బయటికి వచ్చింది. "అదుగో అక్కడ రాళ్ళగుట్ట లేదూ! దానెనకమాల. మా ముసలాడూ పెద్దాడూ బాయికాడే ఉంటారు. ఎల్లి తోడిచ్చుకో."

అతను మెల్లగా చెమట తుడుచుకుంటూ అటువేపు నడిచాడు.

అతన్నే చూస్తూ అలాగే నిల్చున్న ఆమెతో అంది ముసలామె. "రామ్మాయ్ రా! లోపల కూసుందువుగాని."

ఇద్దరూ లోపలికెళ్ళారు. ఎప్పుడూ ఎరగని పొగకు ఆమె కళ్ళంబడి నీళ్ళొచ్చాయి. మూల నుండి చింకి చాప తెచ్చి కూచోమంది—పరిచి ముసలావిడ. పొగకు కళ్ళు అలవాటు పడ్డాక గుడిసెలో కనిపించింది ఒక మూలగా మూడు రాళ్ళమీద కుండా, కుండకింద మండుతూ, ఆరిపోతూ ఉన్న పుల్లలూ. చుట్టూ నలుగురు పిల్లలు. పదేళ్ళలోపు పిల్లలు. ఒకరికీ ఒంటిమీద బట్టలు సరిగ్గా లేవు. ఇద్దరు దీక్షగా ఆమెవైపే చూస్తున్నారు. ఇద్దరు ఆమెవేపు ఓ క్షణం చూసి మళ్ళీ తల తిప్పి కుండవేపే చూస్తున్నారు.

ముసలామె పొయ్యి దగ్గరకెళ్ళి, ఊదుతూ అడిగింది. "ఏ వూరమ్మాయ్ మీది?"

చెప్పిందామె.

"అబ్బో! చాన దూరమే! ఆఁ....అయినా యెంత దూరంలే! కారుందంటివిగా! మీ ఇద్దరూ మొగుడూ పెళ్ళాలా?"

"ముక్కూ మొహం తెలీని ఆ ముసలావిడ యెదుట సిగ్గు పడుతూ అందామె. "ఇంకో నెలలో పెళ్ళి."

"ఎక్కడ్నుంచసలు మీ రొచ్చేది?"

చెప్పిందామె "పెళ్ళికి వెళ్ళి వస్తున్నాం. స్నేహితులది. వెళ్ళేప్పుడు దారి బాగానే ఉంది. మళ్ళీ వర్షానికి....అదసలే మట్టిరోడ్డు....తెగిపోయి....గతుకులు....ఛండాలం....ఛీఛీ!"

"బాగ ఎండలో బయలుదేరి ఉంటారు పాపం! అసలే నాజూకోల్లు. ఈ పల్లెటూళ్ళ రోడ్డులు ఎట్ట....అయ్యో మరిసేపోయాను. నువ్వసలు మంచినీళ్ళు తాగలేదుగా! ఒరేయ్ సిన్నాడా! లేసి మంచినీళ్ళు ముంచియ్యరా!" వాళ్ళల్లో చిన్నాడు లేచి తెల్లగ్లాసుతో మంచినీళ్ళు ముంచిచ్చాడామెకు.

బట్టలు లేని వాణ్ణీ, నాడి మురికి ఒంటినీ, అల్యూమినియం గ్లాసునూ, చూసి ఆమెకు కంపరం పుట్టుకొచ్చింది. అటువంటి దారిద్ర్యమూ, అసహ్యమూ నిండిన వాతావరణంలో చిక్కుకోవలసిన తన పరిస్థితికి తనను తాను తిట్టుకుంది. తిట్టుకుంటూనే ఎండిపోయిన గొంతుతో కషాయంలా తాగేసింది కళ్ళు మూసుకుని.

"మొన్నట్ట తుపానులాగ వొచ్చింది గదా వాన! మళ్ళీ ఇయ్యాల చూడు ఎండ యెట్టా మండిపోతాందో! ఇక పంటలు మాత్రం ఎట్ట పండుతయి పండమంటే. ఏం కరు వొచ్చి పడిందిలే యిక్కడ—నిరుడూ పంట ల్లెవ్వే ఆ దిక్కుమాలిన తుపాను మూలాన. ఈ ఏడు అసలు వాన లేక కరువయిపోయె. తిండిగింజల గ్గూడ కరువొచ్చి పడింది. ఊళ్ళో జనం సగం మంది లేసేపోయారు. ఊరు ఇక్కడికి దూర మేలే కొద్దిగా. మేము నేలకు కాపలా కాసే వోళ్ళం. ఇప్పుడు నేలూ లేవు కాపలా లేదు. ఇంక యెట్ట బతకాలో! ఏ బాయితో సూసినా సుక్క నీరుండటంలా. ఎట్టాగో దేముడి దయ వాల్ల తాగే నీళ్ళకు కరువు లేదులే. ఇక్కడే ఒక బాయి ఉంది మా కింద, ఊళ్ళో మారాజులు సల్లగుంటే మాకూ కాత్త పొరే త్తారు. పొద్దుటినుంచి ఇప్పుడుదాక తిరిగితే గిద్దెడు గింజలు దొరకలేదు."

ముసలామె కుండను దించి గంజి వార్చింది. పిల్లలందరూ యింకా దగ్గరగా జరిగారు. "ఆగండ్రా! ఆరనియ్యండి!"

"సెపితే యిని సావరు" విసుక్కుంటూ వాళ్ళ చేతుల్లో ఉన్న పళ్లాల్లో తలా కాస్త పోసింది.

"ఇంకా రాలేదే మా బావ?"

"వత్తా దొత్తాడు. యెండలో యెల్లి రావద్దూ!"

ముసలామె ఆమె దగ్గరిగా వచ్చి అంది మెల్లగా.

"నీ సీరా, జాకీటూ ఇప్పు" ఏ భావమూ లేని గొంతు.

"ఊ?....ఏమిటి....? ఎందుకు?...." అయోమయంగా అన్నదామె బిత్తరపోయి.

"ఎందుకేంది? వానాకాలం, సలికాలం, సలికి యెట్టా సత్తన్నమో నీ కెట్ట తెలిసిద్ది. కప్పుకో డానికి దుప్పటి లేదు. కట్టుకోడానికి గుడ్డలు లేవు. పిల్లలు సూడు యెట్టుండారో గుడ్డ ల్లేకుండా. ఇప్పు తొందరగా."

నిశ్చయంగా అది అడుక్కోవడం కాదు. "ఇప్పకపోతే?"

"నే నిప్పుకోలేనేంది! మీ పట్నపోళ్ళ బలం నాకు తెలవదా ఏంది?

"పోలీసు రిపోర్టు యిస్తే యేం చేస్తావు?" "పెట్టెలనిండా రంగు రంగుల సీరలు, జాకీట్లు పెట్టుకుని. మల్లీ యీ యెధవ సీరా జాకెట్టూ కోసం పోలీసోల్లకాడికి కెలతావా? సిగ్గెట్టాలేక పోయిందమ్మా ముందు యిడువు."

ఆమె బెదిరిపోయింది. మెల్లిగా ఒక్కొక్క హుక్కూ తీసి జాకెట్ విప్పింది. చీర ఇడువు మెల్లిగా నవ్వుతూ మళ్ళీ అంది ముసలామె. ఆమె నున్నటి భుజాలు చూస్తూ "ఎన్నపూసలా గుండావు. నేనే పనేముంది?

ఆమె చీర విప్పింది.

"అబ్బో! ఈ లంగా బలే మెరుత్తుందే" తన నిస్సహాయ స్థితికీ, సిగ్గుకూ ఆమె కళ్లం బటి నీళ్లు తిరిగాయి.

"అడుగో వత్తన్నాడు నీ కాబోయే మొగుడు" బయటి కెళ్ళి చూస్తూ అంది ముసలామె.

ఆమె బయటికొచ్చింది. ఎండకు వీపూ భుజాలూ మండిపోయాయి. అతను వాటర్ బ్యాగ్ బరువుగా మోస్తూ వస్తున్నాడు. ఒంటి నిండా చెమట కారుతుంది. ఒంటిమీద డ్రాయర్ తప్ప మరేం లేదు. అతని వెనక మరొక యువకుడు, ముసలామె పెదకొడుకు. ఆ యువకుని చేతిలో అతని ప్యాంట్, షర్టూ.

"మరిసిపోయా! ఆ సెప్పులు ఇడువు, సలి కాలం ఈ ముళ్లల్లో రాళ్లల్లో పొద్దున్నే లేసి ఎల్తంటే కాళ్ళెట్ట మండిపోతయ్యని?" ముసలామె చెప్పులు లాక్కుని ఇంట్లో కెళ్ళింది.

ఆమె కిక దుఃఖం ఆగింది కాదు ఈ అవతారాలతో ఇళ్ళ కెట్లా వెళ్ళడం? అతనూ దగ్గరికి వచ్చేశాడు. అతనికి పరిస్థితి అర్థమయ్యింది. ఆమె వెక్కుతూ వెక్కుతూ అతని చేయి పట్టుకుంది.

గాలి వీచని ఆ మధ్యాహ్నపు ఎండలో ఎప్పుడూ ఎరగని ఆ రాళ్ళల్లో, ముళ్ళల్లో, చెప్పుల్లేని సున్నితమైన కాళ్ళతో, తలా, కాళ్ళూ మాడిపోతుంటే బరువుగా వగరుస్తూ అతనూ, మధ్య మధ్య వెక్కి వెక్కి ఏడుస్తూ ఆమే మెల్లిగా కారువేపు నడిచారు. □



# స్వప్నసింహాసనం



యద్దనపూడి సులోచనారాణి

సీరియల్

## 17

సుధీర్ నిశ్చేష్టుడైనట్టు చూస్తున్నాడు.

స్వప్న చూపుల్లోగాని, కదలికలోగాని, రవంత కూడా తడబాటులేదు! తను చేయదల్చుకున్నదేదో సుస్పష్టంగా తెలిసిన స్థిరత్వం ఆ ముఖంలో కన్పిస్తోంది! జీవితం అంటే నిర్భయత్వం, విశాలమైన ఆ కనుదోయిలో ప్రతిబింబిస్తోంది!

అతను స్వప్ననే రెప్పవాల్చడం మర్చిపోయినట్టు చూస్తున్నాడు!

స్వప్న దూరంగా వెళ్ళిపోవటానికి నిశ్చయించుకుంది! సుదూరంగా వెళ్ళిపోవటానికి సిద్ధమౌతోంది? తను అందుకోలేనంత దూరం అది! ఆ క్షణంలో స్వప్న క్రైస్తవ మతప్రచారకురాలిగా అతని కళ్ళముందు కన్పిస్తోంది! నో! నో! యిది జరగటానికి వీల్లేదు! సుధీర్ దవడ ఎముక బిగిసింది! అతని ముఖంలో క్రమంగా రక్తం పొంగుకువస్తున్నట్టు కందిపోయింది!

మనసులో ఆవేశాన్ని అతను చిక్కబట్టుకున్నాడు.

"స్వప్నా! నువ్వు తీసుకున్న నిర్ణయం సరైనది కాదు!" అస్పష్టంగా అన్నాడు.

"నాకు సరైనదిగానే తోస్తోంది!"

"నో! నువ్వు ఆవేశంలో వున్నావు! నేను చేసిన తప్పుకి నీకు నువ్వు శిక్ష విధించుకుంటున్నావు! ఇది చాలా అన్యాయం!"

ంగిన కథ :

తనని బలవంతం చేసిన పొరుగింటి మోహన్‌ను ఆత్మరక్షణార్థం చేతికందిన వస్తువుతో కొట్టింది స్వప్న. మోహన్ మరణించాడు. స్వప్నపై హత్యానేరం మోపబడింది. ఆ షాక్‌తో స్వప్న తల్లి చనిపోయింది. స్వప్న మేనమామ లక్ష్మీరంజనం స్వప్నను కాపాడమని తన శిష్యుడు సుధీర్‌ను కోరాడు. సుధీర్ తన ప్రతిభతో స్వప్నకు శిక్షపడకుండా చేశాడు. స్వప్నకు సీరియస్‌గా వుందన్న కబురు తెలిసి పార్టీనుంచి ఆందోళనగా వెళ్ళాడు సుధీర్. స్వప్నను హాస్పిటల్‌లో చేర్పించాడు. సుధీర్ సహాయం వద్దనుకొనికూడా పొందవలసే వచ్చింది. స్వప్న మేనమామ వెంట వాళ్ళింటికి వెళ్ళింది. మేనమామ భార్య రుసరుసలాడింది స్వప్నని చూసి. మేనమామ భార్య తనకు బలవంతంగా పెళ్ళి ఏర్పాటు చేస్తే తప్పించుకు పారిపోయింది స్వప్న. ఒక డాక్టరు మిత్రుడు ఫోన్ చేస్తే వెళ్ళిన సుధీర్ పెళ్ళిదుస్తుల్లో వున్న స్వప్నను అక్కడ చూసి ఆశ్చర్యపోయాడు. స్వప్నను నర్సు మరియమ్మ ఇంట్లో ఉండే ఏర్పాటు చేశాడు డాక్టరు. స్వప్న కారణంగా తనకిచ్చిన మాట పోగొట్టుకున్నందుకు సుధీర్‌పై కోపగించుకొంది విమల. స్వప్నని ఓదార్చి, పెళ్ళి చేసుకొంటానని చెప్పి, తన కౌగిలిలోకి తీసుకొని ముద్దాడినట్లు కలగన్నాడు సుధీర్. మెలకువ వచ్చినా స్వప్నని తాకిన అనుభూతిని మాత్రం మరువలేకపోయాడు. తల్లి బలవంతాన, విమలకు సారీ చెప్పేందుకు బయలుదేరాడు సుధీర్. ఆపదలో వున్న స్వప్నను తా నాదుకోవలసిన పరిస్థితులను మామయ్యకు వివరించి, తర్వాత విమలతో ముచ్చట్లాడి ఆమె కోపాన్ని పోగొట్ట గలిగాడు సుధీర్. సుధీర్ ప్రోత్సాహంతో బి. ఎ. పరీక్షకు కట్టింది స్వప్న. తనకు తెలియకుండానే సుధీర్‌ని అభిమానించ సాగింది. పరీక్షలయ్యాయి. సుధీర్ మేనమామ కూతురు విమల స్వప్నని అవమానించింది.

"ఇందులో న్యాయాన్యాయాల ప్రసక్తేలేదు."

"గుడిలో ఆ రోజున విమల అలా అవమానం చేయకపోయినట్టయితే, నువ్వీ నిర్ణయానికి వచ్చేదానివా! నిజం చెప్పు."

స్వప్న ముఖం తిప్పుకుంది. "విమల నా కళ్ళు తెరిపించింది! నేనున్న పరిస్థితి నాకు అర్థమయేలా చేసింది! విమలమీద నాకేం కోపంలేదు. నిజం చెప్పమంటున్నారు మీరు. నిజమే చెప్పాలంటే, విమలకి నేను కృతజ్ఞతలు చెప్పాలి!"

సుధీర్ రెండడుగులు వేసి స్వప్న దగ్గరకు వచ్చాడు "స్వప్నా! నువ్వు మత ప్రచారకురాలిగా వెళ్ళటానికి ఎందుకు నిర్ణయించుకున్నావంటున్నావు! ఒంటరితనం తప్పించుకోవటానికి! అంతేనా? నీకు ఆశ్రయం కావాలి! రక్షణ కావాలి! అంతేగా!"

స్వప్న అతని వైపు ముఖం తిప్పలేదు! దూరంగానే చూస్తోంది! స్వప్న

నిటారుగా నిలబడిన ఆ తీరు చూస్తుంటే, అతనితో అలా సన్నిహితంగా, ముఖాముఖీ నిలబడటం ఎక్కువసేపు భరించలేనట్టుగా శక్తికి మించిన పనిచేస్తున్నట్టుగా వుంది!

సుధీర్ రెట్టిస్తున్నట్టుగా అడిగాడు. "జవాబు చెప్పవేం! అంతేనా?"

అంతేనన్నట్టు తల వూపింది.

అతను దృఢచిత్తంతో అన్నాడు. "వాటికోసమే అయితే, నువ్వు అంత దూరం వెళ్ళనవసరం లేదు!"

స్వప్న చురుగ్గా తలతిప్పి అతని వైపు చూసింది. ఆ కళ్ళలో "అంటే?" అన్న ప్రశ్నార్థకం కన్పిస్తోంది.

"స్వప్నా నా దగ్గరికి రా! నీకేం కావాలో తీసుకో!"

స్వప్న కళ్ళలో విభ్రాంతి కన్పించింది.

"ఈ మాట నేను ఎప్పుడో, చెప్పవలసింది! జాప్యంచేసినందుకు, నువ్వు, నేను, యిద్దరం కష్టపడ్డాం!"

"నేను, నేను-నిన్ను పెళ్ళిచేసుకుంటాను!" తగ్గుస్వరంలో అన్నా డతను.

ఈ మాట వినగానే, స్వప్న నిటారుగా అయింది.

గదిలో క్షణంసేపు నిశ్శబ్దం ఏర్పడింది! ఆ నిశబ్దంలో ఒకరిని ఒకరు చూపులతో ఆకళింపు చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నట్లుగా, మౌనంగా నిల్చుండిపోయారు! సుధీర్ అన్న మాటలు వినగానే స్వప్న ముఖంలోకి లిప్తపాటు అపూర్వమైన తేజస్సు వెల్లువలా వచ్చింది. కానీ క్రమంగా అది తరిగిపోయింది.

"మీరేం మాట్లాడుతున్నారో మీకు తెలియడంలేదు."

"ఎందుకలా అనుకుంటున్నావు?"


"ఈ మాట అనడానికి మీకు స్వతంత్రం లేదు! మీరు మరో వ్యక్తికి బంధితులు అన్న సంగతి మీకంటే నాకే బాగా తెలుసేమో!"

"విమల సంగతేనా నువ్వు చెప్పేది!"

స్వప్న మాట్లాడలేదు.

"ఆ సంగతి నువ్వు వదిలేయ్! దానితో నీకే మాత్రం సంబంధంలేదు! నేను ఎవ్వరికీ ఏ రకంగానూ, బంధితుడిని కాదు! నా జీవితంలోకి వస్తే త్వరలోనే ఇది నీకు తెలుస్తుంది! స్వప్నా! నాతో తర్కంలోకి దిగకు! నన్నేమీ ఇక ప్రశ్నించకు! నువ్వు నాకు కావాలి! ఈ సంగతి నిన్ను హాస్పిటల్లో చేర్పించినప్పుడే తెలుసుకున్నాను! నిన్ను నా జీవితంలోకి, మా వాళ్ళని ఒప్పించిం తర్వాత తీసుకురావాలనే తలంపుతో, యిన్నాళ్ళూ జాప్యంచేసాను! అది సరైన ఆలోచన కాదని యిప్పుడు తెలిసింది! నిన్ను నా దాన్ని చేసుకున్న తర్వాత, వాళ్ళకి తెలియచేస్తాను!" అతను అంటూనే స్వప్న చేయి అందుకున్నాడు. "యింకేం మాట్లాడకు! ప్లీజ్ నన్నర్థం చేసుకో!" స్వప్న చేతిలో ముఖం ఆనించుకుని కళ్ళు మూసుకుంటూ అన్నాడు.






స్వప్న అతన్నే చూస్తోంది! అరచేతిలో అతని ముఖం స్పర్శ గమత్తుగా వుంది! శూన్యంలో తడుముకుంటున్న మనసుకి, ఆ స్పర్శ ఆలంబన దొరికినట్టుగా వుంది!

స్వప్నకి ఏడుపు వచ్చేస్తోంది! తను ఎంతో ఘర్షణకి గురి అయి,ఈ నిశ్చయానికి వచ్చింది! దానికి తిరుగులేదు అనుకుంది. కానీ, అంతకష్టపడి, చేసుకున్న ఆ దృఢ నిశ్చయం, అతని మాటల మంత్రజలంతో ఆవిరి అయిపోయినట్టుంది!

ఆ నిశ్చయానికి బలంలేనట్టు వూగిసలాడుతోంది! ఇదేమిటి! తను యింత చపలచిత్తురాలా! తన మనసుమీద తనకు అదుపులేదా!

సుధీర్ ముఖం ఎత్తాడు. "స్వప్నా! ఒకటి మాత్రం నిజం! నా జీవితంలోగాని, మనసుమీదగాని ఎవరి పెత్తనమూలేదు. ఏనాడయినా, అది వుందని నీ కన్పిస్తే ఒక్క నిముషం కూడా నువ్వు నా జీవితంలో వుండవద్దు! అప్పుడు నిజంగా, యిలాగే నీ యిష్టం వచ్చిన రీతిలో వెళ్ళిపోదువుగాని! సరేనా!"

స్వప్న అతనివైపే చూస్తోంది. అతని కళ్ళలో కన్పిస్తున్న ఆత్మీయత, అనురాగానికి, స్వప్న మనసు విస్తుపోతోంది! ఘనీభవించినట్టుగా స్వప్న చేసుకున్న దృఢనిశ్చయం పొగపంచులా తేలిపోతోంది.

"నీకు రక్షణ కావాలి! ఆశ్రయం కావాలి. ఒంటరితనం వుండకూడదు!" ఇవి అతనుయిస్తానంటున్నాడు. నువ్వు కోరినవి అవే అయినట్టయితే, యిక మతప్రచారసేవకురాలిగా, యెందుకు వెళ్ళటం! అతని జీవితపు నీడలో యెందుకు సేద దీరకూడదు!

"స్వప్నా!" అతను చెయిపట్టి దగ్గరకు లాక్కున్నాడు. మరోచెయి స్వప్న భుజాలుపట్టి దగ్గరకు హత్తుకుంది. మరుక్షణం స్వప్న ముఖం అతని గుండెల్లో ఒదిగింది! స్వప్నకి హఠాత్తుగా కాలం, మనసు, ఆలోచన నిర్ణయం, గమ్యం అన్నీ అంతమైపోయినట్లుగా, అనిపించింది!

"స్వప్నా!" అస్పష్టంగా అంటున్నాడతను. స్వప్నకి తన వునికే పోయినట్టుగా అయింది! అదొక విచిత్రమైన స్థితి! శరీరం భయం వదిలేసి తేలిక అయింది! మనసు ఘర్షణ మానేసి, శాంతి పొందింది!

"స్వప్నా!" అతనిచేయి స్వప్న జుట్టుని నిమురుతోంది!

ఎంతసేపు యిద్దరూ అలా సర్వం మరిచిపోయినట్లుగా నిలబడిపోయినారో, తెలియదు! ఇంతలో అడుగుల చప్పుడు అయింది. సుధీర్ తిరిగిచూసేలోపలే మోసెస్ లోపలకి వచ్చారు.

స్వప్న తలెత్తి చూసేనరికి ఆయన గదిలోకి వచ్చేసాడు.

స్వప్న సుధీర్ నుండి దూరంగా వెళ్ళబోయింది కానీ సుధీర్ స్వప్నని సొంతం వదలలేదు. చేయిపట్టుకునే మోసెస్‌కి విష్‌చేసాడు. ఆయన దళసరి కళ్ళద్దాలలో నుంచి, కనుబొమలు ముడిచి చూస్తున్నాడు. ఆ చూపులకి అర్థం తెలియనివాడిలా సుధీర్ అన్నాడు.

"స్వప్న, నేను పెళ్ళిచేసుకోవటానికి నిర్ణయించుకున్నాం! మా మధ్య చిన్న ఘర్షణ జరిగింది! స్వప్నకి నా మీద కోపం వచ్చింది! మత ప్రచారకురాలిగా వెళ్ళిపోవటానికి నిశ్చయించుకుంది. నౌ ఎవ్విరిథింగ్ యీజ్ ఆల్‌రైట్. మేం యిద్దరం రాజీ పడ్డాం! స్వప్నని నాతో తీసుకువెళ్తున్నాను!" అన్నాడు.

మోసెస్ స్వప్నవైపు చూసాడు.

స్వప్న తలెత్తలేదు.

"నిజమేనా స్వప్నా!" ఆయన అడిగాడు.

తడబాటుగా తల తిప్పింది.

"ఓ. కే! కంగ్రాచ్యులేషన్స్!" ఆయన కంఠంలో నిరాశ స్పష్టంగా ప్రతిధ్వనిస్తోంది.

"వెళదామా స్వప్నా!" సుధీర్ అడిగాడు.

స్వప్న అతనివైపే చూస్తోంది.

"నీ సామానేమయినా వుందా యిక్కడ?"

స్వప్న తలవూపింది. అక్కడ నుంచి లోపలకి వెళ్ళింది. ఐదునిమిషాల తర్వాత పెట్టెతో తిరిగి వచ్చింది. సుధీర్ అది అందుకున్నాడు. తీసుకెళ్ళి కారులో పెట్టాడు.

మోసెస్ స్వప్నతో తమని మర్చిపోవద్దని చెబుతున్నాడు. సుధీర్ కారు డోర్



తెరిచాడు. స్వప్న మోసెస్‌తో వెళతానని చెప్పింది. ఆయన ఆశీర్వదిస్తూ అన్నాడు. "చర్చి తలుపులు ఎప్పుడూ నీలాటి వారికోసం తెరిచేవుంటాయి! నీకు ఎప్పుడు రావాలని అనిపిస్తే అప్పుడు రా స్వప్నా!"

స్వప్న తలవూపింది.

స్వప్న కూర్చోగానే, సుధీర్ డోర్ వేసాడు. తను వచ్చి డ్రైవర్ సీటులో కూర్చున్నాడు.

కారు స్టార్ట్ అయింది. స్వప్న యింకా అలాగే నిటారుగా కూర్చుంది! వీధుల్లో, సాయంత్రంవేళ అవడంతో జనం చాలా రద్దీగా వున్నారు! స్వప్న మనసు ఆ వీధుల్లోని జనంలో నుంచి తేలిపోతున్నట్లుగా వుంది.

ఏం చేస్తోంది తను! ఏమి ఆలోచించింది! జరిగిందేమిటి!

"ఆకలేస్తోంది. ఏమైనా తిందామా?" అన్నాడతను. స్వప్న మాట్లాడలేదు.

కారు హోటల్ ముందు ఆగింది. స్వప్న కలలోగా సుధీర్ వెంట నడిచివెళ్ళింది. అతను స్వీట్‌కి ఆర్డర్ యిచ్చాడు.

స్వప్న అలాగే చూస్తోంది.

"ఏమిటి ఆలోచిస్తున్నావు?" చెయి జాచి స్వప్న చేతిమీద ఆనిస్తూ అడిగాడు.

"ఏమీలేదు! నాకసలు ఆలోచనాశక్తి పోయినట్టుగా వుంది! నేనేం చేశానిప్పుడు! మీతో వచ్చేశాను కదూ?"

"అవును!"

"నాకెలాగో వుంది! నేనేం చేస్తున్నానో నాకేం తెలియటంలేదు!" స్వప్న రెండుచేతులు కళ్ళమీద ఆనించుకుని, తల దించుకుని కూర్చుంది.

అతను ఒక్కక్షణం తర్వాత మృదువుగా పిల్చాడు. "స్వప్నా?"

స్వప్న మాట్లాడలేదు.

"ఒక్కసారిలా చూడు" అర్థింపుగా అడిగాడు.

కళ్ళు తెరిచింది.

అతను జేబులో నుంచి జేబురుమాలు తీసి టేబిల్‌మీద పరిచాడు.

"చూడు. ఇది నా జేబురుమాలు? నీ కలతలు, భయాలు, అనుమానాలు అన్నీ యిందులో వేసెయ్యి. నేను మూటగట్టి తీసుకుంటాను!"

స్వప్న క్షణంసేపు తెల్లటి ఆ జేబురుమాలు వైపు చూసింది. "తీసుకుని? తీసుకుని మీరేం చేస్తారు!"

"ఏంచేస్తానా? మూటగట్టి ఎంచక్కా తీసుకెళ్ళి టాంక్‌బండ్ మీంచి హుసేన్ సాగర్‌లో పారేస్తాను!"

అతను స్వప్నచేతిని నొక్కాడు. ఇంతలో సర్వర్ స్వీట్ తెచ్చాడు. సుధీర్ జేబురుమాలు పక్కకి జరిపాడు. గడ్డం చేతికి ఆనించుకుని స్వప్న దీర్ఘాలోచనలో మునిగిపోయినట్టు అలాగే కూర్చుంది.

సుధీర్ చెంచాతో స్వీట్ తీసాడు. అది స్వప్ననోటికి అందిస్తూ, "విష్ యూ ఆల్ ది లక్" అన్నాడు.

స్వప్న తిండి సుధీర్ చెంచాతో స్వీట్‌తీసి నోట్లో పెట్టుకోబోతూ, "నన్ను విష్ చెయ్యవా?" అన్నాడు.

స్వప్న ఆ చెంచా అందుకుని, అతని నోటికి స్వీట్ అందించింది.

"విష్ యూ బెస్టాఫ్ లక్!" అంటూంటే, ఎందుకోగాని స్వప్న కంఠం వణికింది.


సుధీర్ స్వప్నచేయి గట్టిగా పట్టుకున్నాడు. స్వప్న హఠాత్తుగా ముఖం ఆ చేతిలో దాచుకుని ఏడ్చేసింది.

"ఏయ్! ఏమిటిది!"

"నిజం! నేనేం చేస్తున్నానో నాకు తెలియటంలేదు! నేను మీతో ఇలా రావటం సరైన పని అవునో కాదో అర్థంగావటంలేదు! మిమ్మల్ని యిబ్బందిపెట్టకూడదు! ఇది మొదటి ఆలోచన! దానికోసమే-దానికోసమే-నేను క్రిష్టియన్‌గా కన్వర్ట్ అయిపోవాలని అనుకున్నాను!"

సుధీర్ లేచి వచ్చి దగ్గరికి తీసుకున్నాడు.






"నాకు తెలియదా? ఆ మాత్రం గ్రహించలేని మూర్ఖుడిని అనుకుంటున్నావా!"

"నాకు తెలుసు! నేను మిమ్మన్ని చాలా ఇబ్బంది పెడతాను!"

"అలా ఎందుకనుకుంటావు! నువ్వు నాకు చాలా సంతోషం కలగచేస్తున్నావు! అది గుర్తు చేసుకోవేం?"

స్వప్న తలెత్తి చూసింది. ఏడుపుతో చారికలు కట్టున్న ఆ ముఖం కంది వుంది! కళ్ళు ఎర్రగా వున్నాయి! కళ్ళలో నీళ్ళు వుబుకుతున్నాయి.

"నేను-నేను-సంతోషపెట్టగలనా! నిజమా!"

"నిజం!" స్వప్న తలని దగ్గరకి హత్తుకున్నాడు.

"మీ-మీ-మామయ్య వాళ్ళు మీతో పోట్లాడరా!"

"పోట్లాడితే ఏమౌతుంది? నాకు కావాల్సిన నువ్వు నాకు దొరికినప్పుడు! స్వప్నా! నేను రెండే రెండు ఆలోచించాను. నిన్ను వదులుకుని, వాళ్ళతో శాంతిగా వుండటమా! లేక నిన్ను పొంది, వాళ్ళతో ఘర్షణ పడటమా! అని. రెండోదే సబబుగా తోచింది! నా మనసు అదే కావాలని అనుకుంది! అందుకే నిన్ను వెతుక్కుంటూ వచ్చాను! నిన్ను నా దాన్ని చేసుకోవటానికి నిశ్చయించుకున్నాను! నువ్వు ధైర్యంగా, సంతోషంగా వుంటే, నాకు సంతోషంగా వుంటుంది! ఈ మాట బాగా గుర్తుపెట్టుకో! పెట్టుకుంటావు కదూ!"

"నేను-నేను అంటే ఎందుకు మీకింత యిష్టం?"

అతను క్షణంసేపు జవాబుచెప్పలేనట్టు చూశాడు. తర్వాత మెల్లని స్వరంతో అన్నాడు. "అది నేను చెప్పలేను! ఎప్పటికైనా నువ్వే తెలుసుకుందువుగాని!" అతని కంఠం చిత్రమైన భావంతో కంపించింది. (సశేషం)

కళాశాల విద్యార్థుల చిన్న చిన్న కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ

# రైలు ప్రయాణం

కుందుర్తి ఇందిరాదేవి, బి.కాం., (తృతీయ)
యస్. కె. ఆర్. బి. ఆర్. కాలేజి, నర్సరావుపేట.

రైలు సంధించిన బాణంలా వెడుతోంది. రివ్వున వీస్తున్న గాలి ఒంటిని తాకి చక్కిలిగింతలు పెడుతోంది.

సెలయేరు రాళ్ళ రప్పలు దాటుకుంటూ వేగంగా సంగీతం తీస్తున్నట్టుగా ప్రవహిస్తుంటే, యేటిఒడ్డున కూర్చున్న వారికి తన్మయత్వంతో ఒక అద్భుతమయిన దృశ్యాన్ని చూస్తున్నట్టు, వీనులవిందయిన సంగీతాన్ని వింటున్నట్టు అనిపిస్తుంది. అలాగే రైలు ప్రయాణంలో, కిటికీ పక్కనే కూర్చుంటే, రివ్వున వెడుతున్న రైల్లోంచి హరితవర్ణంలో వున్న పొలాలు, ఆకాశమంటుతున్నట్టుండే వృక్షరాజాలు, దట్టమయిన పొదలు, రాళ్ళు, తుప్పలతో కూడినటువంటి ప్రదేశాలు, కొండలు కంటికింపుగా మనోహరంగా కనిపిస్తూ వుంటాయి.

ఇవన్నీ దాటుకుంటూ ప్రయాణిస్తున్న రైల్లో కిటికీ ప్రక్కగా కూర్చుని ప్రకృతి దృశ్యాలను తదేకంగా చూస్తున్న కమల పక్కకి తిరిగి చూసింది.

గుమ్మంలో తలుపుకి ఆనుకుని నిలబడి తననే చూస్తున్న అతన్ని చూడగానే కమల కళ్ళల్లో ఆనందం లాటిది తళుక్కుమని, అంతలోనే సిగ్గు దోబూచులాడింది.

పెళ్ళయి మూడు నిద్రలకు అత్తవారింటికి వెడుతున్న కమలకు తోడుగా చెల్లెలు జ్యోతి, వదిన సరళ వచ్చారు.

సరళ, కమల అత్తగారితో పెళ్ళిళ్ళ గురించి, ఫ్యాషన్ల గురించి చెబుతూ, మధ్య మధ్య తన కోరికలు వెళ్ళబోసుకుంటోంది.

చెల్లెలు జ్యోతి పెళ్ళికొడుకు చెల్లెలితో అప్పుడే స్నేహం కలిపేసి, తన స్కూలు కబుర్లు చెబుతూ, ఆ అమ్మాయితో గూడా వాళ్ళ స్కూలు కబుర్లు చెప్పిస్తూ ఆసక్తిగా వింటోంది.

అందరూ ఎవరి కబుర్లలో వాళ్ళుండబట్టే అతనంత సూటిగా తననే చూస్తున్నాడు. ఈ ఆలోచన రాగానే కమల సిగ్గుపడిపోయింది. అతన్నే ఎంచక్కా చూడాలని తనకూ అనిపిస్తోంది. అమ్మో! చూస్తే ఇంకేమైనా వుందా. కొత్తపెళ్ళికూతురు సిగ్గులేకుండా అప్పుడే భర్తని ఎలా చూస్తోందో చూడు! అని అందరూ అనుకోరూ!

ఇలా ఆలోచిస్తూ కమల మధ్య మధ్య అతన్ని దొంగచూపులు చూస్తూ కిటికీవైపు చూపులు తిప్పుకుంటోంది.


పాపం అతనెంతసేపు నిలబడతాడు? కాస్త అటువైపు సర్దుకుని కూర్చోగూడదూ! గంటన్నరనుండి అతనలా నిలబడే వున్నాడు. అటువయిపంతా పెట్టెలు, బుట్టలతో అసలు కాళ్ళు పెట్టటానికి వీల్లేకుండా వుంది.

కమల ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ రైలు ఒక స్టేషన్‌లో ఆగింది. అతను క్రిందకు దిగాడు. కమల అతను వెళ్ళినవైపే చూడసాగింది. అతని పేరు ఆనంద్. ఎంత చక్కనివాడు! అతన్ని చూసి పెళ్ళిలో తన స్నేహితులంతా ఎంత గోల చేశారు!

"హల్లో మిసెస్ కమలానంద్" అంటూ సరోజ ఎంత వుడికించింది!

మొదట అన్నగారు ఈ సంబంధం తెచ్చినప్పుడు తను ససేమిరా అంది. అంతకు ముందు ఇలా పెళ్ళి చూపులకు వచ్చే ప్రతివాడి ముందు కూర్చుని చిరాకెత్తిపోయిన తను అసలు పెళ్ళే చేసుకోనంది. వచ్చినవాళ్ళు, తను నచ్చలేదనో అమ్మాయి నచ్చితే కట్నం నచ్చలేదనో వంకపెట్టేవారు. అది నిజంగా ఎంత నరకం! కానీ వీళ్ళు వచ్చి చూడటం, తను నచ్చిందనటం, వెంటనే తాంబూలాలు పుచ్చుకోవటం, పెళ్ళి జరగటం టక టకా జరిగిపోయాయి. ఎంత చిత్రంగా వుంది? కమల మెళ్ళో మంగళసూత్రాలు తడుముకుంటూ తలెత్తి చూసింది.

అతను ఇంగ్లీష్ మాగజైన్స్, తెలుగు పత్రికలు కొంటున్నాడు. జ్యోతి, శారద కూడా దిగి అతనివైపు పరిగెత్తారు. అతను కాఫీ తాగుతూ ఇటే చూస్తూ ఏవో అంటున్నాడు. ఏమంటున్నాడు! కమల యోచించేలోపలే జ్యోతి కాఫీ కప్పుతో ప్రత్యక్షమయింది.


నాన్నగారికేవీ కాలేదు.. వెధవది నాకొహాటే డోకుతా తున్నా యెందుకే.. మమ్మీ

"అక్కా! బావగారు కాఫీ తాగమన్నారు" అంది.

కమల చప్పున కళ్ళెత్తి చూసింది. అతను 'తాగు' అన్నట్టు నవ్వాడు. కమల కాఫీతాగి తిరిగి కప్పు ఇచ్చేసింది. ట్రెయిన్ కదలటానికి సూచనగా గంటకొట్టారు. అందరూ ఎక్కారు. శారద పరుగెత్తుకొచ్చి పత్రికలు కమల చేతిలో పెట్టింది.

అరే రైలు కదులుతోంది అతను ఎక్కడేం! అమ్మో అతను ఎక్కకుండానే రైలు వెళ్ళిపోతే! అతన్ని చప్పున పిలవమని అత్తగారిని అడిగితే! పోనీ శారదతోనయినా చెప్తే! కమల శారదను పిలిచి చెప్పేలోగానే, అతను చేతిలో మరచెంబుతో కమ్మీ పట్టుకుని ఎక్కేశాడు.

అమ్మో జారిపడితాడేమో! కమల గుండెలు క్షణంసేపు కొట్టుకోవటం మానేశాయి. హమ్మయ్య ట్రెయిన్ ఎక్కేశాడు. కమల తేలిగ్గా వూపిరి పీల్చుకుంది. అయినా ఇదేం మనిషి బాబూ! అంతలా పరిగెత్తి వచ్చిచెడీ ఎక్కకపోతే ఏమయింది? కొంచెం ముందుగా ఎక్కగూడదూ!

అతను మరచెంబు తల్లికిచ్చేసి మేనమామతో మాట్లాడుతూ మధ్య మధ్య నవ్వు

తున్నాడు. అబ్బా! అతను నిజంగా ఎంతందంగా నవ్వుతాడు? నవ్వినప్పుడు కళ్ళు తమాషాగా చికిలించినట్టుగా వుంటాయి. అతను ఏదో చెబుతూ చప్పున తన మొహంలోకి చూశాడేమిటి?

కమల చప్పున కళ్లు వాల్చుకుంది. ఛీ అతనేమనుకుంటాడు? దొంగతనంగా చూస్తున్నాననీ అనుకుంటాడేమో! కమల కొద్దిగా కళ్లెత్తి అతనివైపు చూసింది. నిన్ను నేను కనిపెట్టాలే అన్నట్టు నవ్వాడతను. కమల చెంపలు ఎర్రబడినాయి.

పోనీ తను కూడా ఇంటికి వెళ్ళేవరకూ అతనివైపు చూడకుండా ఈ పుస్తకాలు చదివితే సరి. పత్రిక తీసుకుని కథ చదవటంలో మునిగిపోయింది.

అందులో కథానాయకుడు ఉష అనే అమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకుంటాడు. ఎంతో అన్యోన్యంగా సాగుతోంది వారి దాంపత్యం. హఠాత్తుగా ఒకరోజు అర్జెంటు పనిమీద వూరువెళ్ళి ఇంటిదగ్గర ఉష ఒక్కతే వుండలేదని అతను తిరిగి ప్రయాణమైనాడు. అతను గుమ్మంలో తలుపుకు ఆనుకుని నిలబడి పరధ్యానంగా చూస్తూ చప్పున కాలు జారిపడి రైలుక్రింద ప్రాణాలు కోల్పోతాడు.

కమల చప్పున చదవటం ఆపేసింది. ఒళ్ళంతా చెమటలు పట్టాయి. మైగాడ్! అతను కూడా ఎప్పుడూ తలుపు పక్కనే నిలబడతాడు. అతను కూడా........అమ్మో !ఇంకేమైనా వుందా?

కమల దడదడ లాడుతున్న గుండెలతో అతని వైపు చూసింది. అతనింకా చేతులు కట్టుకుని అక్కడే నిలబడి ఏమిటో మాట్లాడుతున్నాడు. అతను కూడా ఏమరుపాటుగా కాలు జారి....కమల చప్పున చేయిచాచి మరచెంబులో నీళ్ళు గ్లాసులోకి వంచుతున్న జ్యోతి చేతిలోంచి గ్లాసు లాక్కుని గడగడా తాగేసింది.

"అదేంటక్కా నువ్వు తాగేశావు? ఈ నీళ్లు బావగారి కివ్వాలనుకుంటే" జ్యోతి బుంగమూతితో చిరుకోపంగా అంది. అందరి చూపులూ కమలవైపు తిరిగాయి.

అతను నవ్వుతూ "ఫరవాలేదులే' జ్యోతీ నాకు మళ్ళీ ఇవ్వు" అన్నాడు.

నుదుటిమీద అలుముకున్న చెమటను అద్దుకుంటుంటే 'ఏమిటలా వున్నావు' అన్నట్టు అతను ఆశ్చర్యంగా ప్రశ్నార్థకంగా చూశాడు'

కమల ఏమీ లేదన్నట్టు తలూపింది. ఐనా గుబులు తీరలేదు. వదినను పిలిచి "వదినా...." అంటూ వివరంగా చెప్పింది.

సరళ నవ్వుతూ "అమ్మో! మీ శ్రీవారి గురించి అప్పుడే నీకెంత బెంగ? అయితే రేపు జీవితంలో అతన్ని వెయ్యి కళ్ళతో చూస్తూ గుప్తధనంలా కాపాడుకుంటావన్నమాట" అంది కొంటెగా.

కమల మొహం ఎర్రబడింది. సరళ జ్యోతి చెవిలో ఏదో చెప్పి పంపించింది. జ్యోతి వెళ్ళి అతనితో ఇటే చూపిస్తూ ఏదో చెబుతోంది. అతను జ్యోతి దగ్గరగా వంగి వింటూ నవ్వుతున్నాడు. తన ఆదుర్దా చూసి నవ్వుకుంటున్నాడేమో.

అతను ఏం చెప్పాడో ఏమో జ్యోతి తిరిగి వచ్చి,


"అక్కా! బావగారికి అలా అలవాటేట. నాకేం ఫరవాలేదు మీ అక్కను భయపడ వద్దని చెప్పు అన్నారు" అంది.

అయినా కమల స్థిమితంగా కూర్చోలేకపోతోంది. మైగాడ్! ఒకవేళ ఖర్మకాలి ఏదయినా జరిగితే, అసలే ఈ వెధవ రైలు అక్కడేదో కొంపలంటుకు పోతున్నట్టు పరుగులు తీస్తోంది.

అందరూ ఎవరి గొడవల్లో వాళ్ళున్నారు. ఎవ్వరూ అతన్ని కూర్చోమనరేం? అత్తగారికి మాత్రం మతి లేకుండా ఆ వెధవ కబుర్లు చెబుతూ, చుట్టరికాలు తిరగెయ్యకపోతే ఒక్కసారి కొడుకుని హెచ్చరించడేం? అతనేమో మహావీరుడిలా నాకలవాటేలే అని చెప్పాడు. "మీరు కూర్చోండి" అని తను చెప్తే? అమ్మో ఇంకా నయం! నిన్న పెళ్ళయిందో లేదో ఈ కోడలు పిల్లకి అప్పుడే అధికారం వచ్చిందా







అని అందరూ అనరూ!

ఏం చెయ్యాలో కమలకు దిక్కుతోచటం లేదు. అతను సీరియస్‌గా చెబుతున్న మాటలు మంద్రస్థాయిలో మధ్య మధ్య ఆ ఆడవాళ్ళ గొడవల్లోంచి కమల చెవుల్లో దూరుతూనే వున్నాయి. అతనేం చెప్తున్నాడో వినాలనుంది కానీ, మనసంతా అతనలా గుమ్మంలో నిలబడకుండా ఎక్కడయినా కూర్చోమని ఎలా చెప్పాలా అని తన్నుకులాడుతోంది.

రైలు కుదుపుకి అతను ముందుకు వాలబోయి కుడిచేత్తో కమ్మీని పట్టుకుని నిలదొక్కుకోవటం కమల కంటపడింది.

ఈ రైలు ప్రయాణం సక్రమంగా సాగుతుందో లేదో? ఈ వెధవ రైలు చప్పున గమ్యస్థానం చేరగూడదూ? కనీసం నెమ్మదిగానయినా పోవచ్చుగా! అతను అసలిదేమీ పట్టించుకోవటం లేదు. రేపు కాపరానికొచ్చాక అతనికి ఇటువంటి విషయాల్లో గట్టిగా వార్నింగ్ ఇవ్వాలి. కానీ ఈలోగా ప్రయాణంలోనే ఏదయినా జరగరానిది జరిగితే! కమల వీపుమీద భయంలాంటిది జర్రున పాకింది.

పెళ్ళయి ఇరవైనాలుగు గంటలు కాలేదు. తన మనసు అప్పుడే ఇన్ని శంకలతో నిండిపోయిందేమిటి? "ఓరి భగవంతుడా! అతనికేం కాకుండా కాపాడు తండ్రీ! కొబ్బరికాయ కొడ్తాను" మనసులోనే మొక్కుకుంది.

కమల గుండె ఇలా భయంతో కొట్టుకుంటుండగానే రైలు స్టేషన్‌లు మారిపోతూ సాగుతోంది. ఉన్నట్టుండి ఒక్క కుదుపుతో ఆగిపోయిన బండిలో కమల ఉలిక్కిపడి తేరుకుని చూసింది. అప్పటికే వీళ్ళు చేరాల్సిన ఊరు వచ్చేసింది. అతను సామాను దింపిస్తున్నాడు.

కమల తేలిక పడిన మనసుతో దేవుడికి మనసులోనే నమస్కరించి క్రిందికి దిగింది.

సామానంతా టాక్సీలో వేయించటం అందరూ రిక్షాలు ఎక్కటం జరిగిపోయింది. చివరగా ఆనంద్ రిక్షాలో కమలను కూర్చోమని తనూ కూర్చున్నాడు. అప్పుడే రైలు కూతవేసి బయలుదేరింది.

పక్కన ఎవరూ లేకపోవటంతో అతను ధైర్యంగా "నాకేమయినా అవుతుందని భయపడ్డావా?" అన్నాడు.

కమల చప్పున అవునన్నట్టు తలూపింది.

"నాకది అలవాటే" నవ్వుతూ అన్నాడతను.

"ఏమో నేను ఎన్నోసార్లు రైలుప్రయాణం చేశాను. కానీ ఈసారిలా ఎన్నడూ బాధపడటం, భయపడటం జరగలేదు" నెమ్మదిగా, మృదువుగా ఎంతో రిలీఫ్‌గా అంది కమల. □

* జ్యోతి కథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ

# ముసురు

## తులసీ బాలకృష్ణ

ద్వారబంధానికి భుజం ఆనించి నిలబడి, తలమీంచి తిప్పుకున్న పైట కొంగుని మునిపంట నొక్కిపట్టి, సమాంతర దూరాల్లో చూరునుంచి ఏకధారలుగా పడుతూన్న వాన నీటిని తదేకంగా కన్నార్పకుండా చూస్తోంది పంకజం. ఎడతెరిపి లేకుండా రెండు గంటల్నించీ జోరుగా పడుతోంది వర్షం. పెరట్లో మోకాలు లోతు నీళ్ళు నిలిచిపోయాయి. సన్నజాజి పందిరి బాగా క్రిందకు వంగిపోయింది. అరిటి ఆకులన్నీ చిరిగిపోయి, రిబ్బన్లలా వ్రేళ్ళాడుతున్నాయి. గులాబీపూల రేకులు రాలిపోయి, నీటిలో దోనెల్లా గంటక్రితమే కొట్టుకుపోయాయి.

పిల్లలిద్దరూ నిద్రపోతున్నారని లైటు ఆర్పేసి, బెడ్‌లైట్ వెలిగించింది పంకజం. ఆఫీసులో పనుండిపోయిందో, లేక వర్షం కారణంగానో భర్త యింకా రాలేదు. ఉన్నట్టుండి జల్లుకొట్టి, ముఖం అంతా తడిసి, ఒళ్ళు తిమ్మెర్లెక్కుతోంది. చక్కిలిగింతలు పెట్టినట్లయి, లోలోనే నవ్వుకుంది పంకజం. పిల్లలిద్దరూ రగ్గులు కప్పుకుని, హాయిగా నిద్రపోతున్నారు. 'అదృష్టవంతులు—తీరక, మనసుని పిండే కోరిక అంటూ ఏదీ వుండదు వాళ్ళకి' అనుకుంది.

నిలువునా కురుస్తోంది వర్షం. నిలిచిన నీటిమీద పడ్డ వానచినుకులు చక్కటి చప్పుడు చేస్తున్నాయి. ఆ నీటిమీద చావడి రూములోని లైటుకాంతి వారగా వేసిన తలుపుల సందులోంచి సన్నగా, పొడుగ్గా పడుతోంది. ఆ కాంతిలో చినుకులు బంగారు సూదల్లా, భాసిస్తున్నాయి.

నీటిమీద పెద్దకాంతి పడటంతో ఉలిక్కిపడి చటుక్కున అటు చూసింది పంకజం. సైకిల్ లైటు రానురాను పెద్దదై నీటిమీద పడుతోంది. ప్యాంటుకాళ్ళు మోకాళ్ళ వరకు మడిచి, రైనుకోటు, టోపీధరించి, నీటిలో బలంగా అడుగులు జరుపుతూ వచ్చాడు శివరావు, సైకిల్ నడిపించుకుంటూ. అతను యింట్లోకి అడుగు పెట్టేలోగానే తువ్వాలుతో సిద్ధంగా వుంది పంకజం.

శివరావు బట్టలు మార్చుకుని, వచ్చేలోపల వేడివేడిగా దోసెలు వెయ్యసాగింది.

"మరి నువ్వో?" అన్నాడు శివరావు ముక్కతెంపి, నోట్లో పెట్టుకోబోయి, ఆగి.

"మీరు కానీండి-నేను తరవాత తింటాను."

"మాశావా, మనవాళ్ళు శనివారాలు అనేవి పెట్టడం ఎంత మంచిదయ్యిందో! ఈ రోజు శనివారం కాకపోతే—ఇలా వేడివేడి దోసెలు కాకుండా చల్లటి అన్నం పడేసేదానివికదా నా మొహాన" నవ్వాడు.

పంకజం కూడా నవ్వేసింది.


"ఈ వర్షం యింక తగ్గేలాలేదు. పైగా ఎక్కువవుతుందోయ్" చేతులు తుడుచుకుని, గుమ్మం దగ్గర నిలబడి, వంటింటిలో భార్యనుద్దేశించి అన్నాడు.

కిటికీ దగ్గరగా మంచం జరుపుకుని,

# రచయిత గురించి

జన్మస్థలం కాకినాడ దగ్గర ఇంజరం.

కథలకు బహుమతి అందుకోవడం ఇది మూడవసారి. 1974 నుంచీ అచ్చుముఖం చూడడం ప్రారంభమైన నా కథల సంఖ్య సుమారు ఏభై. ఓ వందదాకా వ్యాసాలు 'ఈనాడు'లో పడ్డాయి-కొన్ని 'కిరీటి' పేరుతో. నాటకాలకు దర్శకత్వం వహించి, నటించడం మరో ముఖ్యమైన హాబీ.



ఉద్యోగం హైద్రాబాదు ఆంధ్రా బ్యాంకులో.

అభిమాన రచయిత .... శ్రీ మధురాంతకం రాజారాం.

నాలుగు కాలాలపాటు బ్రతికే రచన ఒక్కటైనా చెయ్యాలని ఆరాటం. దాదాపు అన్ని పెద్ద పత్రికలూ నా రచనల్ని ఆదరించాయి.

జ్యోతికి కృతజ్ఞతలు.

'హమ్మయ్య' అంటూ దానిమీద వాలి కిటికీలోంచి వానని చూస్తూ, వెల్లకిలా చేతులు తల క్రింద పెట్టుకుని పడుకున్నాడు. ఆ వాతావరణం ఒకసారి అనిర్వచనీయమైన ఆనందంగానూ, ఒకసారి ఎందుకో తెలియని బెంగగానూ వున్నట్టుంది అతనికి.

ఫలహారం అయ్యాక, వంటిల్లు కడుక్కుని వచ్చి, భర్త ప్రక్కనే నడుం వాల్చింది పంకజం.

"ఈ రోజు యింత ఆలస్యమయిందేండీ?" భర్తకు దగ్గరగా జరుగుతూ అంది.

"ఈవాళ ఆఫీసులో ఇన్‌స్పెక్షన్ వుంది. అందువల్ల...." బయటికి చూస్తున్నాడు శివరావు. మెరుపుల్ని చూడడమంటే అతనికి అంతులేని ఇష్టం.

అయిదు నిమిషాలు గడిచాయి. అలారం టైంపీస్ ఆగకుండా 'టిక్ టిక్' మంటోంది. బయట వాన పడుతున్న శబ్దం జోకొడుతున్నట్లుగా వుంది.

శివరావు మెడక్రింద చేతులు సర్దుకున్నాడు.

"మీకేం....మగమహారాజు .... హాయిగా పగలల్లా ఆఫీసులోనో, బయటో, కాలక్షేపం చేసొస్తారు" అంతకంటే నెమ్మదిగా గొణిగినట్టు అనడం ఆమెకు చేతకాలేదు.


శివరావు ఎందుకో చిన్నగా నవ్వుకున్నాడు. ఆమె అలా అనడం చాలా ముద్దుగా అనిపించింది అతనికి. ఇంకా యింకా అలాగే మాట్లాడితే బావుండుననిపించింది.

"నేనింటి దగ్గర ఛస్తున్నాను....ముఖ్యంగా ఈ చౌదరిగాడు ఆ రూములోంచి పోయేదాకా నాకు మనశ్శాంతి వుండదు. వాడి వెధవ చూపుల్తో ఒళ్ళు చచ్చిపోతోంది."

—అదిరిపడి, భ్రుకుటి ముడిచి, విసురుగా తలని భార్యవైపు విసిరాడు శివరావు.








ఆమె కళ్ళల్లో చెమ్మ మెరుపు గమనించాడు శివరావు. అప్రయత్నంగానే ఆమె నడుంమీద చెయ్యేసాడు.

"మీరు ఆఫీసుకి వెళ్ళినప్పట్నుంచీ ఆ గుమ్మంలోనే తచ్చాడుతాడు. పెరట్లోకి వెళ్ళాలంటేనే సిగ్గుపడి ఛస్తున్నాను. ముఖ్యంగా సాయంత్రం నాలుగ్గంటలకి స్నానం చెయ్యడం నాకు అలవాటుకదా. సరిగ్గా ఆ సమయానికి కళ్ళు తాటికాయల్లా చేసుకుని, ఆ గుమ్మంలోనే బొండాలా నిల్చుంటాడు. ఒక్కోసారి పిచ్చి పిచ్చి పాటలు కూడా పాడతాడు. పొద్దున్న మీరు లేచేవరకూ కూడా అసహ్యకరమైన చేష్టలు చేస్తాడు. స్కూల్నుంచి అయిదు గంటలకి పిల్లలొచ్చేవరకూ నాకు నరకమే" అంటూ భర్త గుండెలమీద ముఖం దాచుకుంది పంకజం.

ఆమె ముఖాన్ని గుండెలకు అదుముకుని, జుట్టులోకి వేళ్ళు పోనిచ్చి నిమురుతూ, కళ్ళు మూసుకుని, ఏదో నిశ్చయానికి వచ్చినవాడిలా తలాడిస్తూ, నిట్టూర్పు విడిచాడు శివరావు.

* * *

స్నానంచేసి, చీర చుట్టబెట్టుకుని, బాత్ రూంలోంచి బయటకువచ్చి, చౌదరి రూము వైపు కసిగా వుమ్మి, ఇంట్లోకి వెళ్ళబోయిన పంకజం - రెండు చేతులూ పైకెత్తి పై గుమ్మాన్ని పట్టుకుని, నిటారుగా నిల్చుని అదోలా నవ్వుతూన్న భర్తని చూసి, నిర్ఘాంతపోయింది. తేరుకోవడానికి రెండునిమిషాలు పట్టింది.

"అదేమిటీ, అప్పుడే వచ్చేసారేం?"

మెట్లు దిగి ఆమెవైపు వస్తూ, "ష్, చెప్తాగానీ—నువ్వు అటువైపునుంచి వంటింటిలోకి రా .... ముందు గదిలో ఫ్రెండ్సున్నారు" అన్నాడు శివరావు

ఆమె గబగబా ప్రక్క సందుగుండా వంటింటిలోకి వచ్చింది.

"చౌదరి రూము తాళం వేసుంది కదా - అలా కసిగా వుమ్మే వెందుకూ ఆ రూము వైపు?" ఆమె వెనగ్గానే వచ్చిన శివరావు నవ్వుతూ అన్నాడు.

"ఆఁ .... ఈరోజే ఎక్కడికో చచ్చాడు. అందుకనే ఆ కసంతా అలా చూపించాను. వెధవ"—ముందు తడబడి, ఆ తర్వాత విజయ గర్వంగా అంది పంకజం.

గమ్మత్తుగా నవ్వాడు శివరావు.

'రోజా యిలా చీర సగం సగం చుట్టుకునే వచ్చేస్తావా?' అని అడుగుదామనుకున్నాడు గానీ మానుకున్నాడు.

"ఆఁ....త్వరగా చీర మార్చుకుని, మూడు కాఫీలు పట్రా. అన్నట్లు పిల్లలేరీ?"

"ఆడుకోవడానికి పోయేరు. మీరు పదండి రెండు నిమిషాల్లో తెస్తున్నా కాఫీలు."

గబగబా కాఫీ తయారుచేయడంలో నిమగ్నురాలైపోయింది పంకజం. భర్త మూడు కాఫీలు తెమ్మన్నాడుగానీ ఇద్దరిగొంతులే వినిపిస్తున్నాయి. అందులో ఒకటి భర్తది. 'మూడో మనిషి వుత్త పిడతకింద పప్పేమో' అనుకుంది పంకజం లోలోనే నవ్వుకుంటూ.

ట్రేలో మూడు కాఫీలు పేర్చి తలవంచుకుని ఆ ముగ్గురి మధ్యగా టీపాయ్‌మీద పెట్టి, లోపలకు వచ్చేసింది.

"ఇడుగో — ఓసారిలా రా. వీళ్ళకు పరిచయం చేస్తాను" అంటూ పిల్చాడు శివరావు.

బయటకొచ్చి తలవంచుకుని నిల్చుంది పంకజం.

"ఈవిడ మిసెస్ పంకజం శివరావ్. ఆయన రాజుగారు."

నమస్కారాలయ్యాక తల దించుకుంది పంకజం.

"ఇంక మీ యిద్దర్నీ పరిచయంచేయ నక్కర్లేదనుకుంటా. రోజూ చూస్తూన్నవాళ్ళేగా. అయినా ఫార్మాలిటీకోసం — ఈవిడి మిసెస్ పంకజం శివరావు. వారు చౌదరిగారు."

—తటాలున తలెత్తిన పంకజం నిర్విణ్ణురాలైపోయింది ఎదుటి మనిషిని చూసి.

కొంచెం సర్దుకుని, "నమస్కారమండి" అన్నాడు చౌదరి బెరుకుగా.

—నోట మాట రాలేదు పంకజానికి. కళ్ళు తిరుగుతున్నట్లు అయ్యింది. లోపలకి వచ్చి మంచంమీద వాలిపోయింది.

"పెద్దగా చదువుకోలేదు మా ఆవిడ. సంసారపక్షం. అంతే" అని నవ్వాడు శివరావు.

* * *

వంటింటిలో కంచాలు సర్ది లైటి వెలిగించే వుంచి, బయటిగదిలో బెడ్‌లైట్ వెలుతుర్లో కుర్చీలో ముడుచుక్కూర్చుంది పంకజం.

"చీకటిలో కూర్చున్నావేఁటి పంకజం? లైటు వెలిగించుకోలేకపోయావా? ఓహో—పిల్లలు నిద్రపోయారా? ఆఁ..అన్నట్లు నువ్వు భోజనం చేసావా?....రండి మాష్టారూ"

—ఫస్ట్‌షో సినిమాచూసి, లోపలకు వస్తూనే అన్నాడు శివరావు.

అందులో జవాబు నాశించిన ప్రశ్న లేవీ వున్నట్లుగా అనిపించలేదు పంకజానికి. పైట ఒంటినిండా కప్పుకుని గబగబా వంటింటిలోకి వెళ్ళిపోయింది.

తలవంచుకుని, మొహమాటపడుతూ, ఇబ్బందిగా లోపలకొచ్చాడు చౌదరి.

"శివరావుగారూ! మీరు ఏమీ అనుకోకపోతే—మనమే వడ్డించుకుందాం" నసుగుతూ అన్నాడు చౌదరి.

"ఏఁవీఁఫరవాలేదండీ—మా ఆవిడ ఒప్పుకోదు."

"అదికాదఁడీ—ప్లీజ్.... నాకొంచెం.... ఊఁ...."

"మొహమ్మాటవాఁ? ఆల్‌రైట్. మీరు కాళ్ళు కడుక్కురండి."

కుళాయి వైపు నడిచాడు చౌదరి.

శివరావు ఛలోక్తులకు నవ్వుతూ, మొహమాట పడుతూనే భోజనం ముగించాడు. అప్పుడే చూసొచ్చిన సినిమా గురించి కూడా చర్చించుకున్నారు.

బయట గదిలో పంకజం సిగ్గుతో చచ్చిపోతోంది. పరిస్థితి ఏమీ అర్థంకావడంలేదు.

ఇంతలో రోజూలాగే మళ్ళీ వర్షం మొదలయ్యింది.

"చౌదరిగారూ! ఇంక ఈ వర్షంలో ఏం వెళ్తారు? సామానంతా కూడా తడిసిపోతుంది. రూములోనే వుండిపోయి తెల్లారేక వెళ్తే మంచిదనుకుంటా" అన్నాడు శివరావు బయటకు చెయ్యి చాపి, వర్షం ఎంత పడుతుందో చూసి.






"అదే కసేపు చూసి పరిస్థితులనుబట్టి ఆలోచిస్తా. థేంక్సు మీ ఆతిథ్యానికి" చిరునవ్వు చిందిస్తూ అన్నాడు చౌదరి.

"అయ్యో — యింతోటి ఆతిథ్యం" తీసిపారేస్తూ నవ్వేడు శివరావు.

"వస్తానండి" అని వెనక్కి తిరిగి, అక్కడ పంకజం లేకపోవడంతో, "ఆవిడక్కూడా చెప్పండి"అని తన రూములోకి వెళ్ళిపోయాడు చౌదరి.

—వర్షంజోరు పెచ్చింది. రోజూకంటే బాగా ఎక్కువగా వుంది.

వంటిల్లు కడిగివచ్చి, భర్త ప్రక్కనే కొంచెం ఎడంగా పడుకుంది పంకజం.

పదినిమిషాలు మౌనంగా గడిచాయి.

బెడ్‌లైటుకూడా ఆరిపోయింది—కరెంట్ పోయింది. లేచి తడుముకుంటూ వెళ్ళి కిరోసిన్ దీపం వెలిగించి తెచ్చి భర్త ప్రక్క కిటికీలో పెట్టి పడుకుంది.

"నువ్వెందుకు భోజనం చెయ్యలేదు?"

"ఏం లేదు. కడుపు నిండుగా వుంది. ఆకలి లేదు."

—పై ప్రశ్న భర్త వేస్తే క్రింద జవాబు తను చెప్పదామనుకుంది.

కాని, అతను అడగలేదు. ఆమె చెప్పలేదు.

మరో పదినిమిషాలు మౌనంగా మసి అయిపోయాయి.

"పంకజం" ప్రశాంత గంభీరంగా పిలిచాడు శివరావు.

"ఊఁ" అందామనేది ఆమె వుద్దేశ్యం. ధ్వని బయటకు రాలేదు.

"పంకజం" రెట్టించాడు.

"ఊఁ"—ఈసారి ధ్వని వినిపించింది అతనికి.

"నేను చదువుకునే రోజుల్లో విజయవాడలో వుండేవాడినని నీకు చెప్పాను కదూ?"

"ఊఁ.."

"ఆ రోజుల్లో గవర్నరు పేటలో ఒక ఇంటిలో రూము అద్దెకుతీసుకుని వుండేవాడిని. నేను కాక ఆ యింటిలో రెండు పోర్షన్లు వుండేవి. నా గదికే అనుకునివున్న పోర్షన్‌లో ఒక చిన్న సంసారం వుండేది. భార్యాభర్తలు, ముచ్చటగా యిద్దరే పిల్లలు. ఆయన సాధారణంగా క్యాంపుల్లో తిరుగుతూండేవాడు. వీలయినంత ఎక్కువసేపు నేను రూములోనే వుండిపోయి చదువుకునేవాణ్ని. నేను రూములో వున్న సమయం అంతలోనూ ప్రక్కింటావిడ

అదే ఆ యిదరు పిల్లల తల్లి—నాకు వినిపించేలా పాడే పాటలు—భార్య భర్తదగ్గర పాడడానికికూడా సిగ్గుపడుతుంది. బాత్‌రూంకిగాని, మరెందుకుగాని పెరటిలోకి వెళ్ళాలంటే ఏదో వంకతో అడ్డొచ్చే ఆమెను తప్పించుకోవడం బ్రహ్మతరమయ్యేది. కొడుకుని అడ్డెట్టుకుని, "చేతకాని దద్దమ్మ" అని, "అడంగి వెధవ" అని, ఒకటేమిటి .... అవిడ నన్నుద్దేశించి రేకెత్తిస్తూ అనే మాటలకు, చేసే చేష్టలకూ అడ్డూ అదుపూ వుండేది కాదు. నా రూములో తలుపులు బిడాయించుకుని కూర్చుని చదువుకునేవాణ్ని. ఆవిడ వెర్రిచేష్టలకు నేను లొంగలేదని—చివరకు నేను కనిపిస్తే చాలు వుమ్మేసేది. ఒకరోజున వాళ్ళాయన నా రూముకి వచ్చాడు. "శివరావుగారూ! ఈ రూముకి మీరెంత అద్దె యిస్తున్నారూ?" అన్నాడు. చెప్పాను. "ఇదే అద్దెకు, వీలయితే యింతకంటే తక్కువకి మీకు మంచి రూము చూపిస్తే వెళ్తారా?" అన్నాడు. మతిపోయి చూశాను ఆయనవేపు. ఆయన చాలాసేపు తల వంచుకుని వుండిపోయేడు. చివరకు లేచి వెళ్ళబోతూ "నేనూ ఒకప్పుడు మీ వయస్సులో వున్నవాణ్నే కాబట్టి అనుభవంమీద చెబుతున్నాను. సంసారులుండే పోర్షన్లతోబాటు బేచిలర్లు వుండటం అంత మంచిదికాదు. ముల్లు వచ్చి అరిటాకు మీదపడ్డా, అరిటాకేవచ్చి ముల్లుమీద పడ్డా — అపవాదు ఎప్పుడూ ముల్లుకే. తర్వాత మీ యిష్టం" అని వెళ్ళిపోయేడు. ఆ మర్నాడే నేను రూం మార్చేశాను. అలా తెలివిగా నాకు చెప్పకుండా ఆయన నన్నేమైనా అనివుంటే ఆయనంత మూర్ఖుడైన మగవాడు యీ లోకంలో వుండేవాడా ఇంకొకడు అని యిప్పుడు అనిపిస్తోంది పంకజం."

—సంభ్రమాశ్చర్యాలతో పంకజం భర్త ముఖంలోకి చూసేలోగా శివరావు 'ఉఫ్' మని దీపం వూదేసి అటువైపు వత్తిగిల్లి కళ్ళు మూసుకున్నాడు.

కటిక చీకటిలో కళ్ళు తెరుచుకు వెల్లకిలా పడుకున్న పంకజానికి చీకటి క్రమేపీ అలవాటయి కళ్ళు కనిపిస్తున్నాయి.

వత్తిగిల్లి పడుకున్న శివరావుకి మధ్యాహ్నం జరిగిన సంఘటన గుర్తొస్తోంది.

o o o

ఆఫీసుకి వచ్చేటన్న మాటేగాని, శివరావుకి పని తోచట్లేదు. అసలు మనసు మనసులో లేదు. చౌదరే మనసంతా కదులుతున్నాడు. భార్య చెప్పిన మాటలే చెవుల్లో గింగురుమంటున్నాయి. టైము చూసుకున్నాడు. "ఆ టైంకి నేను ఇంటిదగ్గర వుండాలి" అనుకుని పర్మిషన్ తీసుకుని బయల్దేరాడు.

నాలుగవుతూన్నా ఇంకా ఎండ తీవ్రంగానే వుంది. మనసు బాగులేకపోవడంవలన మరింత చికాకుగా వుంది శివరావుకి. సైకిల్ నెమ్మదిగా త్రొక్కుతూ తీవ్రంగా ఆలోచిస్తూ వస్తున్నాడు.

కొండ ప్రక్కగా వస్తూండగా ఎవరిదో పరిచయస్తుల గొంతు వినిపించి, ఆగి ఎండకు చెయ్యి అడ్డంపెట్టుకుని రాళ్ళపైకి చూశాడు. ఆశ్చర్యపడి కళ్ళు నులుముకుని మళ్ళీ చూశాడు. సైకిల్‌కి స్టాండువేసి పైకి నడిచాడు.

"నమస్కారమండీ!"


"నమస్కారమండీ—ఇదేవిటి చౌదరిగారూ ఇక్కడ చదువుకుంటున్నారు?"

"ఏంలేదండీ — ఈ కొండ నీడన చల్లగా వుంటుందని. బై దిబై ....ఈయన మా ఫ్రెండ్ రాజుగారు. ఆయన శివరావుగారు. మా కాంపౌండులో నా గది ప్రక్కపోర్షన్‌లోనే అద్దెకుంటున్నారు."

"నమస్కారం."

"నమస్కారం. ఈ రోజేకాదులెండి. మావాడు రోజూ యింతే. ప్రొద్దున్న పది గంటలకు పుస్తకాలు పుచ్చుకుని బయటపడతాడు. మళ్ళీ చీకటి పడ్డాకే రూముకి వెళ్ళడం. అప్పటిదాకా పార్కులోనో, యిక్కడో చదువు. హాయిగా తన రూముకి వెళ్దాం అంటే వద్దంటాడు. పోనీ మా యింటికి రా గురూ అంటే మీ లొకాలిటీ గోలగా వుంటుందంటాడు. ఇప్పుడు ఫర్వాలేదుగానీ - వానపడితే వుంటాయి సార్ మా పాట్లు" అంటూ నవ్వాడు రాజు.






చౌదరి తల వంచుకుని పుస్తకాల్లోకి చూస్తున్నాడు. ఓ నిమిషం పోయాక, "కూర్చోండి సార్"అన్నాడు శివరావుని. చౌదరిమీద అమితమైన అభిమానం కలిగింది శివరావుకి. ఏం మాట్లాడాలో తెలియక మౌనంగా కూర్చుండిపోయాడు.

"ఈ రోజు....నేను రూము ఖాళీ చేస్తున్నాను శివరావుగారూ"

ఉలిక్కి పడ్డట్టు చూశాడు శివరావు. చిన్నగా నవ్వాడు చౌదరి.

"అదేం....?" అని మాత్రం అనగలిగాడు శివరావు.

"ఆం....ఏంలేదు....ఈ కొండవెనక ఒక మేడగది దొరికింది. గాలీ, అవీ బాగుంటుందని."

శివరావు మౌనంగా వుండిపోయాడు. ఓ నిముషం పోయేక, "మావల్ల మీకేదైనా ఇబ్బంది కలుగుతూంటే చెప్పండి" అన్నాడు చౌదరి ముఖకవళికలను గమనిస్తూ.

"అబ్బెబ్బే....అదేం లేదండీ.... బహుశా మా ఫ్రెండు ఇంకొకతను కూడా నాతోబాటు యిప్పుడు నేను తీసుకోబోయే రూములో వుంటాడు. ఇద్దరం బేచిలర్స్‌మే కాబట్టి.... మేడమీది గది....ఎవరికీ యిబ్బంది లేకుండా వుంటుందని...."

"ఈరోజే వెళ్ళిపోవాలా?-" శివరావుకి చాలా బాధగా వుంది.

"ఈ రోజే వస్తానని చెప్పాను వాళ్ళకి. సామానేమీ లేదుగా సర్దుకోవడానికి. అయిదు నిమిషాల్లో వెళ్ళిపోవచ్చు" నవ్వేడు చౌదరి.

శివరావు తిరిగి నవ్వలేకపోయాడు. రెండు నిమిషాలు పోయేక అన్నాడు, "ఒక విధంగా ముందు తెలియడం నా అదృష్టం. ఇప్పుడు మిమ్మల్ని నేనో చిన్న కోరిక కోరతాను. కాదనకూడదు."

ఏమిటన్నట్లు శివరావు ముఖంలోకి చూసాడు చౌదరి.

"ఇన్నాళ్ళూ మాతోబాటే వున్న మీతో ఈ ఒక్కపూటా సరదాగా గడిపే ఛాన్సివ్వండి. ఇక్కడకు దగ్గరే కాబట్టి ముందు మా ఇంటికి వెళ్ళి, కొంచెం కాఫీ తీసుకుని, అక్కణ్నుంచి సరదాగా బజార్లో తిరిగి, ఫస్ట్ షో చూసి, మా

యింటిలోనే భోజనం చేసేద్దాం. కాదనకండి. ప్లీజ్ రాజుగారూ, మీరుకూడా. ప్లీజు" బ్రతిమలాడుతున్నట్లు వుంది అతని ధోరణి.

"క్షమించండి. ఇప్పుడు అలాంటివేమీ వద్దు. మళ్ళీ తప్పకుండా వస్తాను" మొహమాట పడిపోయాడు చౌదరి.

పుస్తకాలు మడిచి, దొంతరగా పెడ్తూ, గబగబ అన్నాడు రాజు, "మధ్యవర్తిగా నేను చెప్పేది మీరిద్దరూ వినాలి. మనం ముగ్గురం ఇప్పుడు శివరావుగారింటికి వెళ్దాం. వారింట్లో కాఫీలు త్రాగేస్తాం హాయిగా. ఖుషారుగా బజారుకి వెళ్ళిపోతాం ముగ్గురం. అక్కణ్నుంచి ఒక బ్రహ్మాండమైన, ముఖ్యమైన, తప్పని సరైన పనిమీద నేను ఇంటికి పోతాను. మీరిద్దరూ సినిమాకు వెళ్తారు. ఆ తర్వాత వాళ్ళింట్లోనే చౌదరి కూడా భోజనం చేసేస్తాడు. ఆ తర్వాత రూం మార్చేస్తాడు. ఇదీ ప్రోగ్రాం. నో మోర్ ఆల్టరేషన్స్ ప్లీజ్."

○ ○ ○

శివరావుకి మంచి నిద్ర పట్టేసింది రాత్రంతా.

"ఎనిమిదయ్యింది. రోజూకంటే గంటన్నర సేపు ఎక్కువగా పడుకున్నారు. ఇక లేవండి" అంటూ తట్టింది పంకజం.

బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ, సగం తెరిచిన కళ్ళతో భార్యను చూసి-కళ్ళు పెద్దవిగా తెరచి, విస్తుపోయాడు శివరావు.

"ఇదేవిటీ?!! వాలుజడా, కోలబొట్టూ కదూ నీ కిష్టం?—ఈ మార్పు ఏమిటి?!" పట్టపగలు చుక్కలు పొడిచినంతగా ఆశ్చర్యపోతున్నాడు.

"కానీ—ముడీ, గుండ్రటి బొట్టు మీకు ఇష్టం. నేనందంగా కనిపించవలసిందీ—నాకూ ఊళ్ళోవాళ్ళకి కాదు—నా భర్తకు. పైగా.... నేను....ఇద్దరు పిల్లల తల్లిని" ఓరగా నవ్వి. బ్రష్షూ, పేస్టూ అందించింది భర్తకు.

ఆశ్చర్యపోతూనే లేచి, లుంగీ సరిగ్గా కట్టుకుని, బ్రష్షూ, పేస్టూ అందుకుని, గబగబా గది బయటకు నడిచాడు శివరావు. చూపు త్వరగా చౌదరి రూమువైపు మళ్ళింది. రూముకు గొళ్ళెం పెట్టుంది.

'గది అద్దెకు యివ్వబడును' అనే బోర్డుతో గేటువైపు వెళ్తూ, యింటాయన విష్ చేస్తూ నవ్వాడు.

యాంత్రికంగా తిరిగి విష్ చేశాడు శివరావు.

"ఏంటి నాన్నాలూ? ఆ రూములో వుండే అంకుల్ లేరేం?" అన్నాడు చంటాడు.

"రూము ఖాళీ చేసి వెళ్ళిపోయార్రా!.... ఆ రూముకూడా మనమే తీసుకుందామా అనుకుంటున్నాను" తనలో అనుకుంటున్నట్లు అన్నాడు శివరావు, సాలోచనగా. □






# జనతా

గుడిమెట్ల గోపాలకృష్ణ

ఏ పనిచేసినా విజయం చేకూరాలనే ఆంశతో రాజు తన పిల్లలిద్దరికీ 'విజయశ్రీ' అని 'విజయ్ కుమార్' అని పేర్లుపెట్టేడు.

వాళ్ళకి పేర్లు పెట్టడంతో వూరుకోక ప్రతి పనీ స్వంతంగా చేసుకునేటట్టు ట్రయినింగు ఇవ్వటం మొదలు పెట్టేడు. సత్యవతికి కూడా పిల్లల్ని 'ఇలా' పెంచాలి అని సమయం దొరికినపుడల్లా నూరి పోసేవాడు. పరిమళా సోమేశ్వర్ పుస్తకాలు చదివించడం ధైర్యం పెంచే ఇంగ్లీష్‌మూవీస్ చూపించడం వరకూ యెంతో యిదిగా చేసేవాడు.

రాజు ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నా, శ్రీమతి సత్యవతి ఎన్నికిటుకులు వుపయోగించినా పిల్లల విషయంలో ఆశించదగ్గ మార్పు కన్పించలేదు. పైగా ఖర్చు ఎక్కువకాసాగింది.

ఖర్చులు ఇలా ఎక్కువౌతున్న సమయంలోనే శ్రీకాకుళం నించి, నెలనెలా డబ్బు పంపుతుండమని రిటయిరయ్యేక తండ్రినిచూసే బాధ్యత కొడుకుది కాదా అంటూ ఘాటైన వుత్తరం వచ్చింది రాజుకి.

తీవ్రంగా ఆలోచించి రాజు ఖర్చులు తగ్గించుకునే పధకాన్ని అమల్లోకి తెచ్చేడు. అదే 'జనతా' పద్ధతి.

పిల్లల్ని ఎక్కడికి తీసుకువెళ్ళాలన్నా రైలు బండిలో 'జనతా' క్లాసులోనే తీసుకెళ్ళేవాడు.

వాళ్ళకు 'జనతా' బట్టలు కొనేవాడు.

'జనతా' పేకెట్ మీల్సు 'జనతా' టిఫిన్ ఇప్పించేవాడు.

పిల్లల్లో పొదుపుగుణం పెరిగినా పెరక్కపోయినా 'జనతా' అని ప్రతి దానికి అడిగే అలవాటయిపోయింది. రాజుకు 'జనతా' పద్ధతివల్ల నెలకు ఎనభై రూపాయిల మిగులు కన్పించింది. అయితే రాజు జనతా పద్ధతుల వల్ల ఆదా కావాల్సింది నూరురూపాయలు మినిమమ్ అని అంచనావేశాడు. మిగతా ఇరవై రూపాయలు ఎలా ఖర్చయిపోతున్నాయి చెప్మా అని ప్రశ్నించుకున్నాడు.

ఈ విషయాన్ని విజయశ్రీ, విజయ్‌కుమార్ లతో చర్చించాలని నిశ్చయించాడు. సాధకబాధకాలు పిల్లలకు తెలియడం మంచిదనుకున్నాడు. బడ్జట్ ఎలా వేస్తే బాగుంటుందని పిల్లల్ని సజెషన్ అడిగేడు తన ట్రయినింగు ఎలా పని చేస్తున్నదీ తెలుసుకోవచ్చునన్న ధ్యాసతో. విజయశ్రీ ఠక్కున అంది.

"మమ్మీవేమరీ ఎక్కువ ఖర్చులు. మరో జనతా మమ్మీని చూడు డాడీ....!!"

"....................!!!" □


# సిలువనెక్కిన క్రీస్తు

## కె. రాంమోహన్ రాజు

రెండు గంటల ఎండ శరీరంలోని మాంసాన్ని ఉడికిస్తోంది. ఆ సమయంలో నాగరాజు రోడ్డుమీద నడుస్తున్నాడు. ఎక్కడా నీడ అనేది లేదు. ఉన్న నీడలు అతని కోసం కాదు. కాళ్ళు చుర్రుమంటుంటే చేతులు తలకి అడ్డం పెట్టుకుని పరిగెత్తినట్టు నడుస్తూ రైల్వే స్టేషను పక్కనున్న పార్కు చేరుకున్నాడు. ఆ పార్కు ఆలనాపాలనా చూసేవాళ్ళెవరూ లేరు. అందులో వున్న దేశానాయకుల విగ్రహాలు రంగు వెలసి సిమెంటు పెచ్చులు రాలి వున్నాయి. పార్కు చుట్టూ వున్న ఫెన్సింగ్ మొక్కలమీద దుమ్ముపడి అవన్నీ ధూసర వర్ణంలో వున్నాయి. పార్కులో ఎక్కడా పచ్చి గడ్డిలేదు. రెండు మూడు పెద్ద చెట్లు మాత్రం నీడనిస్తున్నాయి. ఆ చెట్లకింద నీడ వున్నంత మేరా కుష్ఠురోగులూ, బిచ్చగాళ్ళూ ఆక్రమించారు. వాళ్ళకి కొద్దిదూరంలో ఒక విరిగిన సిమెంటు దిమ్మమీద ఒక కొమ్మనీడ పడుతుంటే నాగరాజు అక్కడ కూచున్నాడు. నడిచీ, నడిచీ అతడి కాళ్ళు లాగుతున్నాయి. కళ్ళు తిప్పుతున్నాయి. కాళ్ళు పైకి లాక్కుని ముణగదీసుకుని కూర్చున్నాడు. ఎదురుగా తెల్లని గడ్డం మీసాలు వున్న బిచ్చగాడొకడు బొద్దింకల్లాంటి చేతివేళ్ళతో నిమురుకుంటూ "లల్లా....లల్లా" అంటూ పాడుతున్నాడు.

"ఈ ప్రపంచంలో విలువలంటే ఏమిటి? నీతులంటే ఎలా వుండాలి? మనుషులు పుట్టి పెరిగి చదువూ పెళ్ళీ ఉద్యోగాలు పిల్లల్ని కనడం వగైరా తంతులన్నీ నిర్వహిస్తారు. తరవాత చచ్చిపోతారు. జీవితాలకి అంతకన్న పరమార్థం లేనట్టుంది. బతికినన్ని రోజులు తమకి చాతనయిందో, చేయగలిగిందో చేస్తారు. దానివల్ల ప్రయోజనాన్ని పొందడమే. వారి లక్ష్యం. ఇతర్లకేమయినా హాని కలుగుతుందా అవి చూడరు. మరింక నీతులు దేనికి? ఏ నీతి మానవుణ్ని అశక్తుణ్ని చేస్తుందో, జీవించ దానికి అసమర్థుణ్ని చేస్తుందో ఆ నీతిని తమపై తామే విధించుకోవడంలో అర్థం ఏమిటి? నీతిని ఆచరించనప్పుడు, అది నిలిచే పరిస్థితులు లేనప్పుడు అవి వుండి ఎందుకు? ప్రతివాడూ తాను నీతిని ధిక్కరిస్తూనే ఇతర్లని ఆ నీతికి లోబడమంటాడు." ఎండ మొహాన కొట్టేసరికి నాగరాజు ఆలోచననుంచి తెప్పరిల్లాడు. ఎదురుగా ఓ చెట్టుకింద బిచ్చగత్తె ఒకత్తి కూచుని వుంది. ముఖంలో యవ్వన కాలపు వర్చస్సు వెలుగుతూ వుంది. ఆమె చుట్టు రెండు మూడు మూటలున్నాయి. ఓ మూటలోంచి గిన్నెలు, తప్పేలాలు తొంగి చూస్తున్నాయి. రెండోమూటలోంచి తుక్కు గుడ్డలూ, సీసపెంకులూ కన్పిస్తున్నాయి. ఆమె శరీరమంతా బూడిదవర్ణంగులో వుంది. జుత్తు రాగిరంగుకి తిరిగి అట్టకట్టుకుపోయింది. నల్లగా మాసిన నీలంచీరమీద భుజాలు చిరిగిన ఎర్రజాకెట్టు వేసుకుంది.

సత్తుగిన్నెలోంచి వేరుశనక్కాయలు తీసుకుని తింటోంది. ఆమె వెనగ్గా గజందూరంలో ఇద్దరు కుష్ఠురోగులు కూచుని గంజాయిచిలుం పీలుస్తున్నారు. వాళ్ళ మొహాలు ఉబ్బి ముక్కులు సొట్టలుపడివున్నాయి. మొండి వేళ్ళతో గంజాయి ఒకర్నించి ఒకరు పీలుస్తున్నారు. పైకి వడిదిరిగిన వాళ్ళ పెదాలు చూస్తే నాగరాజు కడుపులో పేగులు మెలికపడ్డాయి. "బతికినన్ని రోజులు అశుక్కు తిని ఆ తర్వాత రాలిపోగా మిగిలిన అవయవాల్ని భూమిమీద వదలి మరణిస్తారు. వ్యవస్థమీద కసినంతా దాన్ని కలుషితం చేయడం ద్వారా తీర్చుకుంటారు. నీతులో నీతులో అని కలవరిస్తున్న సభ్యప్రజలు తమ క్రూరత్వానికి చిహ్నం మిగలకుండా ఆ శవాల్ని పెంటలో పారేస్తారు. అసలీ వ్యవస్థకే ఆత్మలేదు. అవినీతి వద్దంటారు. కానీ అది ఎందుకు వుందో చెప్పరు. తమ స్వార్థానికి బలైపోతున్న వాళ్ళందర్నీ వాళ్ళ కర్మకి బాధ్యుల్ని చేస్తారు. ఆ కర్మ తాము రాసిందే అని ఒప్పుకోరు."




చెట్టుకింద బిచ్చగత్తె ఏదో పాటని లయ లేకుండా పాడుతోంది. అలా పాడుతోంటే ఈ ప్రపంచంమీద ఆమెకున్న అసహ్యమంతా గొంతులో వికృతంగా ధ్వనిస్తోంది. వెల్లకిలా పడుకుని తలకింద గుడ్డల మూట పెట్టుకుని కాళ్ళు మరో మూటమీద పెట్టి సత్తుగిన్నె పొట్టమీద పెట్టుకుని దాన్తో దరువువేస్తూ పాడుతోంది. ఆ పాటని కుష్ఠురోగులూ, మరి కొంతమంది బిచ్చగాళ్లూ వింటూ నవ్వుతున్నారు. తన పాటని వినే శ్రోతలున్నారని తెలియగానే బిచ్చగత్తె గొంతెత్తి మరింత దుర్భరంగా పాడుతోంది. పట్టపగటి ఎండలో ఆ పాట ముళ్ళు గుచ్చుకున్నట్టుగా వుంది. తెల్లగా పండి

చిలుక కొరికిన జామపండులా వున్న కుష్టువా డొకడు గంజాయి మత్తులో లేచి తూలుతూ వచ్చి ఆమె పొట్టమీద ఒక్కదెబ్బ వేసి "పాట ఆపవే ఎర్రిలంజా." అన్నాడు. బిచ్చగత్తె పాట పాడటం ఆపి "ఏబ్రారే .... (బూతుతిట్టు) పాట పాడొద్దంటావేంటి?" అంది. ఆ గొంతు పాడినప్పుడే బాగుంది. మాట్లాడితే పళ్ళచక్రాన్ని రోడ్డుమీద ఈడ్చినట్టు వుంది. "మరి పాడేవంటే సూస్కో" వాడి మొండిచేతిని పైకెత్తాడు. నానిన బ్రెడ్డు ముక్కల్లాంటి పెదాలమధ్య పాకురుపట్టిన వచ్చటి పళ్ళు కన్పించేయి. ఆ మాటల్ని బిచ్చగత్తె లెక్కచెయ్యలేదు. "ఓస్పోస్ పోరా! నా ఇట్టం నాది....(బూతుతిట్టు) నేను పాడుకుంటే నీకేటవుద్ది?" మళ్ళీ పాటందుకుంది. కుష్టువాడు వెకిలిగా నవ్వుతూ ఆమె దవడమీద ఈడ్చి గుద్దేడు. "నంజకానా." బిచ్చగత్తె పాట ఆపి సత్తుగిన్నెతో వాణ్ని కొట్టింది. లేచి కూచుని అరుస్తోంది. "ఓలమ్మో! ఈడు.... (బూతులు బూతులు)....నన్ను కొడతావురా" వాడిమీదపడి రక్కుతోంది. అరుస్తోంది. కుష్టువాడు కూడా నవ్వుతూ ఆమెని గుద్దుతున్నాడు. వాడు బూతులు .. ఆమె బూతులు. చుట్టూ వున్న బిచ్చగాళ్ళు అందరూ వినోదం చూస్తున్నారు. వాళ్ళని హుషారుపరుస్తున్నారు. పోట్లాడుకునేవాళ్ళ ఒంటిమీద గుడ్డలు వూడిపోతున్నాయి. శరీరాలు దుమ్ములో దొర్లుతున్నాయి. బిచ్చగత్తె రెచ్చిపోతూ బూతులు తిడుతూ కుష్టువాణ్ని కింద పడేసి మీద కూచుంది. మొహం పీకుతోంది. వాడు ఆమెని కాళ్ళతో తంతున్నాడు. మొండి చేతుల్తో గుద్దుతున్నాడు. నాగరాజు అతి వేగంగా లేచి పార్కులోనుంచి బయటకు వచ్చేడు. అతని వెనుక కేకలూ, బూతులూ విన్పిస్తూనే వున్నాయి.

అప్పటికి మూడు గంటలు కావస్తోంది. రోడ్డుమీద మునిసిపాలిటీవాళ్ళు ఊడుస్తోంటే దుమ్మురేగుతోంది. కార్లూ బస్సులూ రోడ్డు మీద మహాప్రవాహంలా సాగిపోతున్నాయి. అవన్నీ రోజూ చూసే దృశ్యాలే. కొత్తదనం ఏమీలేదు. తన ఆకలిలోగూడా ఏమీ కొత్తదనం లేదు. అన్ని బాధలకన్నా భరించరానిది ఆకలిబాధ. దాన్ని అనుభవించినవాడికి తప్ప దాని క్రూరత్వం తెలీదు. దాన్ని తీర్చుకోడానికి మానవుడు చేయని పని ఏముంది? ఆత్మని గూడా చంపుకుంటాడు. ఆకలి ముందు ఏ నీతులూ నిలవవు. ప్రపంచంలో నీతులగూర్చి మాట్లాడేవాళ్ళంతా ఆ ఆకలిని అనుభవించినట్టయితే వాళ్ళు అనే ఈ అవినీతి ఎందుకు పెచ్చరిల్లుతున్నదో అర్థం అవుతుంది. ఆకలి హింసిస్తున్నప్పుడు, అది తీరే దారి లేనప్పుడు పతనంకాక తప్పదు. లేదా మరణమే గతి. ఆకలి లోపల గంటలు వేస్తోంది. పొట్టలో పేగులు నెమ్మదిగా కరిగిపోతున్నట్టున్నాయి. దుకాణాల్లో పేర్చబడ్డ అనేక రకాల ఆహార పదార్థాలు జనం ఆకలి తీర్చడానికి కాదు. దుకాణాదారుడి వ్యాపారం కోసం. నాగరాజు చెప్పులు లేని కాళ్ళు దుమ్ముతో తెల్లబడ్డాయి. అతడు నడుస్తూ వుంటే ప్రపంచమంతా పరిహసిస్తోన్నట్టు వుంది. చుట్టూ నడుస్తున్న జనం అంతా గుండెల్ని ఎక్కడో పెట్టేసి ఆదరాబాదరా పోతున్నారు. ప్రతివాడికీ ఏదో తొందర. కొందరు ఖంగారుగా, కొందరు ఆనందంగా, కొందరు ఆవేశంగా ఎందుకో గబగబ వెళుతున్నారు. అందరికీ గమ్యం అనేది వుంది. వెళ్ళి చేయడానికో పని వుంది. తనకి మాత్రం ఏదీ లేదు. సాయంత్రం అవుతోంది. షాపుల్లో బేరాలు మొదలయ్యాయి. నాగరాజు ఆ రోడ్డు మించి ఇంకో రోడ్డుకి అక్కణ్నించి మరో రోడ్డుకి తిరుగుతూనే వున్నాడు. రోడ్డుపక్క హోటల్లో స్టీరియోలో ఉషారైన గ్రూప్‌పాట వస్తోంది. వాహనాల రొదా, మనుషులగోలా, స్టీరియో పాటా కలగలుపుగా గమ్మత్తుగా విని విస్తోంది.

తాను బతుకుతున్నది బతుకుకాదు. తన జీవితానికి స్వరూపం లేదు. తనకి వ్యక్తిత్వం లేదు. ఎవరో అదృశ్యంగా వుండి తనని చూస్తూ క్రూరంగా నవ్వుతున్నారు. నాగరాజు




గుండె నెమ్మదిగా కరిగిపోతున్నట్టు తోచింది. కళ్ళు తిరుగుతున్నట్టు అనిపించింది. కాళ్ళు తేలిపోకుండా ఎలక్ట్రిక్ పోల్‌ని పట్టుకుని నించున్నాడు. కళ్ళల్లో నీళ్ళు ఉబికినాయి. కనిపించే మనుషులందరిమీ నా, ఈ మనుషుల్ని శాసించే చట్టాలమీద వాటిని తయారుచేసే కారాకిళ్ళీ బొజ్జలమీదా అంతులేని ద్వేషం ఉప్పొంగింది! అప్పటికి చీకటిపడింది. సందుల్లోంచి నడుస్తున్నాడతను. ఆకాశంలోంచి నక్షత్రాలు తొంగి చూస్తున్నాయి.ఆకలి నీరసంగా మారింది. మెదడంతా ఒక విధమైన శూన్యంతో నిండి వుంది. గోడపక్క కీసీశలో కుక్క ఒకటి అతణ్ని చూసి భౌ అని అరిచింది. కుక్కవేపు నిర్లిప్తంగా చూసి తల తిప్పుకున్నాడు నాగరాజు. అప్పుడే వెలిగిన ఎలక్ట్రిక్ లైట్ల వెలుగు పలుచగా సందుల్లో పరుచుకుంది. ఇళ్ళముందు చిన్నపిల్లలు ఆడుకుంటున్నారు. స్త్రీలు కొందరు అరుగులమీద కూచుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

"ఈ వ్యవస్థని నేను ద్వేషిస్తున్నాను. అవును నిస్సందేహంగా ద్వేషిస్తున్నాను. దాన్లో సిగ్గుపడాల్సిందేమీలేదు. నా జీవితం మీద ఈ లోకానికింత ఆధిక్యత యెందుకు? ఆర్థికంగా అసమర్థుణ్ని గనక నా గొంతు ఎవడూ వినడు. నా బాగు ఎవడికీ పట్టదు. ప్రపంచం మీద నాకు నిష్కారణ కోపం ఏమీలేదు. నన్ను హింసించే వాణ్ని ప్రేమించాలనటం హాస్యాస్పదం. ఈ ప్రపంచాన్ని నేను క్షమించను. దీన్ని కలుషితం చేస్తాను. పాడుచేస్తాను."

ఇరుకుసందుల్లోంచి ఆలోచించుకుంటూ పోతున్నాడు. ప్రపంచం మీది కోపంతో తనని తాను నాశనం చేసుకోవడానికి ఉద్యుక్తుడైనాడతను. కళ్ళు జ్వరం వచ్చినవాడిలా ఎర్రబారి పేలిపోతున్నట్టు మండుతున్నాయి. నడిచీ కాళ్ళు తేలిపోతున్నాయి. అతని గుండెలో ఎవరిమీదో అర్థంకాని కోపం జ్వలిస్తోంది. తనలో తాను పూర్తిగా కుంచించుకుపోయి ఆలోచిస్తున్నాడతను. దరిద్రంచేతా, అవమానాలచేతా ధ్వంసమైపోయిన అతని ఆత్మ కోపంతో కలుషితమైపోయింది. పక్కసందులో చర్చి గోపురం నియోన్ లైట్ల వెలుగులో మానవతా శిఖరంలా కన్పిస్తోంది. స్పష్టాస్పష్టంగా గాలిలో తేలుతూ, "హాలెలూయ, హాలెలూయ" వినిపిస్తోంది.నాగరాజుఒక్కక్షణం పులకించిపోయేడు. ఆగి చర్చిగోపురాన్ని చూశాడు. శిలువ వేయబడ్డ క్రీస్తు అతనివేపు చూశాడు. నెత్తిమీద ముళ్ళ కిరీటం ధగధగ మెరిసింది. జీసస్ లోకవంచకు, దౌష్ట్యానికి బలయ్యాడు. అప్పుడూ

ఇప్పుడూ పరిస్థితులు ఒక్కటే. తల వంచుకుని ముందుకి నడిచాడు. సందుమూల మీద సారాయి దుకాణం వుంది. రకరకాలైన జనం దానిముందు గుమిగూడి వున్నారు. రికార్డ్ ప్లేయరుమీద ఏదో చవకబారు పాట తిరుగుతోంది. తాగుబోతులంతా అరుస్తున్నారు. కేకలు వేస్తున్నారు. "నా మాంసం ముక్కేదిరా?" "సోడా తేవేంరా?" రకరకాల కేకలు. అంతా ఎముకల పోగుల్లా వున్నారు. ఎవడి ఒంటిమీదా సరైన కండలేదు. చేతులమీదా, కణతలమీదా నరాలు తేలిన ముసలాడు ఒకడు ఏదో లెక్చర్ దంచుతున్నాడు. సోడాలు బుస్సుమంటున్నాయి. సారాయి పొంగుతోంది. కౌంటర్ మీద వున్న గళ్ళలుంగీ లాల్చీవాడు డబ్బులివ్వనిదే సారాయి పోయనంటున్నాడు. ఎవడో వాడితో పేచీ పడుతున్నాడు. బయట వున్న మిరపకాయ బజ్జీల వ్యాపారం జోరుగా సాగుతోంది. అక్కడ కూచున్న లావాటి ఆడమనిషి డబ్బు లివ్వకుండాపోయిన ఎవణ్నో తిడుతోంది. నాగరాజు త్వరగా నడుస్తూ ఆ సందు దాటాడు. రాత్రి యెక్కువవుతున్నకొద్దీ అతనికి గుండెలో భయం పేరుకుపోతోంది. ఎదురుగా అర్ధచంద్రాకారంలో వంగిన బ్రిడ్జి కన్పిస్తోంది. బ్రిడ్జి కిందనుంచి రెండు రైలు మార్గాలు కొండచిలువల్లా పరుచుకుని వున్నాయి. బ్రిడ్జి అడుగునవున్న రేకులు బోల్టులు ఊడిపోయి గాలికి బడబడ చప్పుడు చేస్తూ ఊగుతున్నాయి. బ్రిడ్జి గోడలవెంట బిచ్చగాళ్ళూ, రిక్షా తొక్కేవాళ్ళు తడికలు కట్టుకుని సహజీవనం చేస్తున్నారు. ఆ తడికల సందుల్లోంచి చిన్నదీపాల వెలుతురు చారలుగా కన్పిస్తోంది. కొంతమంది బిచ్చగాళ్ళు ఒకదగ్గర జట్టుగా కూచున్నారు. వాళ్ళు వెలిసిపోయిన కాషాయగుడ్డలు కట్టుకునివున్నారు. జుట్టు, గడ్డమూ దుబ్బుగా పెరిగివుంది. వాళ్ళు రేపు పాడబోయే పాటలకి రిహార్సల్ చేసుకుంటున్నారు. చీకట్లో కుక్కపిల్లల అరుపులూ, చంటిపిల్లల ఏడుపూ, తాగివచ్చిన మగాళ్ళ కేకలూ, వాళ్ళని మందలిస్తున్న ఆడవాళ్ళ మాటలూ అన్నీ కలిసిపోయి అక్కడి వాతావరణమంతా గమ్మత్తుగా కన్పిస్తోంది. ఇదంతా ఏమీ పట్టించుకోకుండానే బ్రిడ్జి పైనుంచి కార్లూ, స్కూటర్లూ హడావిడిగా పరిగెడుతున్నాయి. బ్రిడ్జిమీద రెండువైపులా విద్యుద్దీపాలు రోడ్డుమీదికి వంగివున్నాయి. ఆ వెలుతురు ముద్దలు ముద్దలుగా బ్రిడ్జి రెయిలింగ్స్‌లోంచి కిందికి పడుతోంది. నాగరాజు బ్రిడ్జి ఎక్కేడు. అతన్నిప్పుడు భయం ఆవరించుకుంది. తెలియని భీతి ఏదో అతన్ని వెంబడిస్తోంది. గుండెని రెండు చేతులా అదుముకుంటూ రెయిలింగ్స్‌ని ఆనుకుని నిలుచున్నాడు. వాహనాలు ఎడతెరిపి లేకుండా పోతున్నాయి. జనం జంటలుగాను, ఒంటరిగాను పోతున్నారు. నాగరాజు గుండె అంతకంతకీ పెరిగి ఉరఃపంజరాన్ని చీల్చుకుని బయటికి వస్తున్నట్టుగా వుంది. రెండుచేతులతో గుండెని అదిమిపట్టి నొక్కుకున్నాడు. బ్రిడ్జిక్రింద నుంచి ట్రెయిన్ పెద్దచప్పుడుతో వెళ్ళిపోయింది. అలసటతో అక్కడే ఫుట్‌పాత్ మీద కూలబడిపోయేడు. వచ్చేపోయే కార్లకింద తన జీవితం చితికిపోతున్నట్టుగావుంది. ఆ కార్ల టైర్లు తనమెదడు మీంచి పోతున్నట్టుగా వుంది. మగత కమ్ముకువస్తున్నట్టుగా తోచింది. పుల్లల్లా వణుకుతున్న చేతులతో నుదుటిమీద చెమటని తుడుచుకున్నాడు. "సమాజంలో ఒక వ్యక్తి జీవితాన్ని ధ్వంసం చేసే శక్తి మరొకరికి యెందుకు వుండాలి? దాన్నెదుర్కునే శక్తి నాకెందుకు లేదు? నాకేమీ విలువలేదు. ఏమీ లేదు" అనుకున్నాడు. పెన్సిళ్ళలాంటి వేళ్ళతో ముళ్ళలా పెరిగిన గడ్డాన్ని పరపరా రాసుకున్నాడు. అక్కణ్ణించి లేచి నడక ప్రారంభించాడు. బ్రిడ్జి దిగాక రోడ్డుమీద లైట్లు లేవు. చీకటి. "అవును నా జీవితమంతా చీకటినే చూశాను. మూర్ఖులు చీకటి చీకటి అంటూ తిడతారు. అదెందుకు వుందో అర్థం చేసుకోడానికి ప్రయత్నించరు. ప్రారబ్ధం అంటూ గునుస్తారు. అసంతృప్తితో పీడింపబడుతూ సంతోషం నటిస్తారు. ఇతర్లని ప్రేమించినట్టు కన్పిస్తారు.





[illegible] పిస్సుబోటు బాడుస్తారు. చీచీ [illegible]దాపికి [illegible]" అనుకున్నాడు. [illegible]రాదికి, [illegible] గురవుతుంటే నీతి [illegible] చెరాం. [illegible] ఎదుర్కోవాలట. [illegible] పీక్కు[illegible] చెప్పేది. ఒక మనిషి [illegible]గా [illegible] పరిస్థితులు సృష్టించ[illegible] తర్వాత [illegible]కోవాల అనడమూ [illegible] అసలే సమాజపు వ్యక్తిత్వంలోనే [illegible]మాణాలున్నాయి. నేరాలు చేసే పరి[illegible] కల్పి[illegible]డూ, తర్వాత వాళ్ళని శిక్షించడమూ. [illegible] యింకా యివన్నీ నేను ఆలో[illegible] లాభం? నేను మోసంలో పడ్డాను. [illegible] ఆ చీకటిలో ఏప్పారి ఆఖరుసారి [illegible]న ప్రపంచాన్నంతా ఫోటోగ్రాఫ్ చేస్తున్నాయి. సిలువ ఎక్కబోతున్న క్రీస్తులాగా అతడి మొహం వెలిగిపోతోంది. బ్రిడ్జిదిగి రైలుపట్టాల మధ్యగా నడుస్తున్నాడు. ఇరవై ఏడేళ్ళ అతడి జీవిత జ్ఞానమంతా ముఖంలో [illegible]నివుంది. చీకట్లో చెప్పులులేని కాళ్ళకు [illegible]రాళ్ళు గరుగ్గా తగిలాయి. అతడి హృదయంలోంచి భీతి మాయమైంది. అందాకా లేని మేఘాలు ఆకాశం నిండా చిందులు తొక్కుతున్నాయి. గాలి రివ్వున వీస్తోంది.

"ఈ లోకంనించి అంతర్ధానమైపోతున్నాను. [illegible]ం చేసినా నేను ఉద్ధరించబడే స్థితిని దాటిపోయాను. జీవితంలో ఓడిపోయి, నీతికీ ధర్మా[illegible] తలవంచి వెళ్ళిపోతున్నాను. దయాళువైన హృదయం ఈ లోకంలో మృగ్యమైపోయింది. ప్రేమతో, స్వేచ్ఛతో స్వాతంత్ర్యాన్ని ఉపా[illegible]ంచే వాణ్ని పిచ్చివాడి కింద, అసమర్థుడికింద [illegible] కడతారు మనుషులు. ఇప్పుడిప్పుడే ఈ జీవితాన్ని గూర్చిన సత్యం నా కర్థమవుతోంది. [illegible] ఆశక్తతమీద నాకే చిరాకు పుడుతోంది. శరీరం విసుగనిపిస్తోంది. ఇంక విశ్రాంతి కావాలి" దూరంగా రైలు వస్తున్న శబ్దం వినిపించింది. హఠాత్తుగా అతను ఆగి తను చదివిన యూనివర్సిటీని, మిత్రుల్ని, చిత్రవిచిత్ర నాగరికతలున్న ఆ దుర్మార్గపు నగరాన్నీ ఆఖరుసారి తలుచుకున్నాడు. పైన ఆకాశంలో నల్లని మబ్బులు కదలడం ఆ చీకట్లో సైతం అతనికి కన్పించింది. రైలు పట్టాలమధ్య నిలువుగా పడుకుని తలని పట్టామీద ఆన్చాడు. రైలు వస్తున్న శబ్దం అంతకంతకీ దగ్గరవుతోంది. కళ్ళు తెరుచుకుని లయబద్ధంగా వినవస్తున్న రైలు చప్పుడుని తదేకంగా విన్నాడు. మృత్యువు పట్టాలెక్కి పరిగెత్తుకొస్తోంది. రాత్రి శిథిల నక్షత్రాలు రోదిస్తున్నాయి. తాను త్వరగా ఈ లోకంనుంచి వెళ్ళిపోవాలి. అదే ఆరాటం అతణ్ని మృత్యువువైపు తరుముతోంది.

రైలు తన చెవి వెనకనే పరిగెడుతున్నంత దగ్గరగా వచ్చేసింది. "బతికున్నకొద్దీ అవమానాలే తప్ప మరేం లేదు" అనుకుంటూ అతను తలెత్తి పైకిచూశాడు. హఠాత్తుగా రైలు హెడ్‌లైటు వెలుతురు అతని ముఖంమీద పడింది. ఆ వెలుగు అతని ముఖాన్ని మండించి అతనికేమీ కనబడకుండా చేసింది. భయంకర శబ్దంతో దడదడలాడుతూ వస్తున్న రైలు మృత్యువు కన్నులా కన్పించింది. మళ్ళీ సరిగా పడుకుని తల పట్టామీద ఆన్చాడు. మిగతా శరీరమంతా స్లీపర్ల మీద వుంది. రైలు పట్టా చెవికి చల్లగా తగులుతోంది. సన్నగా జల్లు మొదలైంది. మెరుపుతోపాటు ఉరుము కూడా గర్జించింది. కళ్ళు మూసుకుని క్షణాలు లెక్కిస్తున్నాడు. శబ్దం విన్పించినంత వేగంగా రైలు రావడంలేదు. "వెళ్ళిపోతున్నాను. దుర్మార్గపు మానవులారా! మీ నుంచి వెళ్ళిపోతున్నాను" మూసుకునివున్న కళ్ళలో తన జీవితకాలంలో పరిచయమైన వ్యక్తులూ, జరిగిన సంఘటనలూ ఒక్కొక్కటే వేగంగా కదిలిపోతున్నాయి. గతకాలపు జ్ఞాపకాలు గుర్తురాగానే మనుషుల మీద ప్రీతితో అతను విచలితుడైపోయాడు. ఆ ఉద్వేగంతో గుండె ఉప్పొంగాయి. హఠాత్తుగా చెవులు దబ్బరపడేట్టుగా విన్పించే రైలు శబ్దంతోపాటు అతని ముఖాన్ని ఏదో చీకటితెర కమ్మేసింది. ఆ చీకటితెర ఏమిటో అర్థం కాకుండానే రైలు చక్రం అతని తలని నుజ్జునుజ్జుగా నలిపేస్తూ రక్తంలో తడిసిన ఆవేశంలో వెర్రిగా పట్టామీద పరిగెత్తింది. కపాలం నుంచి ఎగిరిపడ్డ అతని మెదడు ఈ ప్రపంచాన్ని చూసి క్రూరంగా అట్టహాసం చేసింది. ఆకాశంలో అందాకా బిగుసుకుపోయిన మేఘాలు కుంభవృష్టిగా వర్షాన్ని కురిశాయి. □

ఇండియన్ టైమ్స్ పత్రికా కార్యాలయం రెండో అంతస్తు కుడివైపు హాల్లో బల్ల మీదున్న ఓ చిన్న కాగితం ముక్కని ఘాతద్దంతో పరిశీలిస్తున్నది శైలజ.

"ఏమిటది అంత పరీక్షగా చూస్తున్నావ్?" అన్నది టైపిస్టు రాణి, దగ్గరకొస్తూ.

"ఏదో చెత్తకాగితం. ఏం వ్రాసివుందా అని చూస్తున్నాను."

"సబెడిటర్ లక్షణం పోనివ్వావు కాదు. ప్రతిదాన్నీ శోధించనిదే మనసు నిలవదా యేం?"

శైలజ నవ్వింది. "మనం ఇంకా నయం. అమెరికాలో జర్నలిస్టులైతే...."

"చాల్చాలు—" అంటూ రాణి టేబిల్ మీద కాగితం తీసుకొంది.

ఏదో పురాతన కాలపు పుస్తకంలోంచి పోయిన ముక్క అది. ఎండకి ఎండి, వానకి నాని చివికిపోయింది. శిధిలావస్థలో వుంది.

"ఎక్కడ దొరికిందిది?"

"మా ఇంటి పెరట్లో."

రాణీ నవ్వింది. "పెరటిలో దొరికిన కాగితాలన్నీ ఇక్కడికి తీసుకొచ్చి శోధించటం కోసమేనా నీకు జీతమిస్తున్నది?"

"ఏ పుట్టలో ఏ కాగితం వుందో ఎవరికి తెలుసు?"

"సర్లే పద. టీకి టైమవుతూంది."

ఇద్దరూ కాంటీన్ వైపు నడుస్తూంటే శైలజ అన్నది. "మా ఇంటి పెరటికి అవతలి వైపు గోరీలున్నాయి. అక్కణ్నుంచి గాలికి ఎగిరివచ్చుంటుంది"

"ఏ పుస్తకంలోదో చిరిగివుంటుంది. దానికంత ప్రాముఖ్యత ఇవ్వటం అనవసరం."

శైలజ మాట్లాడలేదు.

ఇద్దరూ కాంటీన్లో ఓ మూల కూర్చొన్నారు. కుర్రవాడు టీ తీసుకొచ్చి ముందుపెట్టేడు.

రాణి ముందుకు వంగుతూ "ఎంత బావుందో" అన్నది.

"ఏమిటి?"

"అలా ముందుకి వంగొని కూర్చొంటే నీ కడుపు మీద ముడత."

శైలజ చప్పున సర్దుకొని కూర్చొంటూ, "ఇడియెట్" అంది.

రాణీ నవ్వింది "నే నన్నదాంట్లో తప్పేముంది?"

తప్పులేదు. శైలజ పక్కనుంచి వెళ్ళే పదిమందిలో తొమ్మది మంది ఆమెవైపు చూస్తారు తిరిగి.

"నీ వయసెంత?" రాణి అడిగింది.

"ఇరవై ఆరు."

"మై గాడ్" అంది రాణి. "ఇరవై ఆరేళ్ళ జీవితాన్ని డ్రైగా గడిపేవా?"

"డ్రై అంటే."

"వెట్ కానిది."

కొంచెం నిశ్శబ్దం. మళ్ళీ రాణీయే టీ కప్పు తీసుకొని తాగుతూ అన్నది. "వేడివేడి కప్పులో టీ లాటిది యవ్వనం."

"అవును. మూడు గుక్కలేస్తే అయిపోతుంది."

"వెయ్యకపోతే చల్లారిపోతుంది."

ఈ మాటలకి శైలజ నవ్వింది. రెండు చేతుల్లోకి కప్పు తీసుకుంది. "నా జీవితాన్ని యిలా దోసిలిలో వుంచి అర్పిద్దామని ఎదురు చూస్తున్నాను. ఈ మనసు, ఈ శరీరం-ఒకరికే. ఆ ఒకరూ యెవరో నాకు తెలీదు. ఇదొక 'వే ఆఫ్ లైఫ్'. నువ్వన్నట్టూ జీవితాన్ని ఇంకో రకంగా కూడా అనుభవించవచ్చు. అది పెద్ద కష్టమేమీ కాదు. కానీ ఇక్కడ ప్రశ్న ఎ రకం జీవితాన్ని కొనసాగించాలా అని. నేను మొదటి రకాన్నే ఇష్టపడతాను."


"ట్రాష్" అంది రాణి. "ఇవన్నీ సెంటిమెంట్లు. నీ ఒక్క జీతం మీద కుటుంబం ఆధారపడివుంది కాబట్టి నీ తండ్రి నీకు సంబంధాలు చూడడు. నీ తమ్ముళ్ళు రెక్కలొచ్చే వరకూ నిన్ను ప్రేమగా చూసి ఆ తర్వాత ఎగిరిపోతారు. అప్పటికి నీకు నలభై ఏళ్ళొస్తాయి."

ఒక్కక్షణం నిశ్శబ్దం.

శైలజ ఖాళీకప్పు కిందపెట్టి, చిన్న








స్వరంతో "ఇవన్నీ నేను ఆలోచించలేదంటావా" అంది.

"ఆలోచిస్తే ఇలా నిస్సారంగా గడపవ్." అన్నది రాణి. "దూరంగా చిన్న వెలుగురేఖ కూడా కనిపించని చీకటే భవిష్యత్తయితే, దొరికిన మిణుగురుల్తో ఆడుకోవటమే మంచి పద్ధతి. 'మీ యింట్లో చిదిమి దీపం పెట్టుకొండిరా' అని ఓ అపరంజి బొమ్మని పల్లకీలో పంపితే, వాళ్ళు సంతృప్తిచెందరు. పక్కన నోట్లకట్ట వుందా లేదా అని చూస్తారు.

నీ శరీరాన్ని నువ్వెంత పవిత్రంగానైనా వుంచూ — ని మనసెంత పవిత్రంగానైనా వుండనీ—పెళ్ళి దగ్గరకి వచ్చేసరికి మళ్ళీ డబ్బే ప్రధానపాత్ర వహిస్తుంది. అలాంటప్పుడు అటువంటి మొగవాడికోసం ఎందుకు శరీరాన్ని పవిత్రంగా వుంచటం? ఎంజాయ్?"

ఆమెవైపు కన్నార్పకుండా చూసింది శైలజ.

అంతర్లీనంగా డబ్బు మనిషి నైతికవిలువల మీద ఎంత ప్రభావం చూపిస్తుంది.

ఈ కొత్త థియరీ చాలా చేదునిజం. కానీ జీర్ణం చేసుకోవాలి.

పొరలుపొరలుగా విడదీసి చూస్తే ముగ్ధంగా వుండాల్సిన స్త్రీని రాటుతేలేటట్టు చేసింది వ్యవస్థేనేమో అనిపిస్తూంది.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్?"

"వ్యవస్థ మారాలంటే ఏం చెయ్యాలి?"

రాణి నవ్వింది. "ప్రళయం రావాలి."

శైలజ నవ్వలేదు. "ఈ వ్యవస్థ మారటం కోసం ప్రళయమే రావాల్సివస్తే, ఆ ప్రళయాన్ని ఈ క్షణమే ఆహ్వానిస్తున్నాన్నేను. ప్రళయం రావాలి. ఆ ప్రళయకాల ఝంఝామారుతంలో....ప్రక్షాళనమైన మనసుతో, ప్రక్షాళనమైన వ్యవస్థలో, మనిషి కొత్త జీవితం ప్రారంభించాలి."

రాణి ఆమె చెయ్యిపట్టుకొని, "ఏయ్, ఏమిటిది? అందరూ చూస్తున్నారు" అంది.

శైలజ తన ఆవేశానికి తనే సిగ్గుపడి "సారీ.

ఇండియన్ టైమ్స్ పత్రికా కార్యాలయం రెండో అంతస్తు కుడివైపు హాల్లో బల్ల మీదున్న ఓ చిన్న కాగితం ముక్కని భూతద్దంతో పరిశీలిస్తున్నది శైలజ.

"ఏమిటది అంత పరీక్షగా చూస్తున్నావ్?" అన్నది టైపిస్టు రాణీ, దగ్గరకొస్తూ.

"ఏదో చెత్తకాగితం. ఏం వ్రాసివుందా అని చూస్తున్నాను."

"సబెడిటర్ లక్షణం పోనిచ్చావు కాదు. ప్రతిదాన్నీ శోధించనిదే మనసు నిలవదాయేం?"

శైలజ నవ్వింది. "మనం ఇంకా నయం. అమెరికాలో జర్నలిస్టులైతే...."

"చాల్చాలు—" అంటూ రాణి టేబిల్ మీద కాగితం తీసుకొంది.

ఏదో పురాతన కాలపు పుస్తకంలోంచి పోయిన ముక్క అది. ఎండకి ఎండి, వానకి నాని చివికిపోయింది. శిధిలావస్థలో వుంది.

"ఎక్కడ దొరికిందిది?"

"మా ఇంటి పెరట్లో."

రాణీ నవ్వింది. "పెరటిలో దొరికిన కాగితాలన్నీ ఇక్కడికి తీసుకొచ్చి శోధించటం కోసమేనా నీకు జీతమిస్తున్నది?"

"ఏ పుట్టలో ఏ కాగితం వుందో ఎవరికి తెలుసు?"

"సర్లే పద. టీకి టైమవుతూంది."

ఇద్దరూ కాంటీన్ వైపు నడుస్తూంటే శైలజ అన్నది. "మా ఇంటి పెరటికి అవతలివైపు గోరీలున్నాయి. అక్కణ్నుంచి గాలికి ఎగిరివచ్చుంటుంది"

"ఏ పుస్తకంలోదో చిరిగివుంటుంది. దానికంత ప్రాముఖ్యత ఇవ్వటం అనవసరం."

శైలజ మాట్లాడలేదు.

ఇద్దరూ కాంటీన్లో ఓ మూల కూర్చొన్నారు. కుర్రవాడు టీ తీసుకొచ్చి ముందుపెట్టేడు.

రాణి ముందుకు వంగుతూ "ఎంత బావుందో" అన్నది.

"ఏమిటి?"

"అలా ముందుకి వంగొని కూర్చొంటే నీ కడుపు మీద ముడత."

శైలజ చప్పున సర్దుకొని కూర్చొంటూ, "ఇడియెట్" అంది.

రాణీ నవ్వింది "నే నన్నదాంట్లో తప్పేముంది?"

తప్పులేదు. శైలజ పక్కనుంచి వెళ్ళే పదిమందిలో తొమ్మది మంది ఆమెవైపు చూస్తారు తిరిగి.

"నీ వయసెంత?" రాణి అడిగింది.

"ఇరవై ఆరు."

"మై గాడ్" అంది రాణి. "ఇరవై ఆరేళ్ళ జీవితాన్ని డ్రైగా గడిపేవా?"

"డ్రై అంటే."

"వెట్ కానిది."

కొంచెం నిశ్శబ్దం. మళ్ళీ రాణీయే టీ కప్పు తీసుకొని తాగుతూ అన్నది. "వేడివేడి కప్పులో టీ లాటిది యవ్వనం."

"అవును. మూడు గుక్కలేస్తే అయిపోతుంది."

"వెయ్యకపోతే చల్లారిపోతుంది."

ఈ మాటలకి శైలజ నవ్వింది. రెండు చేతుల్లోకీ కప్పు తీసుకుంది. "నా జీవితాన్ని యిలా దోసిలిలో వుంచి అర్పిద్దామని ఎదురు చూస్తున్నాను. ఈ మనసు, ఈ శరీరం-ఒకరికే. ఆ ఒకరూ యెవరో నాకు తెలీదు. ఇదొక 'వే ఆఫ్ లైఫ్'. నువ్వన్నట్టూ జీవితాన్ని ఇంకో రకంగా కూడా అనుభవించవచ్చు. అది పెద్ద కష్టమేమీ కాదు. కానీ ఇక్కడ ప్రశ్న ఎ రకం జీవితాన్ని కొనసాగించాలా అని. నేను మొదటి రకాన్నే ఇష్టపడతాను."


"ట్రాష్" అంది రాణి. "ఇవన్నీ సెంటిమెంట్లు. నీ ఒక్క జీతం మీద కుటుంబం ఆధారడివుంది కాబట్టి నీ తండ్రి నీకు సంబంధాలు చూడడు. నీ తమ్ముళ్ళు రెక్కలొచ్చే వరకూ నిన్ను ప్రేమగా చూసి ఆ తర్వాత ఎగిరిపోతారు. అప్పటికి నీకు నలభై ఏళ్ళొస్తాయి."

ఒక్కక్షణం నిశ్శబ్దం.

శైలజ ఖాళీకప్పు కిందపెట్టి, చిన్న








స్వరంతో "ఇవన్నీ నేను ఆలోచించలేదంటావా" అంది.

"ఆలోచిస్తే ఇలా నిస్సారంగా గడపవ్." అన్నది రాణి. "దూరంగా చిన్న వెలుగురెఖ కూడా కనిపించని చీకటే భవిష్యత్తయితే, దొరికిన మిణుగురుల్తో ఆడుకోవటమే మంచి పద్ధతి. 'మీ యింట్లో చిదిమి దీపం పెట్టుకోండిరా' అని ఓ అపరంజి బొమ్మని పల్లకీలో పంపితే, వాళ్ళు సంతృప్తిచెందరు. పక్కన నోట్లకట్ట వుందా లేదా అని చూస్తారు. నీ శరీరాన్ని నువ్వెంత పవిత్రంగానైనా వుంచూ — నీ మనసెంత పవిత్రంగానైనా వుండనీ—పెళ్ళి దగ్గిరకి వచ్చేసరికి మళ్ళీ డబ్బే ప్రధానపాత్ర వహిస్తుంది. అలాంటప్పుడు అటువంటి మొగవాడికోసం ఎందుకు శరీరాన్ని పవిత్రంగా వుంచటం? ఎంజాయ్?"

ఆమెవైపు కన్నార్పకుండా చూసింది శైలజ.

అంతర్లీనంగా డబ్బు మనిషి నైతికవిలువల మీద ఎంత ప్రభావం చూపిస్తుంది.

ఈ కొత్త థియరీ చాలా చేదునిజం. కానీ జీర్ణం చెసుకోవాలి.

పొరలుపొరలుగా విడదీసి చూస్తే ముగ్ధంగా వుండాల్సిన స్త్రీని రాటుతేలేటట్టు చేసింది వ్యవస్థేనేమో అనిపిస్తూంది.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్?"

"వ్యవస్థ మారాలంటే ఏం చెయ్యాలి?"

రాణి నవ్వింది. "ప్రళయం రావాలి."

శైలజ నవ్వలెదు. "ఈ వ్యవస్థ మారటం కోసం ప్రళయమే రావాల్సివస్తే, ఆ ప్రళయాన్ని ఈ క్షణమే ఆహ్వానిస్తున్నాన్నేను. ప్రళయం రావాలి. ఆ ప్రళయకాల ఝంఝా మారుతంలో....ప్రక్షాళనమైన మనసుతో, ప్రక్షాళనమైన వ్యవస్థలో, మనిషి కొత్త జీవితం ప్రారంభించాలి."

రాణి ఆమె చెయ్యిపట్టుకొని, "ఏయ్, ఏమిటిది? అందరూ చూస్తున్నారు" అంది.

శైలజ తన ఆవేశానికి తనే సిగ్గుపడి "సారీ.

పద పోదాం" అంది.

ఇద్దరూ పైకి, శైలజ సీటుదగ్గిరికి వచ్చేరు. రాణీ కుర్చీ వెనక్కి జారబడి, "ఏమిటీ ఫైలు?" అని అడిగింది, ఫైలు విప్పుతూ.

"ఇంటర్వ్యూఅప్లికేషన్లు. రేపు ఇంటర్వ్యూ వుందిగా!"

"కొత్త కుర్రవాళ్ళు వస్తారన్నమాట."

ఒకొక్క అప్లికేషనూ దాని కుడివైపు మూల నున్న ఫోటో; చూస్తూ పేజీలు తిప్పసాగింది రాణి.

అలా చూస్తున్నదల్లా ఒకచోట ఆగి "హాయ్" అంది. "ఈ అబ్బాయి చూడు ఎంత బావున్నాడో."

శైలజ అటు చూడలేదు. "అయితే ఏమి టట" అన్నది.






"సర్లే సర్లే తెలియక అన్నా నామాట" నవ్వింది. మళ్ళీ ఫోటో వైపు చూస్తూ, "అయినా ఇంతందంగా వున్నాడూ అంటె ఈ పాటికే ఎవర్తోనో ప్రేమలోపడే వుంటాడు" అంది.

"లంచ్ టైమ్ అయిపోయినట్టుంది" శైలజ గుర్తుచేసింది.

రాణి నవ్వి లేస్తూ "సర్లే....సాయంత్రం కలుస్తాను" అని వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళేక శైలజ అప్లికేషను ఫైల్లో తిరిగి పెట్టేస్తూ ఫోటో వైపు చూసింది. రాణి అన్నట్టూ ఆతడు చాలా అందంగా వున్నాడు. అమాయకంగా. తనకన్నా చిన్నగా.

పేరు చూసింది.

రమణ.

బి.య్యే. యూనివర్శిటీ ఫస్ట్.

ఫైల్లో అప్లికేషను పెట్టి కట్టేసి, దాన్ని డ్రాయర్లోకి తోసేసి, తన పనిలో మునిగి పోయింది.

○ ○ ○

సాయంత్రం అయిదింటి వరకూ ఆమెకి ఊపిరి సలపని పని తగిలింది. మేటరు కంపోజింగ్‌కి యివ్వటం, కంపోజ్ అయివచ్చిన మేటరు ప్రూఫులు దిద్దటం, అడ్వర్టయిజ్మెంటు బ్లాకులకి ఫోన్‌చెయ్యటం లాటివి. పగవాడికైనా సబ్ ఎడిటర్‌పని వద్దురా బాబూ అంటూ ఆమె వళ్ళు విరుచుకోంటూంటె రాణీ వచ్చింది.

"పోదామా!"

"ఇదిగో అయిపోయింది."

మరో అయిదునిముషాల్లో ఆమె టేబిల్ సర్ది వేసింది.

ఇద్దరూ బైటకొస్తూంటే రాణీ అడిగింది.

"ఆ కాగితంలో ఏం వుందో కనుక్కొన్నావా?"

"ఏ కాగితం?"

"అదే! గోరీల మధ్య దొరికిందన్నావే అది."

"ఉహూ!....ఎక్కడా తీరిక దొరకందే!"

వాళ్ళిద్దరూ కారిడార్‌లో నడుస్తూంటే ఎదురుగా అటెండరు వస్తూ కనిపించేడు. వాడి పేరు ఇస్మాయిల్.

రాణీ అతణ్ణి ఆపి, "ఇదిగో, ఈ కాగితంలో ఏం వ్రాసివుందో కాస్త చెప్పూ" అంది.

అతడు కాగితం అందుకొన్నాడు. చదువుతూంటే అతడి మొహంలో భయం కొట్టొచ్చినట్టూ కనబడింది.

"ఏముందందులో?" నిశ్శబ్దాన్ని భరించలేక అడిగింది.

అతడు మాట్లాడలేదు.

"ఏమిటది? ఉర్దూనా!"

అతడు కాగితంపైపు మళ్ళీ చూసేడు.

"కాదు....అరబ్బీ!"

"నీకొచ్చా?"

"వచ్చు."

"అయితే చదువు."

అతను చదివేడు. "యోమాయున్ ఫిక్కిఫిసూరి ఫతతూనా అఫ్వాజా!"

"అంటే!" ఇద్దరూ ఒకేసారి అడిగేరు.

అతడు తల పైకెత్తేడు. అతడి కళ్ళు నిస్తేజంగా వున్నాయి. మొహం భావరహితంగా వుంది. అనాసక్త కంఠంతో అతనన్నాడు.

స్తూంది.

మనిషిని అనుక్షణమూ బ్రతికిస్తూన్న గాలి కొద్దిగా చెలరేగితే మనిషి గడ్డిపోచలా ఎగరాలి.

బాబు జానకి వళ్ళో మరింత ముసగదీసి పడుకున్నాడు. గదిలో దీపం ఆరిపోయినా ఆమె కదల్లేదు. మినుకు మినుకు వెలుగుకన్నా చీకటే బావుంది. పక్కగదిలో మరిది ఇంకా చదువుతూనే వున్నాడు. రేపు ఇంకో ఇంటర్వ్యూ. ప్రకాశరావు ఇంకా రాలేదు. మామగారి దగ్గు వినిపిస్తూ వుంది అప్పుడప్పుడు. దూరంగా గడియారం ఒంటిగంట కొట్టింది.

గదిలో రమణ పుస్తకంలోకి చూస్తూ

# يَوْمَ يُنفَخُ فِي الصُّورِ فَتَأْتُونَ أَفْوَاجًا

"ఒకరోజు శంఖం పూదబడుతుంది. ఆకాశం తెరవబడుతుంది. అప్పుడు శవాలన్నీ గుంపులు గుంపులుగా లేచి వస్తాయి."

"....ఒకరోజు శంఖం పూదబడుతుంది. ఆకాశం తెరవబడుతుంది. అప్పుడు శవాలన్నీ గుంపులు గుంపులుగా లెచి వస్తాయి."

అతనా మాటలంటూవుంటే దూరంగా ఎక్కడో వురిమింది. ఆ రాత్రి కురవబోయే కుంభవృష్టికి సూచగా మేఘాలు అలుముకొంటున్నాయి.

## నాంది

మినుకు మినుకు మని వెలుగుతూన్న దీపాన్ని టప్పున ఆర్పి చీకటి మరింత చేతనత్వాన్ని పొందింది. మనిషి మనసులో పాపం లాంటి చీకటి; మనోసముద్రపు నిబంధనల చెలియలికట్టని కొద్దిగా తొలిగిస్తే వెల్లువలా బైటకు దూకే పాపం.


తలుపు సందుల్లోంచి బలంగా వీస్తున్న ఈదురుగాలి శబ్దం శరీరాన్ని గగుర్పొడుమాలతి గురించి ఆలోచిస్తున్నాడు. మరుసటి రోజు ఇంటర్వ్యూ. అయినా ఆలోచన్లు మాలతి చుట్టూనే.

....జానకి బాబుని వళ్ళోంచి లేపి, మంచం మీద పడుకోబెట్టింది. కిటికీ తలుపు తెరిచి చూడబోతే ఫెడేలున వర్షపుజల్లు మొహం మీదకు కొట్టింది. చప్పున తలుపు మూసింది. గదియ పెరిగిపోతుందేమో నన్నంత బలంగా గాలి వీస్తూంది.

శివుడి జటాజూటం నుంచి దభిల్లున జారిన గంగానది. ఏనుగు తొండాల్తో పోసినట్టు కుంభవృష్టి.

తలుపు దబదబా బాదిన చప్పుడు. వెళ్ళి తలుపు తీసింది. ప్రకాశరావు. ముద్దగా తడిసిపోయేడు. చలికి వణుకుతున్నాడు. గాలితో పాటు లోపలికొచ్చాడు. తలుపు బలంగా






వేసింది. "ఇక్కడ జల్లు పడుతోంది" అని ముసలాయన గొణుగుతున్నాడు. ఆయన్ని లేవమని చెప్పి మంచం మరిది గదిలో వేసింది. ముసలాయనకి లైటుంటే నిద్రపట్టదు. రమణ లైట్ ఆర్పేసేడు. చీకట్లో వెల్లకిలా పడుకొని కళ్ళు మూసుకున్నాడు. మాలతి.

మాలతి....మాలతి....

ప్రకాశరావు తల తుడుచుకొని బట్టలు మార్చుకొంటూంటే, జానకి వంటింటిలోకి వెళ్ళి అన్నం, నీళ్ళూ పెట్టింది. అతడు రెండు మెతుకులు తిని లేచిపోయేడు. జానకి అన్నీ చూస్తూంది. మాట్లాడలేదు. పెళ్ళయి ఎనిమిదేళ్ళయింది. మాట్లాడటానికేమీ లేదు. కంచం తీసింది.

ప్రకాశరావు గదిలోకి వచ్చేడు. బాబుని క్షణంచూసి పక్కనే పడుకున్నాడు. లోపల వంటగదిలో సామాన్లు సర్ది జానకి కూడా వచ్చింది. మంచం పక్కనే చాపవేసుకొని పడుకొంది. తలదగ్గరే వున్న మాసిన బట్టల పెట్టెలోంచి తడిసిన బట్టల వాసన.

కుడిచేతి వక్కకి వత్తిగిల్లుతూ 'ప్రళయం వచ్చేటట్టు వుంది. పాడు వర్షం' అనుకొన్నది జానకి. తథాస్తన్నట్టు మిన్ను వెన్నుమీద మెరుపు మెరిసింది.

## 2

విరిగిపడటానికి సిద్ధంగా వున్న పాక చూరు కింద కూర్చున్న రాజయ్య పడుతున్న వర్షాన్ని చూస్తున్నాడు. అతడి మొహంమీద ముడతలు అతడి గత జీవితపుకష్టాల్లా లెక్కపెట్టలేనంతగా వున్నాయి. ఆనందాన్నీ విషాదాన్నీ ఒకేలా ప్రదర్శించటానికి అలవాటుపడ్డ గాజు కళ్ళు వర్షాన్ని నిర్లిప్తంగా చూస్తున్నాయి.

రాజయ్య ఎకనామిక్సు చదువుకోలేదు. ఎనిమిదో క్లాసుకూడా చదువుకోలేదు. అయినా భూషణం చెప్పిన లెక్క సరిగ్గానే వున్నట్టు తోచింది. ఆ లెక్క అర్థమయ్యేటట్టు చెప్పటానికి భూషణమూ, పెదకామందూ చాలా కష్టపడవలసివచ్చింది. మరి ఎనిమిదో క్లాసు వరకూ అయినా చదువుకోని రాజయ్యకి, వ్యవస్థ చాలా కట్టుదిట్టంగా నిర్మించిన ఆర్థిక శాస్త్రాన్ని బోధించటం అంటే సామాన్యం కాదు. అయినా వాళ్ళిద్దరూ చాలా కష్టపడ్డారు. చేతివేళ్ళు ఉపయోగించి లెక్కలు కట్టడం నేర్పారు. ఎలాగైతేనేం ఆ చిన్న లెక్కని అతని బుర్రలోకి ఎక్కించేరు. అది బాగా

అర్థమయినా కాకపోయినా ఒక విషయం మాత్రం అతడికి బాగా అర్థమయింది. ఇంకో నెలలో తన పాకా, పొలమూ ఖాళీచేసి అతడు భూషణానికి అర్పించాలి.

పాక సంగతి సరే....దాంట్లో వున్నా, బైట వర్షంలో వున్నా ఒకటే. అయితే తాత ముత్తాత పొలం అది. దాన్ని వదులుకోవాలంటేనే బాధ.

రాజయ్యవాళ్ళ తాత రాజయ్య కిచ్చిన అరెకరాన్ని, భూషయ్యవాళ్ళ తాత భూషయ్య కిచ్చిన పందెకరాల్లోనూ కలపకుండా ఎవరాపగలరు?

ప్రవాహంలా కదుల్తూన్న వాన నీటిలోకి తుపుక్కున వుమ్మేసి, "ఎదవలోకం ఎదవలోకమంట....థూ....భూకంపం వచ్చి కూలిపోకూడదూ" అన్నాడు చుట్టకోసం తడుముకొంటూ.

## 3

లాస్ ఏంజెల్స్, వెస్టర్న్ కాలిఫోర్నియా. హోటల్ షెర్టాన్ నాలుగో అంతస్థులో అయిదు వందల అరవై రెండో నెంబరు గదిలో రాత్రి ఒంటిగంటా నలభై అయిదు నిముషాలకి ఫోన్ ఎడతెరిపిలేకుండా మోగసాగింది. ఫస్ట్ సెక్రటరీ టు ది ప్రెసిడెంట్ ఆఫ్ యునైటెడ్ స్టేట్స్—జేమ్స్ మెక్‌డొనాల్డ్ కొద్దిగా కదిలి, రజాయి కిందనుంచి చెయ్యి బైటికి పెట్టి రిసీవర్ అందుకొని "హలో" అన్నాడు విసుగ్గా.

రూమ్ టెంపరేచర్ కృత్రిమంగా కంట్రోల్ చెయ్యబడినా, గాజు అద్దాల్లోంచి, బైటిమంచు వెన్నులో చలి పుట్టిస్తూంది.

రిసీవర్‌ని చూపుడువేలితో టాప్‌చేసి హలో అన్నాడు మళ్ళీ. హోటల్ ఆపరేటర్ లైన్లోకి వచ్చి, "ఎక్స్‌క్యూజ్ మి సర్" అంది. "కాల్ ఫ్రం శాన్‌ఫ్రాన్సిస్కో".

రజాయి కింద మెక్ కొద్దిగా కదిలేడు.

నలభై అయిదేళ్ళ వయసు. తెల్లబడుతూన్న జుట్టు. ఆరడుగుల రెండంగుళాలు ఎత్తు. యునైటెడ్ స్టేట్స్ కాన్‌స్టిట్యూషన్‌పట్ల అపారమైన గౌరవం. ఒక భార్యా, ఇద్దరు పిల్లలు.

"హలో!"

అవతలిపక్క లైన్లోకి ఎవరో వచ్చిన ధ్వని. "హలో, మెక్!"

"ఎవరూ!"

"రోజర్స్....విలియమ్ రోజర్స్."

మెక్ చేతిలో రిసీవర్ బిగుసుకొంది. పక్కమీద చప్పున లేచి కూర్చొని, "సర్!" అన్నాడు.

"నువ్వు వెంటనే బయల్దేరు."

"సర్!"

"వాషింగ్టన్ కాదు....ఫ్రిస్కో."

నిన్న సాయంత్రం న్యూయార్క్ నుంచి తనతో మాట్లాడాడే. అట్లాంటిక్ సముద్రం నుంచి పసిఫిక్ వైపు ఇంత అర్జంటుగా ఈయనెందుకు వచ్చేడు?

"ఇంకో గంటలో నువ్విక్కడ ఉండాలి. ఈ లోపులో మనకొవల్సిన పూర్తి సమాచారం వస్తుంది."

ఏ సమాచారం అని అడగలేదు. "వస్తున్నాను" అని ఫోన్ పెట్టేసేడు.

మంచంమీదనుంచి దిగి, గబగబా పది బస్కీలు తీసి, సింక్‌లో మొహం కడుక్కొని బాటిల్ చివర్లో వున్న నాల్గు చుక్కలూ కొట్టేసి, సూట్‌కేస్ సర్దుకొని అయిదు నిముషాల్లో మెట్లు దిగేడు.

"ఇంత అర్ధరాత్రి వెళ్ళిపోతున్నారేం?" రిసెప్షనిస్టు పలకరించింది. ఇరవైయేళ్ళ యవ్వనాన్ని ముద్దచేసినట్టుంది. రెండ్రోజుల క్రితం పరిచయం.

మెక్ నవ్వి, "ఫోనొచ్చింది" అన్నాడు.

మెక్ నవ్వితే గ్రెగరీపెక్‌లానూ, నవ్వకపోతే చార్లెస్ బ్రాన్‌సన్‌లానూ వుంటాడు. రాత్రి రెండు. నిర్మానుష్యమైన వరండా.

"ఎవరు? భార్యా?"


తల అడ్డంగా వూపి, "కాదు" అన్నాడు.

"బైట బాగా మంచు కురుస్తోంది. కారు నడవదు."

"ఎలాగో సర్దుకొంటాను."

"దార్లో మాటిమాటికి కాప్స్ (పోలీసులు)






ఆపుతారు"

"గుర్తింపు కార్డు వుంది."

"పీటర్స్ స్ట్రీట్‌లో రెండు తర్వాత వెళ్ళనివ్వరు."

"చుట్టూ తిరిగి నార్త్ స్క్వేర్ మీంచి వెళ్తాను" ఆగి అన్నాడు...."ఎలాగూ రూమ్ ఖాళీచేసేసేను."

"రూమే సమస్య అయితే ఇంకో గంటలో నేను రిలీవ్ అయిపోతున్నారు. షెర్టాన్ హోటల్, రిసెప్షనిస్టులకి మంచి కాటేజీ లిస్తుంది మిస్టర్ మెక్."

మెక్ ఆమెవైపు చూసేడు. బాబ్డ్ గ్రే హెయిర్....నీలి కళ్ళు....పగడాల్లాంటి పెదవులు.

నవ్వి, "ఉండేవాణ్ణే. కానీ పిల్చింది, విలియమ్ రోజర్స్" అని, సూట్‌కేస్ పట్టుకొని చీకటిలో కలిసిపోయేడు.

ఆమె అటే చూస్తూ నిలబడింది. నెమ్మదిగా ఆమె పెదవులమీద చిరునవ్వు వెలిసింది. 'విలియమ్ రోజర్స్' అట. నలభై సంవత్సరాల క్రితం చాలామంది తల్లిదండ్రులు కొడుకులకి ఆ పేరే పెట్టుకొన్నారు. ప్రెసిడెంట్ ఆఫ్ అమెరికాది కూడా ఆ పేరే.

## 4

మెక్ కాంపెస్పా ఎయిర్‌పోర్టు వైపు దూసుకుపోతున్న సమయాన ఢిల్లీ ఇంద్రప్రస్థ మార్గ్ పధ్నాలుగో నెంబరు ఇంటిలో జగదీష్ చంద్ర తన టేబుల్ ముందున్న కాగితాల మధ్య మోచేతులాన్చి, చేతులమధ్య తలపెట్టుకొని నిస్త్రాణగా కళ్ళు మూసుకొన్నాడు. అలసటతో అతని కళ్ళు మూతలుపడసాగాయి. కానీ ఆ అత్రి ఆ విషయాన్ని తేల్చెయ్యాలి. మరుసటిరోజు పార్లమెంటులో మంత్రివర్గాన్ని ప్రకటించాలి.

అతికష్టం మీద అతడి పార్టీ మెజారిటీ సంపాదించగల్గింది. కానీ ఈ మంత్రుల్ని ఎన్నుకోవటంలో ఏ మాత్రం పొరపాటు చేసినా తన పార్టీ అధికారం నుంచి టప్పున పేకముక్కలా పడిపోవటం ఖాయం. అందర్నీ సంతృప్తి పరచటం ఎలా?

జగదీష్‌చంద్ర చిన్నతనం నుంచీ కొన్ని కొన్ని సిద్ధాంతాల మధ్య పెరిగిన వాడు. తన

జీవితాన్ని దేశంకోసం అర్పితం చేసినవాడు. అందుకే నలభై రెండేళ్ళ వయసులోనే ప్రధాన మంత్రి కాగలిగేడు.

దేశాన్ని ఎదుర్కొంటున్న సమస్యలు ఇన్ని ఉండగా ప్రతిపార్టీ రాజకీయాలకి ఇంత ప్రాముఖ్యత ఎందుకిస్తుందో అతడికి అర్థంకాలేదు. ఏ మంచిపని చేయబోయినా - దాంట్లో తప్పులు పట్టడానికి సిద్ధంగా వుంటుంది ప్రతిపక్షం. దేశం గురించి ఆలోచించటం కన్నా వీళ్ళగురించి ఆలోచించటానికే తన సమయం సరిపోవటం లేదు.

ఎలా—

ఉత్తరప్రదేశ్‌కి చెందినవాడికి ఉపప్రధాని పదవి యివ్వాలి. తన పార్టీతో చేతులు కలిపిన లేబర్ పార్టీ ముగ్గురు మంత్రుల్ని రికమెండ్ చేసింది. ఉత్తర భారతానికీ దక్షిణానికీ మధ్య సంబంధాలు అసలు బాగాలేవు. ఈ సారి మెజారిటీ వాళ్ళకే యివ్వాలి. ఇద్దరు ముస్లిం మంత్రులూ, ఒక సిక్కు ప్రతినిధి....

తల విదిలించేడు.

రాజ్యాంగాన్ని మార్చి ఎన్నికల్ని రద్దుచేస్తే తప్ప దేశం బాగుపడదు. ఉహుఁ. తను అలా ఆలోచించకూడదు. భారతదేశపు ప్రధాని అలా ఆలోచిస్తున్నాడని తెలిస్తే దేశంలో....

ఫోన్ మ్రోగింది.

పార్టీ అధ్యక్షుడు అవినాష్.

"ఏమన్నా తేలిందా?"

"ఉహూఁ ఓ పన్నెండు పేర్లు ఫైనలైజ్ చేసేను."

"అందులో పది, సాయంత్రమే అనుకున్నాంగా."

జగదీష్ మాట్లాడలేదు.

"....నేను మెలకువగా వుంటాను. చెప్పు, ఎంతసేపయినా సరే—"

"ఎవరెవరున్నారు మీ గదిలో—"

అవతలివైపు నవ్విన ధ్వని. "అందరూ. మొత్తం దేశం అంతా."

ఫోన్ పెట్టేసేడు.

గడియారం రెండు కొట్టింది.

కిటికీ దగ్గరకొచ్చి బైటకు చూడసాగేడు. మబ్బులు విడిపోయి, వెన్నెల పడుతూంది. విశాలమైన కాంపౌండు. సగంవరకూ పూల మొక్కలు. అక్కడక్కడ పెద్ద బండరాళ్ళు. జుట్టు విరబోసుకున్న దెయ్యంలా దూరంగా పెద్దచెట్టు. ఏదో ఒకటి తేల్చెయ్యాలి. కానీ అందరినీ సంతృప్తిపరచాలి. లేకపోతే పార్టీలో వుంటానే గోతులు తీస్తారు. సమ్మెలు, లూటీలు. పోలీసు కాల్పులు. పార్లమెంటులో ప్రశ్నలు. సైన్యం....

తన చేతకాని తనాన్ని చాలా జాగ్రత్తగా నిరూపిస్తారు....

ఈ రాజకీయాల నుంచి దేశాన్ని ఎవరు రక్షించగలరు?

చీకట్లోకి చూస్తూ తనని తనే యీ ప్రశ్న వేసుకొన్నాడు జగదీష్‌చంద్ర. అతడికి నవ్వొచ్చింది. విశ్వంతో పోలిస్తే — యాభై అడుగుల పొడవూ, నలభై అడుగుల వెడల్పూ వున్న తెల్లకాగితంమీద సూదిని ఇంకులో ముంచి చుక్కపెడితే—కనపడే సూక్ష్మబిందువులాటి భూమి! దానిమీద పిపీలికం లాంటి మనిషి.

....కిటికీ వూచల్ని పట్టుకొని బైటికి చూస్తూన్న చంద్ర ఉలిక్కిపడ్డాడు. చూస్తున్నది నిజమో, కలో అర్థంకాలేదు. గొంతులోంచి రాబోయిన కేకని బలవంతంమీద ఆపుకొన్నాడు. అలాగే నిశ్చేష్టుడై, అచేతనంగా వుండిపోయేడు.


క్రేన్‌తోగానీ, పదిమంది మనుషులు ఎత్తితేగానీ లేవని పెద్దబండరాయి, గాలిలో నాలుగైదు అడుగులు పైకిలేచి, రెండుక్షణాలు శూన్యంలో ఊగిసలాడి, ఎవరో వదిలేసినట్లు దభిల్లున పడిపోయింది.

చుట్టూ గాఢమైన నిశ్శబ్దం.

## ప్రారంభం:

## జూన్ ఇరవైతొమ్మిది

రాత్రి కురిసిన వర్షం ప్రభావంవల్ల చల్లటి గాలి దక్షిణం నుంచి వీస్తూవుంది.




తొమ్మిదిన్నరయింది.

రమణ బట్టలేసుకొన్నాడు. ఉన్నవి రెండు జతలు. అందులో ఒకటి ఇంటర్వ్యూల కోసం, మాలతిని కలుసుకోటం కోసం అట్టే పెట్టింది. అది వేసుకొన్నాడు. జేబులో అర్థరూపాయి వుంది. అన్నయ్యని అడగటానికి మనసొప్ప లేదు. అడిగినా వుండదు. అడక్కపోతే అడిగి లేదనిపించుకున్న అసంతృప్తి వుండదు.

ఫైల్లో సర్టిఫికేట్లు వున్నయ్యో లేదో చూసుకొన్నాడు.

బియ్యే—ఎకనామిక్సు. యూనివర్సిటీ ఫస్టు. ఎన్. సి. సి. బాడ్మింటన్. మంచి కుర్రవాడు.

ఫైలు మూసి, "వదినా వెళ్తున్నాను" అని అరిచేడు. జానకి లోపల్నించే "మంచిది బాబూ" అంది.

"తడుముకోకుండా చెప్పరా" అన్నాడు దగ్గుతూ ముసలాయన. రమణకి నవ్వొచ్చింది. ఇది పదహారో ఇంటర్వ్యూ.

తలూపి బైటకొచ్చేడు.

పత్రికఆఫీసుకొచ్చేసరికి పావుతక్కువ పది.

తనలాటి మరో ఇరవైమంది భారతీయులు. చావబోతున్న ఆవుకోసం ఆకాశంలో తిరిగే గ్రద్దలు.

అతడి వంతు వచ్చేసరికి పన్నెండయింది. నెమ్మదిగా గదిలోకి ప్రవేశించాడు.

ఆ గదిలో వున్న రోజ్‌వుడ్ టేబిల్ ఖరీదుతో ఒక సగటు మనిషి రెండునెలలు, అక్కడున్న వాళ్ళ ఒక్కొక్కరి కోటు కుట్టటానికయిన ఖర్చుతో ఒక నెలా, ఆ గదికేసిన పెయింటింగు ఖరీదుతో మూడునెలలూ భోజనం చెయ్యొచ్చు.

ఆ గదిలో గాలికూడా నమ్రతగా వీస్తోంది. పేపర్ వెయిట్ కూడా హుందాగా వుంది.

"బీ సీటెడ్ మిస్టర్ రమణా."

"థాంక్యూ సర్."

"మీ క్వాలిఫికేషను?"

"బి. య్యే."

"క్లాసు?"

"ఫస్టు క్లాస్. యూనివర్సిటీ ఫస్ట్."

"సబ్జెక్టు?"

"ఎకనామిక్స్."




క్షణం నిశ్శబ్దం.

"..... భూమికీ సూర్యుడికీ మధ్యదూరం ఎంత?"

"తొమ్మిదికోట్ల ముప్పైనాలుగు లక్షల మైళ్ళు."

"మిస్టర్ రమణా-ఆకాశంలో నక్షత్రాలెన్ని?"

లాభంలేదు. ఈ ఉద్యోగం తనకి రాదు. ఆర్థికశాస్త్రంలో పట్టభద్రుడైన తనని అస్ట్రానమీలో ప్రశ్నలడుగుతున్నారంటే అందులోనూ ఇలాంటి చొప్పదంటు ప్రశ్నలడుగుతున్నారంటే—ఈ వుద్యోగం యింతకుముందే యెవరికో అంకితం అయిపోయిందన్నమాట.

అయినా చెప్పటం మొదలుపెట్టేడు.

"మన కంటికి కనపడేవి దాదాపు ఆరువేల నక్షత్రాలు. కానీ లక్షమిలియన్ల నక్షత్రాలు మన మిల్కీవేలో వున్నాయని అంచనా. అలాంటి మిల్కీవే గలాక్సీలు విశ్వంలో దాదాపు పదిలక్షల మిలియన్లున్నాయి. అంటే విశ్వంలో పదికోట్ల, కోట్ల, కోట్ల నక్షత్రాలున్నాయన్నమాట. పది తర్వాత ఇరవైనాలుగు సున్నాలు."

అవతలివాళ్ళ తల దిమ్మెక్కినట్టుంది. కొంచెంసేపెవరూ మాట్లాడలేదు. తరువాత ఒకాయన అడిగేడు.

"లావా అంటే ఏమిటి?"

"భూమి అంతర్భాగాన మహోజ్వలమైన వేడికి కరిగిన ఘనపదార్థం. సప్తలోహాల మిశ్రమం."

"మీరు తెలుగు బాగా అధ్యయనం చేసినట్టున్నారే"....నవ్వులు. రమణ మొహం ఎర్రగా మారింది.

"లావా మరి భూమిపైకి ఎందుకు రాదు?"

"కవచంలాగా పైపొర కప్పుకుంది కాబట్టి."

"లావాలో ఇనుము వుంటుంది కదా."

"ఉంటుంది."

"మీ తమ్ముడు ఓ బావిలోకి అయస్కాంతం పట్టుకెళ్ళాడనుకోండి. మరి లావా బైటకొచ్చెయ్యాలి కదా-ఐ మీన్-భూమిని చీల్చుకొని."

రమణ తలెత్తి చూసేడు. అందరి మొహాల్లోనూ ముసిముసిగా నవ్వులు.

"భూమిపొర చాలా మందం. అలారాదు."

"భూమిపై డెన్సిటీ ఎంత?"

"క్యూబిక్ సెంటీమీటరుకి అయిదు పాయింటు అయిదు గ్రాములు."

"భూమి లోపలి డెన్సిటీ ఎంత?"

"దాదాపు దానికి రెండు రెట్లు."

"అంత డెన్సిటీవున్న లావాని ఈ పొర ఆపగలదా?" అడిగే డాకాయన. "పకోడీలు దట్టంగా కూరి కాగితంలో కడ్తే-లోపలి డెన్సిటీ ఎక్కువైతే ఏమవుతుంది."

ఇంకో ఇంటర్వ్యూ కమిటీమెంబరు తనే సమాధానం చెప్పేడు. "కాగితం పగిలి మనందరికీ పకోడీలు దొరుకుతాయి."

గొల్లున నవ్వులు.

"మిస్టర్ రమణా-భూమి మాస్ ఎంత?"

"అయిదు పాయింట్ తొంభై ఏడు ఇంటూ పదివందల ఇరవై ఏడు గ్రామాలు."

"ఇంత పదార్థాన్ని పైపొర ఆపలేకపోతే ఏమవుతుంది?"

రమణ లేచేడు. సర్టిఫికెట్లు సర్దుకొన్నాడు. అన్నాడు. "ఇలాటి ఇంటర్వ్యూలుండవు. మనిషి తిండికోసం ఏడవటం వుండదు. చదువుకున్న చదువుకి ఇంత ఉద్యోగం దొరకలేదే అన్న బాధ వుండదు. ఎయిర్ కండిషన్డ్ రూములుండవు. ప్రశ్నల్నుండవు. సమాధానాలుండవు. అసలేమీ వుండదు." (ఇంకా వుంది)



# అల్లావుద్దీన్ అభినవ దీపం

వాస్‌బాబు

## అల్లావుద్దీన్ నగర ప్రవేశం!

అల్లావుద్దీన్ కళ్ళు తెరిచి చూసేసరికి అరవై వోల్టుల బల్బు కనిపించింది!

అద్భుతదీపం ఏమయింది?

రాజూ, రాణీ - వాళ్ళమ్మాయి; మాంత్రికుడూ, దుద్దగానే దీపం పైకొచ్చే రాకాసి మిత్రుడూ—వీళ్ళంతా ఏమైనట్టూ?

ఇంతకూ తనెక్కడున్నట్టు?

ఒళ్ళు దులుపుకుని, బల్బును జేబులో వేసుకుని రోడ్డుమీదకొచ్చాడు. రయ్, రయ్ మని బస్సులు దూసుకెళ్ళాయి. అట్లాగే ఆటోలు, స్కూటర్లు అటూ యిటూ వెళ్ళేసరికి అల్లావుద్దీన్ గూబలు గుయ్‌మన్నాయి.

ఇదెక్కడి ప్రపంచం? ఏ ఒక్కడూ క్షణం సేపాగి ఆలోచించుకోడేం? సార్, మీరు అచ్చు అల్లావుద్దీన్‌గారిలా వున్నారు అని చెప్పరేం? తమరి దీపం అద్భుతాలు వల్లిస్తారా? మీ సాహసగాథలు వినిపిస్తారా—అని అడగరేం?

ఈ చివరున్నవాడికి ఆ చివరేదో కొంపలంటుకున్నట్టు, ఆ చివరున్నవాడికి ఈ చివరేదో కొంపలారిపోయినట్టు ఒకటే ఉరుకులు, పరుగులు! ఎక్కడ చూసినా మనుషులే! అంతా గజిబిజి మనుషులే.

అలనాడు — మనోహరముగా అలరారిన సుందరవనములు మచ్చుకైనను కనిపించుట లేదు. రమణీ ప్రియదూతిక తెచ్చియిచ్చు కప్పురవిడెంబు సేవించి, కనక పంజర శారికలకు ఱక్కెరవెట్టి చదివించు సఖియలు వెంటరాగా, కరతాళగతుల మంజిర మయూరంబుల నాడించు యతివలు కథలు చెప్పగా — రాకుమారి ఉద్యానవనంబులో పాదంబిడి ఈ ప్రియుని కొరకు ఎదురుచూడదేలనో? బాలపల్లవ గ్రాసకషాయ కంఠ కలకంఠ వధూకల కాకలీధ్వనులు సేయుచు, "ప్రియతమా, అల్లావుద్దీన్ సఖా" అని రాకుమారి పిలవదేలనో?

ఆ మనోహరత, ఆ ముగ్ధమోహనత్వము, వనములు, మరులుగొల్పు కుసుమ సౌరభములు ఏవి?

నేల ఈనిందా అన్నట్టు ఎక్కడ చూసినా మనుష్యులే .... కుప్పలు కుప్పలుగా! ఇంత మంది వున్నా ఎవడికీ క్షణం తీరికలేదు. ఏమిటో ఈ పరుగులు? ఎక్కడికో వీళ్ళు వెళ్ళేది! కాసేపాగి ఎదుటివాణ్ని పలకరించేదెప్పుడు?

ఇంతగా వాపోతున్న అల్లావుద్దీన్‌కు తన జేబులో వున్న బల్బు తటాలున గుర్తొచ్చింది. వెంటనే బయటకు తీసి అరచేత్తో రుద్దాడు.

మనువటిలాగా తెరలు తెరలుగా పొగలు, అందులో నుంచి అట్టహాసంచేసే రాకాసి మిత్రుడూ రాలేదు.

ఇంతలో ఎవరో మోకాల్ని గీకుతూ న్నంటే మోర కిందికి దించి చూశాడు. తన మోకాలు ఎత్తున్న మరగుజ్జు పళ్ళికిలిస్తూ కనిపించాడు.

"ఏడెవడ్రా" అని ఆశ్చర్యపోతూ అల్లావుద్దీన్ మరుగుజ్జుకేసి చూశాడు.

"నమస్తే అల్లావుద్దీన్ సార్! నేనే మీ రాకాసి మిత్రుణ్ని. మర్చిపోయారా?"—మళ్ళీ పళ్ళికిలించాడు.


"నువ్వా, రాకాసి మిత్రుడివా? దున్నపోతంత మనిషివి ఇట్లా ఎలకపిల్లలా తయారయ్యావేం? నమల్మేను" అన్నాడు.

"తమరికి గుర్తున్న ఆ కాయము అద్భుత దీపానికే పరిమితము. అది పోయిందగ్గా సార్? అరపై వోల్టుల బల్బు రుద్దితే వచ్చేదేముంటుంది? పైగా కరెంటు సప్లయి కూడా సరిగ్గా లేదు" రాకాసి అన్నాడు.

"అయితే మాత్రం .... మరీ మరుగుజ్జు వయిపోతే నాకేం మేలు చేస్తావు చెప్పు?" రెట్టించాడు. దానికి మరుగుజ్జు విరగబడి నవ్వుతూ—

"సార్....నన్ను మరుగుజ్జు అని తీసి పారెయ్యమాకండి. అసలు ఈ ప్రపంచమే మరుగుజ్జుదయిపోయింది సార్! మనుషులు నా కంటే పొడుగ్గా కనిపించినా వాళ్ళ మనసులు మరుగుజ్జు మనసులే సార్! వాళ్ళు మానసికంగా ఎంతగా కుంచించుకపోయారో మీకేం తెలుసు? పైగా నాకేం మేలుచేస్తావు అని అడిగారు. పూర్వం మీకెంతో మేలుచేశాను; మీరు రుద్దినప్పుడల్లా—బాంచెను, కాల్మొక్తా—అని ప్రత్యక్షమై గొంతెమ్మ కోరికలన్నీ తీర్చా. ఏది....దాని ఫలితం ఏమైనా మీకు దక్కిందా? తిండి దగ్గర్నుంచి, కొంప దగ్గర్నుంచి, పెళ్ళాం దగ్గర్నుంచి....ప్రతిదీ సప్లయి సరుకేనా? ఏవి. అవన్నీ ఏమయ్యాయి? దక్కించుకోలేని మేలు దేనికంటా?" కాసేపాగి .... బెంబేలు పడిపోతున్న అల్లావుద్దీన్ మీద జాలిపడి—






"పోన్లెండి....ఇక యిప్పుడు తల పట్టుకుని లాభంలేదు. అప్పటిలాగా భారీఎత్తున దారుణంగా మేలు చెయ్యలేకపోయినా....ఏదో చిల్లరడబ్బుల్లా చేతనయినంతవరకు చేస్తాలేండి. అంతకంటే కూడా మరో గొప్ప మేలు చేసే అవకాశం వుంది."

చేతులు వెనక కట్టుకుని ముఖం కాస్త పక్కకు తిప్పుకుని మరుగుజ్జూ ఓ పోజు పెట్టాడు. అప్పుడు ఊపిరి ఆడింది అల్లావుద్దీన్‌కు.

"అదేదో వెంటనే చెప్పరాదూ....ఈ పోజు దేనికి?"

కాస్త కోపంగా అన్నాడు.

మరుగుజ్జు నవ్వి—

"అంతే సార్. ఇక్కడ ఎవరు ఎవరికి రవ్వంత మేలు చేసినా ముందు పోజులు పెడతారు. ఆ పోజుల్లోనే తమ పరపతి పెంచుకుంటారు. పోజులేని పనే లేదనుకోండి! హి హి!!" అన్నాడు.

"ఊఁ చాల్లే, పోజు! ఇంతకూ నువ్వు చేసే మేలేమిటి చెప్పు—"

కసిరాడు అల్లావుద్దీన్.

"అదే సార్. సలహాలివ్వడం. మీరేదడిగినా సలహా సహాయం చేస్తా."

అసక్తిగా చెప్పాడు.

"సలహా సహాయమా? సలహాలతో నా కడుపు నిండుతుందా? నా పనులవుతాయా?"

గద్దించాడు.

"కడుపు నిండాలనీ లేదు; పనులు కావాలనీ లేదు. సలహా సహాయమంటే సలహాయే! దానికే ఇప్పుడిక్కడ మాంచి గిరాకీ వుంది సార్. ప్రతివాడూ పెద్దవాడి దగ్గర్నుంచి.... చిన్నవాడి వరకు, సలహాలు చెప్పేవాళ్ళే కాని పనులు చేసేవాళ్ళు కారు సార్! దీనికి ఏ పెట్టుబడీ లేదా....ప్రతివాడూ సలహాదార్ అయిపోయాడనుకోండి. ఇంతెందుకు కోట్లు కోట్లు ఖర్చయ్యే ప్రాజెక్టులన్నీ ఈ సలహాలతోనే నడుస్తున్నాయనుకోండి."

అల్లావుద్దీన్ మధ్యలోనే అందుకున్నాడు.

"అంతే నీ ఉద్దేశం....పనులు కావటం లేదనా?"

"అంతే కదా. మన సలహా ప్రకారం పనులు జరగడానికి వీల్లేదు. ఈ సలహాను పేపరువాళ్ళకిస్తే....వాళ్ళు దాన్ని భద్రంగా లోకానికిస్తారు. లోకులు అతి జాగ్రత్తగా ఆ సలహాను పంచుకుంటారు."

అల్లావుద్దీన్‌కు నిజంగా కోపం వచ్చింది.

"ఆపు. నీ సలహాలతో నాకు నిమిత్తం లేదు. కడుపు మండిపోతుంది. ఏ లోకంలో తిన్నానో యేమో తింటానికేదైనా తెచ్చిపెట్టు."

శాసించాడు.

"ఈ శాసనాలే పనికిరావు: ప్రజాస్వామ్యంలో ఇవి చెల్లవు. ఎదురుగా పంపు కనిపిస్తుందా? చిన్న సలహా. అక్కడికెళ్ళి కడుపు మంటలార్పుకుందాం పదండి."

అల్లావుద్దీన్ జవాబుకోసం యెదురుచూడకుండానే గునగునమంటూ పంపు దగ్గరకు పరుగెత్తాడు మరుగుజ్జు. వాడెటు పారిపోతాడోనని అల్లావుద్దీన్‌కూడా పరుగెత్తేడు వాడివెంట. అక్కడకు వెళ్ళాక—

"ఊఁ....చెప్పండి సార్....ముందు మీరు తాగుతారా, నన్ను తాగమంటారా?"

మరుగుజ్జు అడిగాడు. దాంతో అల్లావుద్దీన్ చిర్రెత్తిపోయి వాణ్ని పక్కకు తోసి, పంపు తిప్పాడు. కీచుమనే శబ్దాలు తప్పితే చుక్క రాల్లేదు. కొద్దిసేపలాగే శబ్దాలు విని—

"ఏమిటి నీళ్ళే రావడంలేదు?" అల్లావుద్దీన్ అడిగాడు.

"అంతేసార్! నీళ్ళొస్తే పంపులెందుకు? వచ్చే నీళ్ళను ఆపుచెయ్యడానికే పంపులు."

"అంటే అసలు నీళ్ళే రావా?"


"వస్తాయి. అంతా నిద్రపొయ్యాక ఏ మధ్యరాత్రికాడో బందిపోటు దొంగల్లా వస్తాయి: ఇందులో యింకొక సమస్యకూడా వుంది. పట్టపగలు ఇంత వెలుగులో వచ్చాయనుకోండి....అందులోవున్న బురదా, బొద్దింకలూ, తేళ్ళూ, పాములూ కనిపిస్తాయిగా? అందుకని......"

అల్లావుద్దీన్ హతాశుడయ్యాడు.

మరుగుజ్జుకు మళ్ళీ జాలివేసింది.

"చిన్న సలహా. మిమ్మల్నీ, మీ అద్భుత గాథల్నీ పుస్తకాల్లో యిరికించి కథల రూపంగా స్కూళ్ళలో బోధిస్తున్నారు. బడికి అమాంతంగా తీసుకెళ్తా. అక్కడేమన్నా మేలు జరుగుతుందేమో చూద్దాం." అంటూనే మరుగుజ్జు అల్లావుద్దీన్‌తో సహా మాయమయ్యాడు.

(ఇంకా వుంది)









"ఆ్రపడికి ఏదో సుస్తీ అన్నావు ఏం సుస్తీ!" అని అడిగింది మీరా దారిలో.

"నీరసం—కొడుకులు రమ్మన్నా వెళ్ళరు. పెద్దవాళ్ళకి ఇదో పిచ్చి. సొంత వూరూ, ఇల్లూ అంటూ కదల్రు" కాస్త కోపంగా అంది జానకి. వాళ్ళమ్మా నాన్నాకూడా ఇలాగే అన్నారు

వచ్చి తన దగ్గర వుండమంటే!

"ఇదే! ఈ ఇల్లే!" అని జానకి అనేసరికి మీరా గుండెలు దడదడ లాడాయి.

పెద్ద గేటు—గేటు పైన మధ్యస్తంగా గాంధీగారి విగ్రహం—అటూ, ఇటూ పెద్ద పెద్ద తెల్ల సింహాలు నోళ్లు తెరుచుకుని, అచ్చం నిజం సింహాల్లా ముందుకి వురకటానికి సిద్ధంగా వున్నట్టుగా వున్నాయి.

గాంధీగారి విగ్రహం—ఆ నవ్వు ముఖం ధైర్యం ఇస్తున్నట్టుగా వుంది.

నింపాదిగా గేటు తీసుకుని ఇద్దరూ లోపలకి వెళ్ళారు.

"అబ్బ! ఇంతపెద్ద ఇంట్లో ఒక్క మనిషా వుండేది. కుక్కకాని లేదుకదా!" మీరా ఇటూ అటూ భయంగా చూసింది.

ఆ పక్కనే మొక్కల దగ్గరున్న గంగులు లేచి నిలబడుతూ "దండాలు నర్సమ్మా!" అన్నాడు.

"అమ్మగారు ఏం చేస్తున్నారు?" అడిగింది జానకి.

"కూకున్నారంత. ఎల్లండి" అన్నాడు.

మీరాకి గుండె దడతోపాటు కాళ్ళుకూడా వణకసాగాయి. "ఆవిడ ఎలాంటిదో! ఏమంటుందో! ఎలాంటి ప్రశ్నలేస్తుందో! తను సాహసం చేయట్లేదు కదా!" అనిపించింది.

ముందు వరండా, వరండా దాటి లోపలకెళ్తే పెద్ద హాలు. హాలులోంచే జానకి "పెద్దమ్మగారూ!" అని పిల్చింది.

ఆ వచ్చే ఆవిడకోసం వూపిరి బిగబెట్టుకుని నిలబడింది మీరా.

"ఎవరూ?—జానకా!" అంటూ వచ్చినావిడని కళ్ళు వెడల్పు చేసుకుని చూడసాగింది మీరా.

"అమ్మగారు" అంది జానకి మీరాకేసి తిరుగుతూ.

"నమస్కారమండీ!" వినయంగా రెండు చేతులూ జోడించింది మీరా.

ఆవిడని చూడగానే సగం భయం తగ్గింది మీరాకి.

ఆవిడ ఇద్దర్నీ ఉద్దేశించి, "కూర్చోండి" అన్నారు సోఫా చూపిస్తూ.

జానకి కూర్చుంటూ "కూర్చో" అంది. మీరా కూర్చుంది.

"మీకు చెప్పాను—ఈ అమ్మాయే!" అంది జానకి.

మీరా గుండెలు మళ్ళీ దడదడలాడాయి. ఒకసారి కళ్ళెత్తి ఆవిడకేసి చూసింది. సరిగ్గా అవిడ అప్పుడే మీరాకేసి చూసింది.

మీరా వెంటనే కళ్ళు వాల్చేసుకుంది.

కాస్సేపు వాళ్ళు ఏవో మామూలు విషయాలు మాట్లాడుకున్నారు.

మీరాకి అవిడ మాట్లాడే విధానం అదీ చూస్తోంటే కొద్ది కొద్ది ధైర్యం కలగసాగింది.

"ఈ అమ్మాయి పేరేమిటి?" అడిగిందావిడ.


"మీరా" మీరా, జానకీ ఒకేసారి చెప్పారు.

"మీరా అంటే! మీరాబాయా!" అని అడిగిందావిడ.

జానక్కి తెలియదు—మీరాకీ ఏం చెప్పాలో అర్థంకాలేదు మొదట. స్కూల్లో మీరా అనే వేసింది తల్లి. ఏదో ఒకటి చెప్పాలన్నట్టు అంది. "మీరాబాయి. అందరూ 'మీరా' అనే పిలుస్తారు."

ఇంకా ఏవేం అడుగుతుందోనని భయపడ్డ మీరాకి ఇంక అవిడేం అడగక






"నువ్వు ఒప్పుకొని వచ్చేక నేననేదేముంది?" అంది కాంతమ్మ. అది కోపమో నిష్ఠూరమో అర్థంకాలేదు మీరాకి. మీరా తల్లి పక్కలో కూర్చుంది. "ఇందులో తప్పేముందమ్మా! అవిడా యిద్దరు పిల్లలూ తప్ప మరెవరూ లేరు. నేను చేసే పనికూడా ఏంలేదు. పిల్లలకి జడా అదీవేసి, టైముకి స్కూలుకి పంపటం! వాళ్ళు సరిగ్గా చదువుకుంటున్నారో లేదో చూడటం—నేను చేసే పనంతా పిల్లల పనే! ఆవిడ పెద్దావిడ కదా! అయినా చదువు విషయాలు ఆవిడకేం తెలుస్తాయి? ఎనభై రూపాయలు యిస్తారు" గబగబా చెప్పింది మీరా.

కాంతమ్మ మాట్లాడలేదు.

మళ్ళీ అంది మీరా "నువ్వేమో యిక్కడనుండి కదలనంటున్నావు. నిన్ను వదిలి నేను వెళ్తానా? ఇలా కూర్చుని తింటే మనకున్నది యెన్నాళ్ళు వస్తుంది చెప్పు! ఏవేనా అయిదారు ప్రయివేట్లు దొరికేవరకన్నా చేస్తానమ్మా! ఏమంటావు?"

"నీ యిష్టం! నేను చెప్పేది ఏముంది" నిర్లిప్తంగా అందావిడ.

"అదేమిటమ్మా, అలా అంటావు" బాధగా అంది మీరా.

"బయటకెళ్తే యెన్ని అరాలు వస్తాయో నీకేం తెలుసు? నేను అన్నవన్నీ నీకు చాదస్తంగా అనిపిస్తాయి కాని, యెంత మందికి సమాధానం చెప్పుకోవలసి వస్తుంది."

తల్లి ధోరణి మరోదోవ మళ్ళుతోందని మీరా గ్రహించింది. తనూ అమ్మా యిలా మాట్లాడుకుని ఏనాడయింది! మొన్న విజయ్‌కి జ్వరం వచ్చినప్పటి నుండీ అవసరాలికేనా ఇద్దరి మధ్యా నాలుగు మాటలు జరుగుతున్నాయి.

"పోనీ ఓ నెల చెప్పిచూస్తాను! అక్కడ నాకు ఏదేనా అవమానం జరిగితే యెందుకు చేస్తాను? నాకు నచ్చకపోయినా మానేస్తాను" అని యివతలకి వచ్చేసింది మళ్ళా తల్లి ఏం అభ్యంతరం చెప్తుందోనని. "అవును! అక్కడ తనకి నచ్చకపోతే తల్లికి ఒంట్లో బాగుండలేదని మానేయవచ్చు. పోనీ నలుగురు వున్నారన్నా యెవరితో ఏం మాట వస్తుందో అనుకోవడానికి యెవరూ లేరు. ఒక్కమనిషి. ఇంతకన్నా మంచి అవకాశం ఈ ఊళ్లో దొరకదు. ఇలా వంటకని చెప్తే అమ్మ ససేమిరా వల్లకాదంటుంది. అయినా యిదీ ఒకందుకు మంచిదే! తను యింట్లో

లేకపోతే విజయ్‌ని తీస్తూంటుంది. పసిపిల్లలమీద యెలాంటి వారికైనా అభిమానం వుంటుంది. ఈ సందర్భంగా విజయ్ ఆవిడ అభిమానానికి పాత్రుడవుతే—మెల్లమెల్లగా ఆవిడే పరిస్థితులకి రాజీపడుతుంది. ఆవిడ ఈ ఆలోచన నుండి బయటపడితే ఆరోగ్యం దానంతటదే బాగుపడుతుంది. ఈ బెంగవల్లేగా ఆవిడ అలా అయింది? డబ్బుమాట యెలావున్నా ఈ విషయాలు దృష్టిలో పెట్టుకునయినా తను అక్కడ జేరాలి" అనుకుంది మీరా.

* * *

మర్నాడు—

మీరా ఏడున్నరకే తయారయిపోయింది. విజయ్‌కి జర్వం వచ్చినప్పటి నుంచీ కాంతమ్మే వంట చేస్తోంది. విజయ్‌కి నీళ్ళుపోసి, యింట్లో గిన్నెలూ అవీ తోమి—చిల్లర పనులన్నీ మీరా చేసేసింది.

మీరా తల్లి దగ్గరకి వచ్చింది.

"అమ్మా! నేను వెళ్తున్నా" అంది.

కాంతమ్మ కొద్దిగా మెడతిప్పింది కాని ఏం మాట్లాడలేదు.

మళ్ళీ మీరానే అంది "ఆవిడ ఎనిమిదింటికి రమ్మన్నారు కానీ, ఈ రోజేగా వెళ్ళటం - తొందరగా వెళ్దామని."

ఈసారీ ఆవిడ ఏం పలకలేదు.

"తలుపు వేసుకో!" అని ఇవతలకి వచ్చేసింది మీరా.

మీరా వెళ్ళేసరికి ఎవరూ కనిపించలేదు. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. క్రితంరోజు కనిపించినతనూ లేడు. మీరాకి ఏమని పిలవాలో తెలియలేదు. అలాగే హాల్లో నిలబడిపోయింది. ఒక అయిదు నిముషాలు గడిచినాక పది పన్నెండేళ్ళ పిల్ల పూలసజ్జతో లోపలికి వచ్చింది.

"అమ్మగారు ఏంచేస్తున్నారు?" అని అడిగింది మీరా.

"తానం చేస్తున్నారండి" అని, "మీ రెవరండీ?" తిరిగి అడిగింది.

క్షణం ఆగి, "అమ్మగారికి తెలుసులే!" అంది.

ఆ పిల్ల లోపలికి వెళ్ళిపోయింది,

ఇంకో పది నిముషాలు గడిచిపోయినాయి. మీరాకి లోపలికి వెళ్ళాలంటే తెలియదు. ఈ అమ్మాయి తను వచ్చినట్టు ఆవిడకి చెప్పిందో లేదో! నిన్నటి అతను కనిపిస్తాడేమోనని వరండాలోకి వెళ్ళబోయింది. అంతలో వెనకనించే "ఎంతసేపయింది వచ్చి" అని విని పించటంతో మీరా వెనక్కి తిరిగింది.


"ఇప్పుడేనండీ! పదినిముషాలయింది...." ఏమిటో ఖంగారుగా అనిపించింది మీరాకి.

ఆవిడ "ఇలారా" అంటూ లోపలికి దారితీసింది. మీరా ఆవిడ వెనకాలే వెళ్ళింది. హాలు దాటితే పొడుగ్గా వరండా వుంది. దాన్ని దాటి భోజనాల హాలు. దాన్ని ఆనుకుని వంటగది - వంటగదిలోంచే స్టోరురూములోకి దారి వుంది. వంటగదిని ఆనుకునే పూజగది వుంది. ఇంకా ఎన్ని గదులున్నాయో మీరా చూడలేదు. బయట వున్న బాత్రూం కాక భోజనాల హాలుని ఆనుకుని మరో బాత్రూం వుంది.

మీరాని ఆవిడ వంటగదిలోకి తీసుకెళ్ళింది. "నేను పూజచేసుకుని వస్తాను .... ఇవిగో పాలు - ఆ డబ్బాలో గోధుమరవ్వ వుంది - జావ కాచు" అని చెప్పి ఆవిడ వెళ్ళిపోయింది.

మీరా ఆవిడ చెప్పింది చేసి, ఇంకేమన్నా పనివుంటుందేమోనని చూసింది. చేయడానికి ఏం కనిపించలేదు. పూజకి ఆవిడకి ఏదేనా ఇయ్యాలేమో ఏం అర్థం కాలేదు. అలాగే నిలబడి పోయింది.






అరగంట గడిచిపోయింది. ఆవిడ పూజగదిలోంచి ఇవతలకి వచ్చింది. కొబ్బరి ముక్కా, పువ్వూ మీరాకి యిచ్చింది. మీరా భక్తిగా కళ్ళకి అద్దుకుంది. మీరాకి మాటిమాటికీ "విజయ్ ఏంచేస్తున్నాడో! ఏడుస్తున్నాడేమో!" అనిపించింది. ఇటు ఏంచేయాలో! తను కలలో కూడా వూహించుకోని పనిలో జేరింది. ఏం పొరపాటు జరుగుతుందో! ఎలాంటి మాట వస్తుందోనని ఖంగారూ, భయం! అటు విజయ్ ఏంచేస్తున్నాడోనని ప్రాణం కొట్టుకుంటోంది.

పని చేస్తూ చేస్తూ విజయ్ ఏడుస్తున్నట్టు భ్రమపడ్డం - ఖంగారుగా పని ఆపి, నాలుగు అడుగులు వేసి తమాయించుకోవడం. ఆవిడ ఎక్కడ చూస్తుందోనని - ఏమిటని అడుగుతుందో నని భయం.

ఆ రోజంతా అలా గడిచిపోయింది.

నాలుగు రోజులు గడిచేసరికి మీరాకి ఏ వేళకి ఏం చేయాలో తెలిసిపోయింది. వారం తిరిగేసరికి ఆవిడ దగ్గర బాగా చనువుగా మాట్లాడసాగింది.

ఆ యింటికి పనికి వెళ్ళివస్తున్నాననే ఆలోచనే కలగదు. ఎవరో ఆప్తులింటికి వెళ్ళి కాస్సేపు కూర్చుని వచ్చినట్టుగా అన్పిస్తుంది మీరాకి.

ఎనిమిదింటికి వెళ్ళిన మీరా - ఆవిడకి పూజ అయేసరికి తొమ్మిది అవుతుంది. పూజకి సిద్ధంచేసి - పూజ అయి నయివేద్యం టైముకి ప్రసాదం సిద్ధం చెయ్యాలి - ఆవిడ పూజచేసుకుని వచ్చేసరికి కప్పు గోధుమ జావ సిద్ధంచేయాలి - ఆ తర్వాత వంట.

పదకొండు అయితే ఆవిడ భోజనం చేసేస్తుంది. ఆ తర్వాత కాళీయే. పన్నెండున్నరకి మీరా యింటికి వచ్చేసి రెండున్నరకి మళ్ళా వెడుతుంది. మధ్యాహ్నం ఏ పుస్తకమో చదివి ఆవిడకి వినిపించాలి.

అసలు ఈ కాస్త పనికి ఎనభై రూపాయలిచ్చి ఎందుకు పెట్టుకుందో మీరాకి అర్థంకాలేదు. వంటకి అంటే ఒక్క మనిషి కదా ఏ ముప్పైయ్యో యిస్తుందనుకుంది. జానకి, "రెండు పూటలా భోజనం పెట్టి నలభై యిస్తానని చెప్పింది. అందుకే మా పిన్నికి రాశాను. నువ్వ

యిక్కడ భోజనం చేయవని చెప్పాను - ఎనభై యిస్తార"ని చెప్పాక మీరా తెల్లబోయింది.

ఓ రోజు శాంతమ్మగారింటిదగ్గరనుండి యింటికెళ్తోంటే దారిలో జానకి కనపడి, "ఏమిటి సంగతులు, ఎలా వుందక్కడ?" అని అడిగింది.

"సంగతులు ఏంలేవుగాని అసలు బొత్తిగా పనిలేదక్కడ. మా యింట్లో వున్నంత పనీ కూడా లేదు. ఒకొక్కక్కసారి అనిపిస్తుంది డబ్బు ఎక్కువ వుండి పెట్టుకున్నారా అని" అంది.

"పెద్దగా పనేం వుండదు. నేను మొదటే చెప్పానుగా! ఆవిడకి సహాయంగా వుండాలి. ఒక్కదానికే తోచదు ఒకటి, గుండెదడ మనిషి - నిన్న మధ్యాహ్నం వచ్చేను. అప్పటికి యింకా నువు రాలేదు."

"ఆవిడ ఏమన్నారు?" తన గురించి ఏం చెప్పిందా అని ఆతృతగా అడిగింది మీరా.

"ఏమంటారు" నవ్వింది జానకి. "నువ్వు చాలా పనిమంతురాలివేగాక బుద్ధిమంతురాలివట! ఈ కాలంలో పుట్టవలసినదానివి కాదుట."

మీరా తేలిగ్గా వూపిరి పీల్చుకుంది. "పోనీ! ఆవిడకు యింక మనిషి అవసరం లేదు - వద్దూ అనుకొనే వరకూ తను అక్కడే వుంటుంది. తనకీ యిక్కడికి వచ్చినప్పటినుంచీ నిశ్చింతగా వుంది. తల్లి ఓ మూల ముడుచుకుని పడుకుంటే తనోచోట నిముషాలు లెక్కపెట్టుకుంటూ కూర్చునేది - ఏ పని అయితేనేం" అనుకుంది మీరా.

మళ్ళీ జానకి అంది "ఆ అమ్మాయికి యిక్కడ వుండడానికి కుదరదు కాని వుంటే నాకు చాలా కాలక్షేపం అవును అన్నారు. నీకు వీలున్నప్పుడల్లా అక్కడే గడుపుతూండు" అంది.

"అలాగే" అంది మీరా. జానకి వెళ్ళిపోయింది.

జానకి చెప్పింది అక్షరాలా నిజం! కన్నతల్లికన్నా అభిమానంగా ఆప్యాయంగా మాట్లాడుతుందావిడ. ఈ ఊళ్ళో యింతకన్న మంచి ఉద్యోగం దొరకదు. నిజంగా ఈ పరిస్థితుల్లో యిది తన అదృష్టమే! తను యిలా రావడంతో అమ్మ విజయ్‌ని దగ్గరకి తీస్తోంది.

*  *  *  *

నెలరోజులు గడిచిపోయినాయి. మీరా సాధ్యమైనంత వరకూ పన్నెండింటికి యింటికొచ్చేసి మళ్ళీ రెండు గంటలకే వచ్చేస్తోంది.

ఒకసారి మాటల్లో కాంతమ్మగారంది "ఇంత యిల్లుంది. మీ అమ్మగారిని తీసుకుని యిక్కడికి వచ్చేయకూడదూ, మీరా."

మీరా శాంతమ్మగారు అదివరకు ఒకటి రెండుసార్లన్నప్పుడు "ఎందుకండీ" అంటూ నవ్వి తప్పించుకుంది.

శాంతమ్మగారు "ఏం మీ అమ్మగారు ఒప్పుకోలేదా? ఒకసారి చూద్దానికన్నట్లు తీసుకురా! నేను చెప్తానావిడకి" అంది.

"అబ్బే! ఎందుకండీ."

"నీకూ చాలాదూరం. ఇంత దూరం నడవద్దూ!"

"అది కాదండీ! అమ్మకి నేనిలా జేరినట్టు తెలియదు" అంటూ తను తల్లికి ఏమని చెప్పి జేరింది అంతా, "నేను పిల్లలకి పాఠాలు చెప్పుకుంటాననే అనుకుంటోందండి. అసలు దానికే అమ్మ ఒప్పుకోలేదు" అని చెప్పింది.



# అంతరాలు అంతర్యాలు

## శేషపిళ్ళై

సాధారణంగా ఎంతో రిజర్వ్‌డుగా వుండే మా పిల్లలు కొత్తయింట్లో దిగి పన్నెండు గంటలన్నా కాకముందే ఎదిరింటి పిల్లల్తో అంత హుషారుగా కలిసిపోయారంటే నాకెంతో ఆశ్చర్యం వేసింది. ఆ వూళ్ళో కొత్తగా జూనియర్ కాలేజీ వోపెన్ చేశారు. నన్ను యు.డి.సిగా అప్‌గ్రేడ్ చేసి పోస్టు చేయడంతో కుటుంబంతోసహా ఆ యింట్లో దిగాను.

అది పెద్ద బస్తీగానీ —— పల్లెటూరుగానీ కాదు. కొత్తవాళ్ళు వచ్చారంటే చుట్టుప్రక్కల వాళ్ళు రావడం——పూర్వాపరాలు విచారించడం వీలైనన్ని ఆరాలు తీయడం ఆనవాయితే మరి. బస్తీలోనైతే పెద్దగా పట్టించుకోరు. వచ్చి గంటసేపన్నా కాకముందే చుట్టుపక్కల వాళ్ళంతా వచ్చి మంచీచెడ్డా విచారించి వెళ్ళారు. అందరూ వచ్చి వెళ్ళాక విజయ వచ్చింది.... విజయ ఎదురింట్లో వుండే ఆ పిల్లల యొక్క అదే మా పిల్లల కొత్తఫ్రెండ్సు యొక్క అమ్మ. ఆవిడ వచ్చి విచారించిన తీరే ఓ మోస్తరుగా వుంది. మేమంతా కాఫీ తాగుతూన్న సమయంలో బయట తలుపు మెల్లగా నాజూగ్గా తట్టారు ఎవరో. వెళ్ళి మా ఆవిడ తలుపు తీసింది. ఎత్తుకు తగినంత సన్నగా—— ఆకుపచ్చని షిఫాన్ చీర-అదే రంగు బ్లవుజు-మెడలో సన్నని గొలుసు-కుడిచేతికి వాచీ—— ఎలాంటి వ్యక్తినన్నా మొదటి చూపుతోనే ఆకట్టుకొనే చక్కని పర్సనాలిటీ-మత్తెక్కించే ఆ కళ్ళు-సన్నని నాజూకైన వ్రేళ్ళు-అందమంతా ఒకేచోట కుప్పపోసినట్టుండే ఆవిడని మళ్ళీ మళ్ళీ చూడాలనిపించినా సభ్యత కాదేమోనని చూపులు వెంటనే మరల్చుకొన్నా. రెండు చేతులూ జోడించి "నమస్కారమండీ! ఎదిరింట్లో వుంటున్నాన్నేను. నా పేరు విజయ. మావారు ఆర్మీలో వుంటున్నారు. సామాన్లు సర్దడంలో సాయం కావల్సివస్తే చెప్పండి. మొహమాట పడకండి" ఆ గొంతులో వేయి వీణలు మీటినట్టు-కోటి రాగాలు ఆలపించినంతటి ఆకర్షణ వుంది. 'థాంక్సండీ! సర్దుకొంటాంలెండి' అని మా ఆవిడ సరిత ఒకవేపు చెబుతున్నా విజయ యెంతో చొరవగా వుషారుగా దాదాపు రెండు మూడు గంటలసేపు మాతో వుండి అంతా సర్ది వెళ్ళింది. ఆ సాయంత్రానికే పాలవాడిని-పెరుగువాడిని-కూరలమ్మిని-పనిమనిషిని పరిచయంచేసి నెల కాతా మీద కుదిర్చి వెళ్ళింది. విజయ అలా పరిచయమైంది మా కుటుంబానికి.

ఆలోచనలు మాని నా ముందు బల్లమీద పడివున్న వుత్తరాన్ని మళ్ళీ మళ్ళీ చదివాను.

అందులో ఒక్కో అక్షరం నా వ్యక్తిత్వాన్ని నా డిగ్రీని-సమాజంలో నాకున్నదనుకొనే గౌరవప్రదమైన స్థానాన్ని సవాలు చేస్తున్నట్టుంది. నా చూపులు దూరంగావున్న గోడమీద పడ్డాయి. రెండు పెద్ద బల్లులు....బాగా పెద్దవి... మరో చిన్నబల్లిని తరుముతున్నాయి. చిన్నబల్లి ప్రాణభయంతో పరుగెడుతూంది. పరుగెడ్తూ-పరుగెడ్తూ తటాలున అది నాలుక చాపి గోడమీద వున్న ఈగను గబుక్కున మింగేసి మళ్ళీ పరుగు లంకించుకుంది. ఒకవేపు ప్రాణం కాపాడుకోడానికి పరుగెత్తుతూ మరోవేపు ప్రాణిని నిర్దాక్షిణ్యంగా మింగేసిన ఆ చిన్నబల్లి మనస్తత్వం, చూసి నాకు ఆలోచనలు పరిపరి విధాలుగా పరుగులు తీయడం ప్రారంభించాయి.

ఆలోచనలు మళ్ళా వెనక్కు మళ్ళాయి. ఆ యింట్లో చేరిన రెండు మూడు రోజులకే విజయ విషయం చూఛాయగా తెలిసివచ్చింది. ఆ రెండ్రోజుల్లో ఆ వీధిలోని అమ్మలక్కలంతా మా యింటిని సెంటర్‌గా చేసుకొన్నారు. కలిసికట్టుగా అంతా విజయపై పితూరీలు చెప్పడం. ఆవిడ గాలి సోకితేనే తామెంతో అపవిత్రులైపోయేట్టు ప్రవర్తించడం మొదలుపెట్టారు. సరితగాని-నేనుగాని వాళ్ళ మాటల్ని కాతరు చేయలేదు. మరికొన్ని రోజులు గడిచేసరికి హెచ్చరికలు రావడం మొదలయింది. "ఆ సానిదాంతో మరీ అంత క్లోజ్‌గా వున్నారేమండీ. పచ్చని మీ కాపురంలో నిప్పు పోస్తుందండోయ్. జాగ్రత్త. చేతులు కాలాక ఆకులకోసం ప్రాకులాడినట్టవుతుంది." సరిత ఎప్పటిలా చిరునవ్వు నవ్వేసరికి వాళ్ళకి ఒళ్ళు మండేది పాపం. మరో వారం తిరిగింది. ఇటు విజయ మాకెంతో దగ్గరవుతూంటే అటు ఆ వీధిలోని మిగతా వాళ్ళంతా అంత దూరమయిపోయారు. క్రమక్రమంగా మా యింటికి రావడం....మాతో మాటాడ్డం మానేశారు. విజయకు ఈ విషయాలన్నీ తెలిసినా తెలియనట్లే వస్తూపోతూ వుండేది.

ఏ విషయంలోనూ-సరితకూ, నాకూ యీ పదేళ్ళ కాపురంలో ఎప్పుడూ అనుమానాలు-అభిప్రాయభేదాలూ రాలేదు. విజయ విషయంలోనూ అంతే.


మా పిల్లలు విజయను అత్తయ్యా అనీ.... వాళ్ళ పిల్లలు నన్ను మామయ్యా అనీ.... మా సరితను అత్తయ్యా అనీ చుట్టరికం కలిపి పిలిచేవారు. కారెక్టర్‌లేని ఆడదని వూరంతా వెలివేసినట్టు ప్రవర్తిస్తుంటే మేం మాత్రం విజయను ఎంతో దగ్గరికి చేరదీయడం చూసి అక్కడక్కడా గుసగుసలు వచ్చినా మేం పట్టించుకోడం మానేశాం. సరిత, నాతో అప్పుడప్పుడనేది. "విజయ వయస్సులో వున్న ఆడది. పాపం భర్త ఎక్కడో ఊహకందని దూరంలో వుంటుంటే యిక్కడ తాను తెలిసో తెలియకో పొరబాటే చేసిందనుకోండి. ఆ మాత్రం తప్పుచేయని వాళ్ళెవరండీ. కాకుంటే ఒకొక్కళ్ళు వొకోరకం తప్పులు చేస్తూంటారు గాని. ఆడదానికి ఆడదే శత్రువంటే అతిశయోక్తి కాదండీ. చూడండి అవిణ్ని కాకుల్లా పొడిచేస్తున్నారు. పాపిష్టి మూక!" సరిత విశాల హృదయాన్ని - పరిస్థితుల ప్రాభవాన్ని అవగాహన చేసుకొనే సుతిమెత్తని అంతరంగాన్నీ ఎంతో మెచ్చుకొనేవాణ్ని.

ఆటల్లోగాని మిగతా సమయాల్లోగాని సాధారణంగా పిల్లలమధ్య యేర్పడే తగవులు కూడా మా రెండు కుటుంబాల్ని విడదీయలేకపోయాయి. అటు విజయ-ఇటు సరిత ఎప్పటికప్పుడు తగవుల్ని త్రుంచేసే వాళ్ళు. సరిత వాళ్ళపిల్లల్ని-విజయ మా పిల్లల్ని వెంటేసుకొని వచ్చి సర్దేయడం మామూలైపోయింది. దాంతో పిల్లలు మానసికంగా మాకు మరీ దగ్గరయ్యారు.

విజయ ఆలోచనలు - ప్రవర్తనా అదో ధోరణిలో వుండేవి. ఆవిడ దేన్నీ సీరియస్‌గా తీసుకొనే రకంకాదు. అదీ ఒకందుకు మంచిదే అయింది. లేకుంటే ఆ వీధిలోనేగాదు....ఆ వూళ్ళోనే విజయలాంటి ఆడది బ్రతకటం కష్టమనిపించింది నాకు. సాయంత్రం కాలేజీనుండి రావడంతోటే మా పిల్లలు నన్ను చుట్టుముట్టి రకరకాలుగా వూసులాడుతుంటే పాపం చిట్టి-








నానీ దూరంగా నుంచొని బిక్కుబిక్కుమని చూస్తూండేవాళ్ళు తొలిరోజుల్లో. అమాయకమైన ఆ కళ్ళల్లో....మనకూ మన నాన్నగారు దగ్గరుంటే....మనం కూడా యిలాగే సాయంత్రానికల్లా....అన్న తీయని ఆలోచనల్ని చదవగలిగాను. వాళ్ళనీ దగ్గరకు తీసి మా పిల్లల్తోబాటు వాళ్ళ కబుర్లూ వినడంతో వాళ్ళకు నేనంటే అదోరకం భక్తి-ఆప్యాయత పెరిగాయి.

రెండునెల్లు గడిచేసరికి విజయ గురించి మరికొన్ని చేదునిజాలు తెలిశాయి. విజయకి ఆ సరికే ఓ పెళ్ళయిందట. అడవిమనిషిలాంటి అతడితో సంసారం చేయలేక విజయ అవూళ్లోనుంచి మిలిటరీలో చేరిన ఒకతను సెలవుల్లోరాగా అతన్తోబాటు ఈ వూరు లేచివచ్చేసిందట. కానీ యిప్పుడు ఆ మిలిటరీ అతను కూడా సరిగ్గా చూట్టంలేదనీ-అందుకే విజయ అందమైన తన వొంటిని అమ్ముకొని బతుకుతుందని తెలియవచ్చింది. సరితకే విజయపట్ల మరింత జాలి పెరిగిందేగాని ఏ మాత్రం తగ్గలేదు.

సరిత వాళ్ళ నాన్నకి సుస్తీ చేసిందని అర్జంటుగా తీసుకురమ్మన్నారనీ వాళ్ళ తమ్ముడు ఓ రోజు ఉదయం వచ్చి సరితను ఆ రోజు సాయంత్రానికే తీసికెళ్ళిపోయాడు. పిల్లలకి కూడా పరీక్షలైపోవడంతో ఆ పర్యాయం సరిత పుట్టింట్లోనే రెండునెలలు గడిపేసింది.

కొన్ని పరిస్థితులు-అవసరాలు మానవుణ్ణి బలహీనుణ్ణి చేస్తాయి. పరిస్థితుల ప్రభావం నుండి బయటపడ్డం అంత తేలికైన సంగతేం కాదు. ఒక నిండు జీవితకాలం ఆదర్శాలకూ ఆశయాలకూ కట్టుబడ్డా....జీవితంలో ఎప్పుడో వొకప్పుడు మానవుడు పతనమైపోతుంటాడు. ఆ పతనం కావడానికి నెల్లూ-సంవత్సరాలూ అక్కర్లేదు. కొన్ని క్షణాలు చాలు. అతణ్ని అధఃపాతాళానికి త్రొక్కేస్తాయి. అయితే ఆ కొన్ని క్షణాలే గనుక అతడు పరిస్థితుల్ని—ఆకర్షణల్ని—అవసరాల్ని తట్టుకొని నిలబడ

గలిగితే-పరిస్థితుల్ని జయించిన విజేత అవుతాడు. అలా ఎందరు తట్టుకోగలరనేది ఆలోచించదగ్గ సంగతే మరి.

ఉన్నట్టుండి వులిక్కిపడ్డాను. సరిత వూరి కెళ్ళిన సమయంలో....ఆ రోజు....నా జీవితంలో ఓ కాళరాత్రి....ఉక్కపోతకు భయపడి ఆరుబయట వరండా ప్రక్క మంచం వేసుకొని పడుకున్నా దక్షిణంవేపు నుండి కొబ్బరి చెట్లమీదుగా చల్లని పైరగాలి- ఆకాశంలో చక్కని చిక్కనైన వెన్నెల-ప్రక్కనే బాగా విచ్చుకొన్న మల్లెతీగలు-సరిత మీదకి మనస్సు మళ్ళింది. సరితను గూర్చిన తీయని ఆలోచనల్తో ఎప్పుడో నిద్ర పట్టేసింది. ఒక రాత్రి వేళ....అటు తిరిగితే....ఏదో చక్కని స్పర్శ. మెత్తగా....వేడిగా వుండే అవయవాలు నా ఛాతికి తగిలి గిలిగింతలు పెట్టాయి. నెలరోజులుగా ఆ స్పర్శకే .... ఆ వేడికే....వళ్ళంతా తపించిపోతూన్న నేను....ఉలిక్కిపడి బలవంతంగా కళ్ళు తెరిచి చూశాను. మైగాడ్! నా ప్రక్కన వున్నది సరిత కాదు....విజయ!

అవును విజయే. ఎవరి అందమైతే మొదట్లో నన్ను వుక్కిరి బిక్కిరి చేసిందో ఆ విజయే.... ఎవరినైతే సొంత చెల్లెళ్ళు లేని నేను సొంత చెల్లెలికన్నా మిన్నగా యిన్నాళ్ళు భావించానో ఆ విజయే....నేను ప్రయత్నించకుండానే.... నా ప్రక్క....నా మంచం మీద .... చక్కని వెన్నెల్లో....సరిత లేనప్పుడు వొంటరిగా.... విజయ నాకా క్షణం చెల్లెల్లా కనిపించలేదు. విజయ నా క్కావాలి. విజయను వదలిపెట్టలేను. ఎందరి చేతుల్లోనో నలిగినా యింకా బిగువు బొంకం సడలని విజయ వళ్ళు....ఆకర్షణ.... అందం అనుభవించడానికే గాని ఆరాధించడానికి గాదనే విజయ మనస్తత్వం ...ఆవిడ ప్రవర్తనా నన్ను పిచ్చివాణ్ణి చేశాయి. ఎడం చేత్తో విజయను దగ్గరగా తీసుకొని....మరెక్కడికైనా పారిపోతుందేమోనన్నట్టు గట్టిగా ఆవిణ్ణి బంధించేశాను. కిలకిల నవ్వుతూ .... మరో క్షణంలో అనుకూలంగా తయారైన విజయ పైకి వాలిపోయాను. నాలుగు గంటల రాత్రి వుండొచ్చు సుమారుగా! చీర సర్దుకొంటూ పైకి లేచింది విజయ. వరండాలో, హేంగర్‌కి వ్రేలాడుతూన్న షర్టు దగ్గరికి నడిచి....పాతిక రూపాయి తెచ్చి నాకు చూపిస్తూ "యిది నా రేటు ..." అంటూ గబగబా నాలుగడుగులు ముందుకువేసి మళ్ళీ వెనక్కి వచ్చి "రాత్రి కూడా రానా?" అని అడిగింది.

విజయతో గడిపిన ఆ రెండు గంటల అనుభవం నా కెంతో తీయగా—అడ్వెంచరస్‌గా—మళ్ళీ మళ్ళీ కావాలనుకొనే అనుభవంగా అనిపించింది. చిన్నప్పుడు యింట్లో గంపల నిండుగా మామిడి పళ్ళున్నా....ఊరి వెలుపల తోటలోకి దొంగతనంగా చొరబడి కాయలు కోసి తెచ్చుకొని దూరంగా బండమీద కారం, ఉప్పూ కలిపి నూరి తింటుంటే కలిగే ఆనందం లాంటిదే యిది అనిపించింది. తప్పు....తప్పు! ఈ రెంటినీ తేలిగ్గా సరళరేఖ గీసి విడదీసి నిర్వచించలేం. ఆకలి తీరేందుకు మరో ప్రాణిని చంపితే పాపంలేదు .... అది హింస కాదు. అలాగే యిదిన్నీ....ఈ ఆలోచన రావడం.... మరుక్షణం వొక నిర్ణయానికొచ్చి అలాగే రమ్మన్నాను విజయను. రెండు మూడు రోజులకోసారి విజయతో....గమ్మత్తుగా గడిచింది.

సెలవులైపోయాయి. మరో రెండ్రోజులకు సరిత వస్తుందనగా ఆ రోజు రాత్రి విజయతో అన్నాను. 'సరిత వచ్చేస్తుంది రెండ్రోజుల్లో.' చమత్కారంగా కళ్ళు తిప్పుతూ అడిగింది విజయ. "అయితే నన్ను రావద్దనేగా మీరనేది" "నోనో....మా ఇంట్లో....అదే నేనే మీ ఇంటికి వస్తుంటాను. రెడీగా వుంటావు గదూ" అర్థింపుగా వుంది నా గొంతు. విజయ అవుననలేదు. కాదనలేదు. మౌనం అంగీకారమనుకొన్నా.

సరిత శనివారం వచ్చేసింది. ఇకమీద విజయ మా యింటికి యింత క్రితంలాగా ఫ్రీగా రాదనుకొన్నా.... కాని విజయలో ఎలాంటి మార్పులేదు. విజయ వస్తూపోతూ వుంటే.... కళ్ళతోనే విజయను నగ్నంచేసి నాకు కావలసిన కోణంలోంచి చూసి తృప్తిపడే వాడిని. ఏదో సందర్భంలో సరిత కళ్ళుకప్పి విజయను





తాకాలని ప్రయత్నించాను. ఇదో రకం ఆకర్షణ. దీన్ని తప్పించుకోలేనేమో ననిపించింది. ఒకసారి రుచి మరిగాక మనిషి ఒకపట్టాన కొన్ని ఆకర్షణల నుండి దూరం కాలేడు.... దానికి బానిసైపోతాడు.

ఆదివారం సినిమాకెళ్ళాం. ఆ రాత్రి సరిత పక్కనేవున్నా నాలుగైదుసార్లు మనసు ఎటో తిరగసాగింది. తెల్లవారింది .... సోమవారం. ఉదయం....ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది.. గంటల గడుస్తున్నా విజయ కానరాలేదు. ఎదిరింట్లో అలికిడి లేదు. నాని-చిట్టిల సందడి కూడా ఏమాత్రం లేదు. కాలేజీకి వెళుతుంటే సరిత చెప్పింది విజయ యిల్లు ఖాళీచేసి మరో వూరెళ్ళిపోయిందని. నా చెవుల్ని నేనే నమ్మలేకపోయాను. విజయ అందమైన కళ్ళు.... ఆ చక్కని సన్నని నడుం....ఆ శంఖంలాంటి మెడ....ముత్యాల్లాంటి పళ్ళు... గత జ్ఞాపకాలతో వళ్ళు వేడెక్కిపోసాగింది. మనస్సు గజిబిజిగా వుంది....పాపం విజయ! ఎందుకు ఖాళీచేసినట్టు. కొంపదీసి నాకోసం కాదుగదా! డబ్బుకోసం కక్కుర్తిపడే విజయలాంటి వాళ్ళు ఎవరైతేనేం అనుకొంటారుగాని అనుకొని సర్దుకొన్నాను.

బుధవారం వుదయం పోస్ట్ వచ్చింది. వచ్చిన వుత్తరాల్లో ఒకటి పైన 'పర్సనల్' అని వ్రాయబడివుంది. అడ్రసులోని అక్షరాలు ముత్యాలు కూర్చినట్టు పొందిగ్గా వున్నాయి. ఆదుర్దాగా చించాను. ఊరిపేరు లేదుగాని క్రింద విజయ అన్న సంతకం వుంది. కవరు త్రిప్పి పోస్టల్‌ముద్ర చూశాను. సరిగ్గా కానరాలేదు. ఆసరికే కనీసం ఓ పదిసార్లన్నా చదువుకొన్న ఆ వుత్తరాన్ని మరోసారి చదువుకొన్నా....

డబ్బుకోసం వళ్ళు అమ్ముకొనేదాన్ని. కాదన్నా. మీ ఆవిడ వూరంతా అసహ్యించుకొన్నా నన్ను చేరదీసింది. ఎడారిలో ఒయాసిస్‌లా....ఈ ఆర్నెల్లూ జరిగింది. డబ్బు అవసరం నన్ను ఆ రోజు రాత్రి మీ దగరకు తరిమింది. అప్పుగా మీ వద్ద పుచ్చుకోడానికి నాకు మనస్కరించలేదు. నాకు తెలుసు. దొంగచాటుగా కొని తెచ్చుకొనే అనుభవాల్ని మగవాళ్ళు ఒకపట్టాన వదలిపెట్టలేరు కొందరు. అందుబాటులో వుంటే మరీను. అందరి మగాళ్ళకు మల్లే మీరు ఓ మగాడికిందే లెక్క.... లేకుంటే మీ యింటికే వస్తాను, రెడీగావుండు అనేవారు కాదు. నాకు తెలుసు. మీరు సరితను ముత్యాల్లాంటి అమాయకులైన బిడ్డల్ని అన్యాయంచేసి ప్రతిసారీ పాతికరూపాయలతో నా దగరకు రావడానికి ప్రయత్నిస్తారు. ఒక ఆడది మరో ఆడదాని వాళ్ళో అందులో సరితలాంటి వాళ్ళో నిప్పులు పోయకూడదు. నాకూ ఓ నీతి వుంది....నియమం వుంది. అంతకన్నా కృతజ్ఞత వుంది. శాశ్వతంగా యీ వూరే వదలి వెళ్ళిపోతున్నా. కొందరు అందుబాటులో వుంటే అనుభవిస్తారుగాని వాటికోసం చెడు తిరుగుళ్ళు తిరిగి సాహసాలు చెయ్యరని నాకు తెలుసు. పాపం....చంటి పిల్లల్లాంటి వాళ్ళు. ఏడ్చి అల్లరిచేస్తేగాని అమ్మ పెట్టదని చంటి పిల్లకూ తెల్సుగాని....వీళ్ళు యింకా అమాయకులనే అనాలి. వాళ్ళ కోవలోకి చెందుతారు మీరు నిస్సందేహంగా. దయచేసి జరిగిందంతా ఓ పీడకలలా అనుకోండి. చక్కగా ఎప్పటిలా కాపురం చేస్తారు గదూ!

మీకేకాదు....ఎవరికీ ఎప్పుడూ
ఏమీకాని, కాకూడదనుకొనే...."

విజయ.

నిజమే! అందమైన అనుభవాల కోసం.... అందుబాటులో వుంటేగాని సాహసించి ప్రయత్నించే మనస్తత్వం కాదు నాది. ఎంత చక్కగా అంచనా వేసింది విజయ! డబ్బుకు మొగం వాచివున్నా తనకూ ఓ నీతి వుందనీ—వుండడమే కాదు....దాన్ని ఆచరణలో పెట్టగలిగిన నేర్పు, ఉదారగుణం కూడా తనలో వుందని నిరూపించుకొన్న విజయ....నా కన్నా ఎన్నోరెట్లు....ఉన్నతంగా....అందని శిఖరాల మీద వున్నట్టనిపించింది. 'ఎక్కడి నుండి వచ్చిందండీ ఆ వుత్తరం....' అన్న సరిత వాక్యాల వెనుక మరేం అడిగిందో వినిపించలేదు ఆ క్షణం.

□

# వెలుగూ - వేడీ

శీలా వీర్రాజు కవిత

పల్లెటూరి డొంకల్నీ ఊరి చివరి పుంతల్నీ
పొలంగట్ల కంపల్నీ
చిమ్మ చీకటి రాత్రిళ్ళు
వెలిగి ఆరే దీపాల్తో అలంకరించినట్టు
మెరుస్తున్నాయి మిణుగురు పురుగులు
పట్టణాల్లో శుభకార్యాలకి
అలంకరణగా వెలిగించే
ఫేన్సీ దీపాల మాలా తోరణాల్లో
వెల్తురుకన్న అందమే ఎక్కువ.
మిణుగురుల వెలుగులోనూ అంతే
అందుకే అవి తారల్లాటివి
రాత్రి అందాన్ని పెంచే
మిణుకు మిణుకు దీపాలవి

కాని
వెలిగే ప్రతీదీ వేడినివ్వదు
గుప్పెడు మిణుగురుల్ని మూటగట్టినా
గుడ్డిపీలికైనా కాలదు
అందుకే నాకు
ప్రాణం వున్న మిణుగురుకన్న
ప్రాణంలేని చెకుముకిరాయే యిష్టం
అది కక్కే నిప్పురవ్వకు
వెల్తురు తక్కువైనా వేడి వుంటుంది
క్షణ కాలమే మెరిసి మాయమైనా
సకాలంలో పట్టి బంధిస్తే
పదిమందికి వెలుగిచ్చే మంటవుతుంది.



మినీ కథ

# గొలుసుకట్టు వ్యవహారం

కంపెనీ యిచ్చిన యూనిఫార్మ్ తెల్లని పాంటు మీద తెల్లని పొడవాటి ఫుల్ హాండ్ బుష్ షర్టు వేసుకొని డోర్ పక్కన స్టూలుమీద అటెంటివ్‌గా కూర్చున్నాడు అటెండరు, కాలింగ్‌బెల్ ఏ క్షణంలోనైనా మోగుతుందని ఎదురు చూస్తూ.

గ్లాస్కో పంచె, సిల్కులాల్చీ ధరించిన కంట్రాక్టరు హడావిడిగా వచ్చి మేనేజింగ్ డిరెక్టర్ దర్శనం కోరేడు. అటెండరు గోడకి వ్రేలాడుతూన్న కాగితం ముక్కల్లోంచి ఒకటి తీసి అందించాడు అలవాటుగా. కంట్రాక్టర్ రాసిచ్చిన స్లిప్పు తిరిగి తీసుకొని స్ప్రింగు తలుపు తెరిచి లోనికి వెళ్ళి మేనేజింగ్ డిరెక్టర్ టేబులు మీద పెట్టి వచ్చాడు.

ఎప్పటికీ పిలుపు రాకపోతే బయట కుర్చీ మీద కూర్చున్న కంట్రాక్టరు తొందర చేస్తూ అటెండరు చేతిలో టిక్కీసు వుంచాడు. అటెండరు ఆ తర్వాత లోనికి వెళ్ళి వచ్చిన రెండు క్షణాలకి బెల్లు మోగింది. అటెండరు వెనకాలే కంట్రాక్టరు దారి తీశాడు.

అటెండర్ మళ్ళా వచ్చి స్టూలుమీద కూర్చున్నాడు. ఎవరెవరో వచ్చి మేనేజింగ్ డిరెక్టర్ని కలుసుకుని వెళ్ళేరు. అటెండర్ జేబు తడుముకున్నాడు. పరవాలేదనిపించింది.

కూతురి పెళ్ళి కుదిరింది. నెల రోజులకి అట్టి ముహూర్తం అమిరింది. అడ్వాన్సు గురించి తాను కంపెనీకి దరఖాస్తు పెట్టుకుంటే ఆ కాగితం యింకా క్లర్కు దగ్గరే మగ్గుతోంది. మామూలు ఇచ్చేస్తే పోయె' అనుకున్నాడు అటెండర్.

తన డ్యూటీ ఓ పావుగంట మరొకడికి అప్పజెప్పి అస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌కి అటెండరు కదిలాడు. మామూలు ముట్టజెప్పి క్లర్కు దగ్గర తన పర్సనల్ ఫైల్ తీసుకొని సూటిగా వెళ్ళి సూటుబూటుతో టిప్‌టాప్‌గా వున్న మేనేజింగ్ డిరెక్టర్‌కి పుటప్ చేశాడు, మేరేజి అడ్వాన్సు ఆ రోజే అందే తీరుతుందనే ధీమాతో.

ఇంటికి వెళ్ళాక ఎస్టాబ్లిష్‌మెంట్ క్లర్కు ఆ రోజు దొరికిన మామూళ్ళతో కలిపి మొత్తం లెక్క చూసుకున్నాడు. ఇంకా జాప్యంచేస్తే తన ప్రమోషను ఇంకొకడు కొట్టేసే అవకాశం వుందని వూహించి చీకటిపడ్డ తరవాత మేనేజింగ్ డిరెక్టర్ బంగళాకి వెళ్ళేడు కాళ్ళీడ్చుకుంటూ. బాస్ గుడ్ మూడ్స్‌లో ఉండటం చూచి సంతోషంతో తన సంగతి విన్నవించుకున్నాడు. చేతిలో కవరు ముందుంచి ఖాళీ చేతులు జోడించి తిరిగి వచ్చాడు, తన సీనియారిటీకి తోడు లంచం పెట్టినందుకు వెళ్ళిన పని ఖాయం అనుకుంటూ.

ఎలక్షన్లు దగ్గరపడడంతో. ఎన్నో ఖద్దరు పంచెలు, లాల్చీలు పార్టీ టిక్కట్ల గురించి ఎగబ్రాకుతుండే పార్టీ లీడర్లు విరాళాల గురించి గాలిస్తున్నారు.

ఆ తరుణంలో సదరు కంపెనీ మేనేజింగ్ డిరెక్టర్ తన అభిమాన పార్టీకి ఉదతా భక్తితో సాహాయం చేశాడు మున్ముందు లభించే కంపెనీ లాభాల గురించి, అందులోనూ సొంత లాభం గురించి పథకాలు వేస్తూ.

ఎన్నికల ప్రచారం తొలిమైకు మోగింది.

సింగిశెట్టి సంజీవరావు








# దిగ్రాండ్ కాన్యన్

దేశెట్టి కేశవరావ్

రాత్రి పదిగంటలయింది. నిద్రరాక మంచం మీద దొర్లుతున్నాను.

తలుపు చప్పుడయ్యింది.

ఇవాళప్పుడు నా కోసం వచ్చేవాళ్ళెవరూ లేరు, ఒక ప్రసాద్ తప్ప. వాడికి అర్జంటుగా డబ్బుతో అవసరం పడుతూంటుంది. ఆ అవసరానికి వేళాపాళా వుండదు. అర్ధరాత్రి, అపరాత్రి కూడా డబ్బుకోసం వచ్చిన సంఘటనలెన్నో వున్నాయి.

మళ్ళీ తలుపు చప్పుడు. లేవ బుద్ధికాలేదు. పక్కన పడివున్న హెరాల్డు రాబిన్సు తాకితేనే వొళ్ళు తిమ్మిరెక్కుతోంది. నైట్‌లాంపు వెలుతుర్లో అట్టమీద సుందరి నవ్వు చూస్తోంటే వొంట్లోంచి ఆవిర్లు వస్తున్నాయి.

చీకటిలో తడబడుతూ లేచాను. మళ్ళీ తలుపు చప్పుడయింది వీణ్ణి వదిలించుకోవడం కష్టం. వాడికివ్వడానికి చిల్లరనోట్లెన్ని వున్నాయా అని ఆలోచిస్తూ లేచి స్విచ్చి వేశాను. వెళ్ళి తలుపు తీశాను.

గుప్పున సన్నజాజుల వాసన. గుడ్డి వెన్నెట్లో గుమ్మం ముందు నిలబడివుంది వెన్నెల కన్యలా ఆమె.

"నేనే! ఏమిటలా చూస్తావ్? అవతలకి జరుగు!" నన్ను తోసుకుంటూ లోపలికొచ్చింది. అదే హస్కీ వాయిస్. వొళ్ళు కంపరమెత్తుతుంది నాకు ఆ కంఠం వింటే కవ్విస్తున్నట్టుంటుంది ఆ కంఠంలో జీర.

గదినిండా యింటిమేట్ పరిమళాలు. సన్నజాజుల గుబాళింపు. క్రీం కలర్ నైలెక్స్ శారీలో, ముఖాన ఎల్లోకలర్ తిలకంతో చల్లని చంద్రరేఖ నేలని తాకినట్టుగా వుంది.

"వసంతా! నువ్వా!" ఆశ్చర్యంతో గొంతు పెగలకపోతే, ఎలాగో అనగలాను.

"అవును! నేనే! ఏమిటంత యిదయిపోతున్నావు? తలుపు గడియవేసి ఇలా వచ్చి కూర్చో!" సోఫామీద జారగిలబడి, కాళ్ళు సుతారంగా ఆడిస్తూ అంది. మంచంమీద కూచోమన్నట్టు చేత్తో చూపింది.

"ఈ సమయంలో! ఇంతరాత్రి!.... ఎవరూ చూశ్శేదు కదా!" తత్తరపాటులోంచి తేరుకోకుండానే, తలుపు గడియవేసి సోఫా దగ్గర కొచ్చి ఆందోళనగా అడిగాను.

రాబిన్సు పుస్తకం అందుకుని బొమ్మని చూసి, సోఫామీద గిరాటేస్తూ అంది: "వెధవ దేవదాసు డైలాగులు పలికించకు!! నాకు పరమ బోరుగా వుంటుంది!" అంది. సోఫా వెనక భాగంమీద రెండు పక్కలా చేతులు చాపి, కాళ్ళు తమాషాగా ఆడిస్తూ అంది.

అచేతనంగా మంచంమీద కూలబడిపోయి ఆమెనే చూస్తూ కూర్చున్నాను.

"కభీతన్ హోయియో మేతుమ్.... తుమ్ హోరీయాద్ ఆయెగీ...." ఎప్పటిదో పాట. హమ్మింగ్ చేస్తోంది. ఆమె హస్కీ వాయిస్‌కి సరిగా సరిపడే పాట. ఆ మాటే ఆమెతో చాలాసార్లు అన్నాను. ముబారక్ బేగం ఏమయిందో పాపం. సంగీత రసజ్ఞులకి తీరని తాపాన్ని వదలి మాయమైపోయింది.

"ఇక ఆ బుద్ధావతారాన్ని చాలించి ఏమన్నా కబుర్లు చెప్పు!" అంది. ఏమిటి యీమె అభిప్రాయం? ఈ పరిస్థితికి అర్థం ఏమిటి?

"ఈ సిచుయేషన్ షాకింగ్‌గా వుంది! కాస్త తేరుకోనీ!" అన్నాను.

"అందుకేనోయ్ అన్నాను. మగవాడన్న వాడు కాస్త విస్కీ తాగడం నేర్చుకోవాలి! అప్పుడిలాంటి షాక్‌లకి యిమ్యూన్ అయిపోతావు" అంది నవ్వుతూ. అందెలు రవళించినట్టు కీచూ బొంగురూ కలిపిన నవ్వు.

"నిన్ను చూస్తుంటే యింకా విస్కీ ఎందుకు?" అన్నాను.

"ఫరవాలేదే! పనికొస్తావు!" అంది. కాస్త ఆగి "ఎంత ఆఫీసరువయినా నీ మిడిల్‌క్లాస్ మొరాలిటీ పోలేదు సుమా!" అంది నవ్వుతూ.

"ఏం చేస్తాం! మనం పెరిగింది అలాగ. ఈ ప్రూడరీ మన నరనరాల్లో జీర్ణించుకుపోయింది!" అన్నాను.

ఆమె నవ్వింది. "నువ్వు లేపాక్షి చూశావా?" అనడిగింది వున్నట్టుండి.

"ఊఁ!" అన్నాను.

"అదీ నీలాంటి భగ్నప్రేమికుడే శిల్పించివుంటాడు. అందుకే పూర్తి చెయ్యలేకపోయాడు!" అంది.

"అదికాదు!" అనబోయాను. ఆ శిల్పం అసంపూర్తిగా వుండడానికి కారణమేమిటో నేను చెప్పగలను. నేను చెప్పబోయేది సత్యం కావచ్చేమో! ఆమె చెప్పింది మాత్రం కవిత్వం!

ఆమె లేచి నిలబడింది. "నువ్వు మాత్రం విచిత్రమైన ప్రేమికుడివి! అవకాశం వుపయోగించుకోవడం తెలీని అమాయకుడివి!" డ్రస్సింగ్ టేబిల్ వద్దకి వెళ్ళి, అద్దంలో ప్రతిబింబాన్ని చూసుకుంటూ అన్నది.

---

## రచయిత గురించి

చదివింది ఎం.ఏ. బి. యిడి. ఉద్యోగం అనంతపురం జిల్లా హిందూపూర్‌లో. యింతకు ముందు చేసినవన్నీ హాస్య రచనలే. సీరియస్‌గా రాసిన తొలి కథ యిదే. దీనికి 'జ్యోతి' ప్రత్యేక బహుమతి లభించడం సంతోషకరంగా వుంది. ఫోటో పత్రికలో ప్రచురించడం యిష్టంలేదు.

---

అకస్మాత్తుగా సీరియస్‌గా అయిపోయి, "వెధవ ప్రూడరీ! మనుషుల్ని తినేస్తుంది. బ్రతుకుల్లో ఆనందమూ, వికాసమూ లేకుండా అడ్డుపడుతుంది. మురికీ, కాలుష్యమూ, రోగమూ, మర్యాదా, నియమాలూ, కుళ్ళిన కంపుకొట్టే నీతీ-యివేనా బ్రతుక్కి అర్థం?" అంది.

"అంతేనేమిటి? యింకా యెంతో వుంది!" అన్నాను. బ్రతుకులో ఆనందం వుంది, ప్రేమ వుంది, త్యాగముంది, కలలున్నాయి, తృప్తి వుంది, మల్లెపూలున్నాయి, వెన్నెల వుంది, చెప్పాలనుకున్నాను చెప్పలేకపోయాను. గొంతుముడి విచ్చుకోలేక పెనుగులాడుతోంది.

"ఊఁ! చెప్పు!" అంది.

"చెప్పాలంటే చాలా వుంది," అన్నాను.


అవకాశం! వుపయోగించుకోవడం. దేన్ని గురించి ఆవిడ అంటున్నది?

ర ర ర

అప్పుడు నేను టెన్త్‌క్లాసు చదువుతున్నాను. వసంతావాళ్ళు మా యింటి మేడమీద వాటాలో అద్దెకుండేవాళ్ళు. సాయంత్రమయితే మా యింట్లోని గదిలోనే కుర్రాళ్ళమందరమూ చదువుకోడానికి చేరేవాళ్ళం. మా కుటుంబాలు రెండూ కలివిడిగా వుండేవి.

ఆ రోజు వర్షం తుంపరగా పడుతోంది. గదిలో కూర్చొని లైటు వేసుకుని లెక్కలతో కుస్తీ పడుతున్నాను. వసంత వచ్చింది. ఆమె వెంట ఇద్దరు తమ్ముళ్ళూ వచ్చారు. వాళ్ళిద్దరూ అయిదూ నాలుగూ క్లాసులు చదువుతున్నారు.





"వెళ్దామా?" అన్నాను.

చుట్టూ చూసి మాట్లాడకుండా నీళ్ళలోంచి లేచి వచ్చింది నిట్టూరుస్తూ.

దైవదర్శనం ఆయాక ఆడవాళ్ళంతా వంటకి దిగారు. మగాళ్ళు వంటకి చితుకులు పోగుచేసి—అదయాక పిచ్చాపాటిలోకి దిగారు. కొందరు పేకాటలో కూర్చున్నారు. కుర్రకారు మామిడిపళ్ళకోసం దూరంగావున్న తోటల్లోకి పరిగెత్తారు. నేను ఏమీ తోచక దూరంగావున్న తోటలో కొమ్మన పండిన పళ్ళేవేనా దొరుకుతాయేమోనని వెళ్ళాను. వెళ్తోంటే, పట్టుచీర గరగరలతో నాతో కావాలనే దోబూచులాడుతున్నట్టు, సత్రం బయటికి వస్తూ లోపలకి వెళ్తూ బిజీగా తిరుగుతున్న వసంతని చూశాను. అలా ఆమెని గమనిస్తూనే ముందుకి నడిచాను. అరమైలు దూరంగా వున్న మామిడితోపుకేసి వెళ్ళాను.

"మరీ అంత ఎక్కువ తినకు! జలుబు చేస్తుంది!" చెట్టుకింద నించి వసంత మాటలు వినబడ్డాయి.

కొమ్మల ఆకులు పక్కకితీసి, చెట్టుమీది నించి కిందకి చూశాను. "నేను నీకు కనబడుతున్నానా?" అడిగాను.

"ఓ కనబడకేం?" కళ్ళు గుండ్రంగా తిప్పుతూ అంది.

నైలాన్ పట్టుచీర. ముదురు నీలం బ్లవుజు. నుదుట ఎర్రని తిలకం. మామూలు కంటే పొడగరే! కాని చెట్టుమీద నించి చూస్తే పొట్టిగా అవుపిస్తోంది. ఆకాశాన్నీ, సూర్యకాంతినీ పువ్వుల మెత్తదనంతో కలిపి రంగరించినట్టుగా వుంది. మెత్తని పచ్చిక సుకుమారమైన ఆమె కాళ్ళ కింద నలుగుతోంది.

"ఓహ్; టిపైన్‌గా వున్నావు!! తింటావా?" ఒక కాయని విసిరేస్తూ అన్నాడు.

"ఇక దిగు! నాకు కావలిస్తే నేనే రాళ్ళు విసిరి కాయలు కొట్టుకుంటాన్లే! నువ్వేం ఇవ్వనక్కర్లా!" అంది వంగి కాయ తీసుకుంటూ. నవ్వాను.

చెట్టు దిగుతోంటే "ఏమంత ఎత్తుంది?

కొమ్మ పట్టుకుని కిందికి దూకలేవూ?" అడిగింది.

"అయ్య బాబోయ్! నావల్లకాదు! కిందికి పడతానేమోనని భయం!....అగాధాల్ని చూస్తే జడుసుకుంటాను. అదో ఫోబియా నాకు!" అన్నాను చెట్టు దిగుతూ.

"అదో, ఆ పండు దొరగా వుంది. ర్రాయి అందివ్వు, దాన్ని పడగొడ్తాను!" అంది చెట్టు మీదికి చూస్తూ.

తెల్లకొంగలు ఆకాశంలో ఎగురుతున్నాయి. దూరంగా ప్రవహిస్తున్న పంట కాలవలో నీళ్లు ఎండలో మిలమిలా మెరుస్తున్నాయి. చెట్ల గుబురుల్లోంచి అరమైలు దూరంలో రథం గోపురం కనిపిస్తోంది.

చిన్న రాయినితీసి అందించాను. గిలిగింతలు పెట్టినట్టు నా చేతిని తాకుతూ రాయిని తీసుకుంది. రాయి విసిరింది, పండు పడలేదు.

"నేనిచ్చిన పండు తిను! బాగానే వుందిగా. వెళ్దాం పద! వంటలేమైనా అయ్యాయేమో! ఈ చెట్లలోంచి నడిచి వెళ్ళడానికి పావుగంట అవుతుంది" అన్నాను. మౌనంగా అనుసరించింది నేను ముందు నడుస్తుంటే.

"ఆడవాళ్ళమీద వుట్టినే స్కాండల్స్ చెబుతారు," అంది వెనక నడుస్తూ.

"ఎవరి గురించి అంటున్నావూ?" అడిగాడు.

"అఁహ! వుట్టినే అంటున్నాను. ఎంతో ఫ్రీడమ్, అవకాశాలు వుండి కూడా మగాడు చెడిపోవడంలేదు. అలాంటిది ఆడదెలా చెడుతుంది—యిన్ని కట్టుబాట్లూ, యిన్ని బాధలూ వుండి?"

"పొరబాటు! మొదటిసారి చెడడమే కష్టం. తర్వాత రాతిని కొండకిందికి దొర్లించినట్టే! దానికి ఆడా, మగా అన్నభేదం వుంటుందనుకోను!" అన్నాను.

"బాబోయ్!" అని అరిచింది బాధగా కొంత దూరం నడిచాక.

"ఏమిటి? ఏమయింది?" ఆందోళనగా వెనక్కి తిరిగి చూశాను.

"ఆ ఆకుల్లోంచి పాము కనబడింది!" భయంగా వెనక్కి వెళ్తూ అంది. ఆగి నేనూ చూశాను. తళతళా మెరుస్తూ నేలబడ్డ యెండుటాకుల్లోంచి జరజరా ప్రాకుతూ వెళ్తోంది పాము. త్రాచులాగే వుంది. భయంకరమైన ఆ అందాన్ని చూస్తూ నిలబడ్డాను.

"అబ్బా!" అని మూలిగింది.

మళ్ళీ తనవేపు తిరిగాను. "ఏమయింది!"

"ముల్లు!" అని అరిచింది కూలబడుతూ.

బొటన వేలికి ముల్లు గుచ్చుకుంది. లావుపాటి ముల్లు. లాగేశాను. రక్తం జివ్వున చిమ్మింది. ఎడమచేత్తో నొక్కిపట్టాను. రక్తం కట్టలేదు.

"ఉండు! చన్నీళ్ళు తెస్తాను!" కోనేటి దగ్గరికి వెళ్ళడానికి బయల్దేరాను.

"నే ఉండను! నాకు భయం! పాములున్నాయిక్కడ!" నేను పరుగెత్తుతోంటే వెనకనించి వినబడ్డాయి ఆమె మాటలు. "ఫర్లేదు! ఇప్పుడే వచ్చేస్తాను!" గాలిలో చెయ్యి ఊపుతూ కోనేటి దగ్గరకి పరిగెత్తాను. హాండ్‌కర్చీఫ్‌ని నీళ్ళలో ముంచి తెచ్చను.

తిరిగి వచ్చేసరికి అలా గడ్డిమీదే కూర్చుని వుంది. బొటన వేలిని పిండుతూ వుంది. రక్తం బొట్లుబొట్లుగా వస్తూంది. "ఎందుకలా గాయాన్ని పిండుతున్నావ్?" కసురుకున్నాను. "వూరుకుంటే రక్తం ఈపాటికి గడ్డకట్టి ఆగిపోయేది!" అన్నాను.

తలెత్తి నన్ను చూసి నవ్వింది. నేను వంగి కాలు పట్టుకోబోతోంటే విసురుగా కాలు పక్కకి తీసింది. రక్తపుబొట్లు ఒకటి, రెండు చీరమీద పడ్డాయి.

"కదలకు! చూడు, చీరమీద మరకలయ్యాయి!" అన్నాను.


"ఆ హాండ్ కర్చీఫ్ యిలాతే! నేను వేలికి చుట్టుకుంటాను!" అంది.

"అదేం?" అన్నాను ఆశ్చర్యపోతూ.

"నువ్వేమో ముట్టుకుంటే కందిపోతానన్నట్టు ప్రవర్తిస్తున్నావ్. ఇంక ఈ రక్తం ఏం కట్టుతుందీ?" అంది.

రెండుచుక్కల చన్నీళ్ళు గాయంమీద






పిండి, హాండ్‌కర్చీఫ్‌ని అవిడకే యిచ్చాను. "పోనీ నువ్వే చుట్టుకో వేలికి!" అన్నాను.

కాసేపయ్యాక "ఇక వెళ్దామా?" అనడిగాను. చీరమీద రక్తపు మరకల్ని తడిగుడ్డతో తుడుస్తూ "పద!" అంది.

"ఈ కర్చీఫ్ మీ మేనకోడలిదిలా వుంది!" అంది. పసుపు పచ్చని సిల్కు హాండ్‌కర్చీఫ్ అది. అంచులు ఎర్రదారంతో హెమ్మింగ్ చేయబడి వున్నాయి. ఒక మూలన యెర్ర దారంతో 'యస్' అన్న అక్షరం ముద్ద కుట్టు కుట్టి వుంది?

"ఆఁ! అది యిచ్చిందే. సరూకి నేనంటే అదోరకం వెర్రి!" అన్నాను.

"నువ్వు సింహానివోయ్!" అంది నా పక్కనే నడుస్తూ.

"ఇంకా నయం! నక్కని అన్నావుగాదు!" అన్నాను నవ్వుతూ.

"సింహాలు వేటాడకుండా కళ్ళు మూసుకుని కూచుని వుంటాయిట. ఇది ఏమీ చెయ్యదులే అని జంతువులు ధైర్యంగా దగ్గరికి వస్తే చటుక్కున వాటిని పట్టుకుని తినేస్తాయట!!" అంది.

"ఇండియాలో సింహాలు అంతేలే! వాటి కూడా మనలాగే బద్ధకం యెక్కువ!" అన్నాను.

ఆమె నవ్వింది. పళ్ళు తళుక్కుమన్నాయి. కళ్ళు నీటిపొరతో నిండి సౌజన్యమేఘాలలాగా సూర్యరశ్మితో మిలమిలా మెరిశాయి. "ఎంత మంచి సింహమైనా, నిర్భయంగా జంతువులు దగ్గరకి వస్తాయేతప్ప, నన్ను తినే సెయ్యి అని నోట్లో పడవు తెలుసా!?" అంది.

"స్వామిభక్తి ఎక్కువ మోతాదులో వుంటే అలా చేసినా చెయ్యొచ్చు!" అన్నాను.

"ఆ మాత్రమైనా వేటాడకపోతే అది సింహమే అనిపించుకోదు!" అంది.

"అంతేమరి!" అన్నాను.

అయిదేళ్ళయింది. ఈ మధ్యకాలంలో డిగ్రీ తీసికుని యూనివర్శిటీ వదలి వచ్చేశాను. ఏదో వున్నంతలో మంచి ఉద్యోగమే వచ్చింది.

యూనివర్శిటీలో వుండగా నాలుగైదుసార్లు వసంత వుత్తరం రాసింది. ఏదో మామూలు కబుర్లు. ఉత్తరం చివర్లో "మై డియర్ సూర్యం

XXX" అని రాసేది. ఒకసారిమాత్రం "నేను XXX అని రాస్తే జవాబు రాయవేం?" అని రాసింది. "Xకి జవాబు Yయా?" అని రాశాను నేను. మళ్ళీ ఉత్తరాలు రాయలేదు వసంత. ఉద్యోగంలో చేరిన కొత్తలో పెళ్ళి పత్రిక అందింది. వెళ్ళడానికి వీలులేక గ్రీటింగ్స్ టెలిగ్రాం పంపించాను.

కొన్నాళ్ళయాక నా పెళ్ళి సర్దాతో జరిగిపోయింది. హనీమూన్‌కి వెళ్ళిరావడమూ, బంధువుల ఇళ్ళన్నీ చుట్టబెట్టడమూ అంతా రెండు నెలలయింది. మళ్ళీ వచ్చి డ్యూటీలో చేరాను. నెల్లాళ్ళు వెతికాక నాకు నచ్చిన ఇల్లు దొరికింది. వెంటనే సరోజని పిలుచుకొచ్చేశాను. అత్తయ్య మాతో వచ్చి రెండు నెలలుండి వెళ్ళిపోయింది.

ఆరునెలలు పైగానే గడిచిపోయాయి. సరూకి గృహిణిగా తన బాధ్యతలేమిటో అప్పుడప్పుడే అర్థమవుతున్నాయి. నాకూ యింటి యజమాని బాధ్యత కొత్త కొత్తగా, బెరుకు బెరుగ్గా వుంది. వసంత వస్తున్నానని వుత్తరం రాసింది. కళ్ళడాక్టరు దగ్గరకెళ్ళి కళ్ళు పరీక్ష చేయించుకుని వచ్చాక అందింది ఆ ఉత్తరం. నాకు చిన్నప్పటి నుంచీ వుంది దృష్టిదోషం. ఒక యాంగిల్‌లో సరిగా కనబడదు. ఆస్టిగ్మాటిజమ్ అన్నాడు డాక్టరు. ఏవో మందు లిచ్చాడు. కళ్ళజోడు వాడాలన్నాడు. ఉత్తరం చదివి సరూకి అందించాను చదవమని.

స్టేషన్‌కి వెళ్ళి రిసీవ్ చేసుకున్నాం. "నువ్వు ఇన్వైట్ చెయ్యకపోయినా మిమ్మల్ని చూడ్డానికి వచ్చాను" అంది వసంత. "ఇన్వైట్ చేస్తే వచ్చేవాళ్ళు బంధువులు. మిత్రులకి అలాంటి అడ్డంకులు లేవు. ఎప్పుడన్నా నిరభ్యంతరంగా రావొచ్చు!" అన్నాను. నా మాటల్ని బలపరుస్తున్నట్టుగా నవ్వింది సరూ. ఇంతకీ ఈవిడ యింతదూరం ఎందుకొచ్చింది? మమ్మల్ని చూడ్డానికేనా? చూసి సంతోషించడానికా, అసూయపడడానికా? నాకు అంతుపట్టలేదు.

"కళ్ళజోడు ఎప్పట్నించీ వాడుతున్నావ్?" అనడిగింది.

"ఈ మధ్యనే డిఫెక్ట్ ఎక్కువైంది. డాక్టరు వాడమన్నాడు" అన్నాను.

రెండో రోజులయింది వసంత వచ్చి. ఆ సాయంత్రం ఇంటికొచ్చేటప్పటికి సరూకి బాగా జ్వరం వచ్చింది. పనితో అలిసిపోయివున్న నేను, "ఉదయానే డాక్టరు దగ్గరికి తీసికెళ్ళాంలే!" అనుకున్నాను. సరూ బాగా దగ్గిదగ్గి, హై టెంపరేచర్‌తో వొళ్ళు తెలియనట్టు పడిపోయింది. ఫరవాలేదు, ఉదయానికి జ్వరం తగ్గిపోతుంది అనుకున్నాను.

వసంతే నాకు అన్నం వడ్డించింది. కొసరి, కొసరి దగ్గరుండి అన్నం వడ్డిస్తూంటే తృప్తిగా తిన్నాను. తల్లి కొడుక్కి అన్నం తినిపించినంత ప్రేమగా వడ్డించింది. మిసిమి చాయ వొంటిమీద రెండు సన్నని బంగారు గాజులు. మధ్య నీలం గాజులు. ఎంతో అందంగా నప్పాయి. గోళ్ళకి నెయిల్ పాలిష్....సన్నని పొడుగాటి చేతులు. సుకుమారమైన వేళ్ళు. "వసంతని పెళ్ళిచేసుకుని వుంటే బావుండునేమో!" ననిపించింది నాకు మొదటిసారిగా.

"తాగడం గట్రా నీకు అలవాటు లేదల్లే వుంది!" అంది వసంత.

"అబ్బే! నాకు బొత్తిగా గిట్టదు!" అన్నాను.

"మా ఆయనే నయం! నీ అంత పెద్ద వుద్యోగం చెయ్యకపోయినా, ఎలాగో పార్టీలంటూ వారానికోసారన్నా పూటుగా తాగుతారు" అని నవ్వింది. కళ్ళలో నీటిపొర జాలిగా మెరిసింది.


వాళ్ళాయన ఏదో ఆఫీసరు. జీతం తక్కువైనా బాగనే గడిస్తాట. వాళ్ళు కొన్న ఫర్నిచరూ, వాళ్ళకున్న ప్యూన్లూ, దర్జా అంతా చెప్పింది.

"నువ్వేం యిలాగున్నావు?" అనడిగింది

"ఇలాగేమిటి? ఈ ఉద్యోగం యింతే! మాకు గడింపు అంటూ వుండదు. ఉన్నదాంట్లో సరుకోవాలి!" అన్నాను భోజనం దగ్గర్నించి లేస్తూ. వార్తలు విని, గదిలోకెళ్ళి పడుకున్నాను.








రాత్రంతా సరూకి ఏవో సపర్యలు చేస్తూనే వుంది వసంత. నేను నిద్రమత్తులో పట్టించుకోలేదు. నా గదిలోకి కూడా రెండు మూడుసార్లు వచ్చినట్టు గుర్తు. ఎలక్ట్రిక్ స్టవ్ నా గదిలోనే వుంది. నీళ్ళు కాచుతోంది కాబోలు. స్విచ్చి వేసినప్పుడంతా మెలకువ వచ్చేది. మళ్ళీ నిద్ర పట్టేసేది ఆ క్షణంలోనే.

ఉదయానే నిద్రలేపింది. "ఏమిటా మొద్దు నిద్ర! పెళ్ళానికి అలా వుంటే. లేచి డాక్టరు దగ్గరికి తీసికెళ్ళు!" అంది. స్నానం చేసినట్టుంది. తడితడిగా వున్న వెంట్రుకలు వదులుగా ముడివేసుకుంది. కడిగిన ముత్యంలా స్వచ్ఛంగా వుంది ఒకే ఒక్క క్షణం ప్రలోభంలో పడిపోయాను. చేతులు చాచబోయాను. భయంకరమైన ఆ స్వచ్ఛత ఛెళ్లున చెంపపెట్టు పెట్టినట్టనిపించింది. బద్ధకంగా లేచాను, ఆవులిస్తూ.

డాక్టరు దగ్గర్నుంచి వచ్చేసరికి టిఫిన్ చేసి రడీగా వుంచింది. "డాక్టరేమన్నాడు?". అనడిగింది. చెప్పాను. సరూని తీసికెళ్ళి పడుకోబెట్టింది. నేను టిఫిన్ ముగించు వచ్చేసరికి "గ్రాండ్ కాన్యన్" ఫొటోని చూస్తూ నిలబడింది. ఆఫీసుకు వెళ్ళడానికి బట్టలు వేసుకుంటుంటే "దీన్ని ఫోటో కట్టించావేం?" అని అడిగింది.

స్పాన్‌లో పడిన చిత్రం. బావుందని ఫోటో కట్టించాను "అందంగా లేదూ!" అన్నాను.

"అగాధాలంటే భయం అన్నావు కదా!" అనడిగింది.

ఎప్పటిదో ఆ మాట. నాకు జ్ఞాపకం కూడా లేదు. ఆవిడ అంటోంటే ఆ మాటలు నావేనని లీలగా గుర్తుకొచ్చింది. "అయినా అది ఎంతో అట్రాక్టివ్‌గా వుంద కదూ!" మాట మార్చి అన్నాను.

"నేను ఉత్తరాల్లో XXX అని రాస్తే జవాబివ్వలేదేం?" అనడిగింది

అతిప్రయత్నం మీద యూనిర్శిటీ రోజులు గుర్తుకు తెచ్చుకున్నాను. "X అంటే ఏమిటి? నాకు తెలియలేదు!" అన్నాడు.

"ఓరి వెర్రినాయనా! X అంటే తెలియదా! సెక్సులో చివరి అక్షరం. సెక్సు అదుంటేగాని పూర్తి కాదు!" అని నవ్వింది.

నేనూ నవ్వేశాను. "ఔను. నాకు తట్టనే లేదు సుమా! నేను అంత డీప్‌గా ఆలోచించ లేను. పైపైనే వూహించగలను. చెప్పానుగా. అగాధాలన్నా, అగాధంవంటి ఆలోచనలన్నా నాకు భయం!" అన్నాను.

రెండు రోజులు పోయాక వెళ్ళాలంటూ వసంత బయలుదేరింది. సరూకి యింకా నీరసం తగ్గలా. "సర్దాగా వచ్చారు కానీ, నావల్ల మీకు యిక్కడ చాకిరీ తప్పలేదు" అంది సరూ, వసంతతో.

"అలా అనుకునేదాన్నయితే, ఇక్కడికి వచ్చివుండేదాన్నే కాదు" అంది వసంత.

నీరసంగా వున్నా సరూ వసంతకి అన్ని మర్యాదలూ చేసి సాగనంపింది.

* * *

ఇది మూడేళ్ళ క్రిందటి మాట.

రెండు నెలల క్రిందట సరూ వాళ్ళ నాన్న గారికి బాగులేదని చూడ్డానికి వాళ్ళ వూరెళ్ళింది. ఆమె తిరిగ రావడానికి ఇంకా కొన్నాళ్ళు పడుతుంది. ఆఫీసు ఫ్యాన్‌తో కారియర్ తెప్పించుకుంటూ, రాబిన్సులాంటి వేడి పుస్తకాలు నంజుకుంటూ రోజులు వెళ్ళమారుస్తున్నాను.

వసంతా వాళ్ళకి యీలోగా యిక్కడికే ట్రాన్స్‌ఫర్ అయింది. ఫర్లాంగు దూరంలో. రెండువీధుల అవతల ఇల్లు తీసుకున్నారు. సరూ లేదని వసంత చాలా నొచ్చుకుంది. సరూ లేకపోయినా, వాళ్ళందరికీ స్వాగతం చెప్పినట్టుగా వుంటుందని హోటల్ సవేరాలో వాళ్ళకి డిన్నరిచ్చాను. సరూ వచ్చాక మరో మంచి డిన్నర్ ఏర్పాటు చేస్తానని కూడా ప్రామిస్ చేశాను.

"అబ్బ! ఇంత పెద్ద హోటల్ని గురించి పుస్తకాల్లో చదివానేమోగానీ, కలలోనైనా చూళ్ళేదు సుమా! అంది వసంత.

"నిజానికిలాంటి హోటల్ బెంగుళూరులో వుండవలసింది!" అన్నాడు మూర్తి, వసంత భర్త.

నేను ఆర్డరు చేసిన విచిత్రమైన డిషెస్ అన్నీ తన ఇద్దరు పిల్లలలాగానే ఉత్సాహంగా ఆనందంగా తిన్నది.

"అమ్మయ్య! బిల్లు భలేబరువుగా వుంటుందనుకుంటా నీకు! పొట్టలే యింత బరువైపోతేనూ!" అంది.

వారం రోజుల తర్వాత, ఈరాత్రి ఇక్కడ వసంత!

అవకాశం అంటోంది, ఉపయోగించుకోవడం అంటోంది. ఏమిటో ఆవిడ ధోరణి. నాకంతు బట్టలా.

"చూడు! గడ్డిపోచమీద నిల్చిన మంచు బిందువులో కలల ఇంద్రధనుస్సులు విరుస్తాయి. తాకితే ఆ ప్రపంచమే విధ్వంసమైపోతుంది. నేను సౌందర్యాన్ని ఆరాధిస్తానని నీకు తెలుసు కదా!" అన్నాను.

వసంత మాట్లాడలేదు. "అవకాశాలకేం? కల్పించుకుంటే బోలెడు దొరుకుతాయి. ముఖ్యమైన అవకాశాన్ని ఎప్పుడో పోగొట్టుకున్నను తెలిసో, తెలియకో! అందుకు యిప్పుడు బాధ ఎందుకు?" అన్నాను.

కాసేపు నిశ్శబ్దం అవహించింది. "సూర్యం! నాకు అర్థమైంది! నువ్వు ప్రిగ్గిష్ ఫూల్‌వి! సరూ యెలా చేస్తోందో నీవంటి వాడితో సంసారం ... వస్తాను! కుర్రాళ్ళు నిద్ర లేస్తారేమో! ఆయన కేంపు కెళ్ళారు!"

చివాల్న తలుపు తెరుచుకుని వెళ్ళిపోయింది. నేను ఒంటరిగా మిగిలిపోయాను, రాజ్యాన్ని పోగొట్టుకున్న చక్రవర్తిలా.

వసంత! అందం, చైల్డిష్‌నెస్, స్త్రీత్వం, అసూయ, లాలిత్యం, డేరింగ్, కవిత్వం, జనరాసిటీ, తెలివి, చురుకుదనమూ—ఓహ్! ఎన్నో చెప్పలేను. అన్నీ తలబోసిన మిశ్రమం. ఆమె నాకు అర్థం అవుతుందా?

గ్రాండ్ కాన్యన్ ఫోటో చూస్తున్నాను. అట్రాక్టివ్‌గా వుంది. భయంకరంగానూ వుంది. ఇదొక లవ్-హేట్ రిలేషన్‌షిప్! అంతేనేమో!



# మరుభూమి

కళింకోట ప్రభాకరదేవ్

పవిత్రులు అపవిత్రులు, ధనవంతులు, దరిద్రులు, పెద్దలు, పిన్నలు అనే తారతమ్యం లేకుండా చివరకక్కడ అందరూ మట్టిలో కలిసిపోవల్సిందే. మనిషి జీవనయాత్ర కది చివరి మజిలీ. విభిన్న జీవితాలపాలిట సమవర్తి! సమదర్శి!!

శవం కాలుతున్న వాసన—

ఎండిన జమ్మిచెట్టుమీద తీతువుపిట్ట కూర్చుని మనిషి అంతిమస్థానానికి నేపథ్య గీతం ఆలపిస్తున్నట్టుగా అరుస్తుంది.

చితి రగుల్కొంటుంది....

'జీవి' ఊర్ధ్వలోకానికి పయనిస్తున్నాడేమో నన్న భ్రమను స్ఫురింపచేస్తూ....చితిమంటలు మింటికెగస్తున్నాయి.

చితిలోకి మండుతున్న కట్టెల్ని యాంత్రికంగా నిర్లిప్తంగా ఎంకడు ఎగదోస్తున్నాడు.

ఎంకడు కాటికాపరి.

నలభై సంవత్సరాల వయస్సుంటుంది. నల్లగా, సన్నగా....మాడిపోతున్న శవంలాగ వుంటాడు. వాణ్ని చూడగానే "పాపం వీడు తిండితిని ఎన్ని వారాలయివుంటుందో!" అనే జాలి కలుగుతుంది.

మొలకు, గాంధీ కట్టుకునే గావంచా లాంటిది మినహా వాడి వొంటిమీద మరే ఆచ్ఛాదనా వుండదు.

స్మశానాన్ని నమ్ముకుని బ్రతుకుతున్నాడు. ఇంతవరకూ వాడు తగులబెట్టిన శవాలు వేల సంఖ్యలో వుంటాయి. భయాన్ని, దుఃఖాన్ని కలిగించే శవాలు ఎంకడికి ఆనందాన్ని కలిగిస్తాయి. శవం స్మశానానికి వచ్చిందంటే, వారాల తరబడి వస్తున్న కుక్కకు ఎండురొట్టె దొరికినంతగా సంబరపడిపోతాడు ఎంకడు.

స్మశానమే వాడి లోకం—

ఆ లోకంలో అడపాదడపా ఆకలి కొంత చల్లారుతుంది. అదే పదివేలనుకుంటూ ఇన్నాళ్ళూ బ్రతికేశాడు. అయితే, ఈ మధ్య గత కొన్ని దినాలుగా వాడి మనసులో దిగులు మొదలయింది.

ఏదో వెలితి వాడి మనసును చికాకు బరుస్తూ వుంది. ఎంకడు తన గురించి ఎన్నడూ బాధ పడలేదు. ఆలోచించలేదు. ఇప్పుడూ అంతే. వాడి దిగులుకుగల కారణం 'ఈరిగాడు'.

ఈరిగాడు ఎంకడికి వొకేవొక బంధం. 'ఈరిగాడు' అంటే ఎంకడికి అందుకనే ప్రాణం. ఈ లోకంలో తనవారంటూ వున్నది 'ఈరిగాడు' మాత్రమేనన్న ఆపేక్షకొద్ది వాడ్ని కంటికి రెప్పలాగ చూసుకుంటూ వచ్చాడు.

'ఈరిగాడు' తల్లి పచ్చిబాలింతలోనే కన్ను మూసేసింది. ఆ శవాన్ని దహనం చేసింది కూడా ఎంకడే.

అయిదవ ఏట పిల్లలకు అక్షరాభ్యాసం చేయించినట్లుగా 'ఈరి'గాడికి అయిదవ సంవత్సరం రాగానే చితిలోకి కట్టెల్ని ఎగదొయ్యడం....శవాన్ని కాల్చడం మొదలైన వాటికి శ్రీకారం చుట్టించాడు ఎంకడు. అయితే, వయస్సొస్తున్నకొద్దీ ఈరిగాడికి తను చేస్తున్న పని నచ్చలేదు.

స్మశానికి కొద్ది దూరంలోగల బంజరు భూముల్లో పశువుల్ని మేపటానికి వచ్చే పిల్లల్ని చూసి, వాళ్ళలాగే తను కూడా ఎవరి పశువులన్నా కాపలాకాస్తే బాగుండుననుకున్నాడు.

స్మశానంలో చితుల్లోకి కట్టెల్ని ఎగదోసే పని కన్నా పశువుల్ని మేపడంలో ఏదో కొత్తదనం, ఆనందం వున్నట్టనిపించింది వాడికి. చివరకు, రెండువారాల క్రిందట తండ్రితో చెప్పి 'పెద్ద నాయుడు' దగ్గర పశువుల కాపరిగా చేరి పోయాడు ఈరిగాడు.

కొడుకు తన దగ్గర్నుంచి వెళ్ళిపోయిన దగ్గర్నుండీ, సర్వస్వాన్నీ కోల్పోయిన వ్యక్తి లాగ ఎంకడు తయారయ్యాడు. 'కొడుకు' లేని వెల్తి గుండెను పిండసాగింది.

"ఎర్రి ఎదవ! పెద్దనాయుడి దగ్గర్న ఎట్టాగ వున్నాడో....ఏటో!!"

పదేపదే కొడుకుని తలుచుకుంటూ కంట తడి పెట్టుకోసాగేడు ఎంకడు.

* * *

'పెదనాయుడు' పేరుకు తగినట్టుగా ఆ వూరికి పెద్ద. పంచాయితి ప్రెసిడెంటు.

పెద్దనాయుడిది భారీ విగ్రహం. మదించిన ఎద్దులాగ వుంటాడు.

అతడికి వూర్లో లంకంత యిల్లువుంది. ఆ లంకలో శూర్పణలాంటి పెళ్ళాం వుంది. ఊర్లోని లంకంత కొంపే కాకుండా పట్నంలో వొక పెదడాబా కూడా పెద్దనాయుడికి వుంది. దాంట్లో పెద్దనాయుడు పెర్మనెంటుగా వుంచు కున్న ముండ వుంది. దాన్దగ్గరే పెద్దనాయుడు పంచాయితీ ప్రెసిడెంటు పదవిని అడ్డం పెట్టు కుని సంపాదించినదంతా దాచిపెట్టాడని వూర్లో వాళ్ళు చెవులు కొరుక్కుంటుంటారు. ఆ మాట గట్టిగా పైకి అనే ధైర్యం ఆ వూర్లో వాళ్ళకు లేదు.

పశువుల్ని మేపడానికి ఈరిగాడు సరదా పడ్డాడేగాని, పెద్దనాయుడి దగ్గర పన్లోకి చేరిన తరువాత తెగభయపడిపోయాడు. అలవాటు లేని పనులతో అంతా అయోమయంగా వుండేది. దానికి తోడు అక్కడ అందరూ కొత్త. గుంపునుండి తప్పిపోయిన మేకపిల్ల లాగ తయారయింది వాడి పరిస్థితి. అయితే రాన్రానూ అక్కడి వాతావరణానికి అలవాటు పడసాగేడు.

ఈరిగాడు పేరుకి 'పశువుల కాపరి' గాని, పెద్దనాయుడు యింట్లో చాలా పనులు చేయాలి.

తెల్లవారక ముందే లేవాలి.

గొడ్లశాలను శుభ్రంచేసి, పశువులకు మేత పెట్టాలి.

నూతిలో నీళ్ళుతోడి, యింట్లో వాళ్ళకి స్నానంకి వేడినీరు సిద్ధంచెయ్యాలి.

ఆ తరువాత, బజారుపన్లు....

ఇవన్నీ జరిగాక, చద్దన్నం తిని గొడ్లను తోలుకుపోవాలి.

సంక్షిప్తంగా యిదీ ఈరిగాడి దినచర్య.

ఒళ్ళు దాచుకోకుండా పని చెయ్యడం వలన కొద్ది రోజుల్లోనే పెద్దనాయుడి అభి మానాన్ని కొంత ఈరిగాడు సంపాయించుకో గలిగాడు.

గొడ్డుల్లాగ పని చేసేవాళ్ళన్నా, కుక్కల్లాగ పడివుండే వాళ్ళన్నా పెద్దనాయుడికి యిష్టం.

వంట నూర్పిళ్ళ సమయమది—

మధ్యాహ్నం ఎద్దుల జతకు కుడుగుపెట్టి, కుప్పనూర్పిళ్ళకు పొలానికి తోలుకు వెళ్ళ బోతుంటే, మీనాక్షి ఈరిగాడ్ని పిలిచింది.

మీనాక్షి పెద్దనాయుడు ఏకైక కూతురు.

"పంతులు మాష్టారుగారి యిల్లు నీకు తెల్సా?" అని ప్రశ్నించింది.

ఈరిగాడు తెలుసునన్నట్లుగా తలాడిం చాడు.

మీనాక్షి అటూ ఇటూ చూసి, జాకెట్టులో నుండి మడతలు పెట్టిన గులాబిరంగు ఉత్త రాన్ని పైకి తీసింది.

"దీన్ని తీసుకువెళ్ళి పంతులు మాష్టారికి జాగ్రత్తగా యివ్వు. మరెవరికీ....ఈ సంగతి తెలియకూడదు" అన్జెప్పి, ఆ వుత్తరాన్ని, దాంతోపాటు పావలాను ఈరిగాడికి యిచ్చింది.

మీనాక్షికి ఇరవై సంవత్సరాల వయస్సుం టుంది. ఆ వయస్సు తెచ్చిన పొంగులతో పిటపిటలాడుతూ వుంటుంది.

ఇంకా, పెళ్ళికాలేదు.

కొత్తగా ఆ వూరికి వచ్చిన కుర్రపంతులు మాష్టార్ని ప్రేమించింది. అతడ్నే పెళ్ళాడాలని



నిశ్చయించుకుంది. ఆ నిశ్చయంతోనే తండ్రి తెచ్చిన పెళ్ళిసంబంధాన్ని కాదని, తన మనసు లోని మాటను ధయిర్యంగా చెప్పేసింది.

పెద్దనాయుడు దేన్నయినా భరించగాలడు గాని పేదోళ్ళను ప్రేమించడాన్ని మాత్రం ససేమిరా భరించలేడు.

కూతురి మనసు మార్చడానికి ప్రయత్నిం చాడు. లాభం లేకపోయింది. దాంతో కూతురు యిల్లు కదలనీయకుండా కట్టుదిట్టం గావించాడు.

ఈ తతంగమంతా కొత్తగా పన్లోకి చేరిన ఈరిగాడికి తెలియదు. మీనాక్షి యిచ్చిన వుత్త రాన్ని భద్రంగా ఇద్దరు బనీను జేబులో దాచు కొని - పావలాకాసును చేత్తోపట్టుకుని - హుషా రుగా బయలుదేరాడు.

ఈరిగాడు వెళ్ళేసరికి పంతులు మాష్టారు యింట్లో లేరు.

"సాయంత్రం తిరిగి యింటికివెళ్ళేటప్పుడు పంతులుగారికి యివ్వొచ్చులే" అనుకుని పొలంకి వెళ్ళిపోయాడు.

ధాన్యం ఎగురబోస్తున్న సమయంలో— పర్యవేక్షణ కొచ్చిన పెద్దనాయుడి దృష్టిలో ఈరిగాడి జేబునుండి సగం బైటకు తొంగి

చూస్తున్న గులాబిరంగు వుత్తరం పడింది.

పెద్దనాయుడి భృకుటి ముడివడింది.

కుతూహలం చెలరేగింది.

ఈరిగాడ్ని దగ్గరకు పిలిచి, వాడి జేబులో నున్న కవరును లాక్కున్నాడు పెద్దనాయుడు.

ఈ పరిణామానికి ఈరిగాడు బిక్కచచ్చిపోయాడు. గులాబిరంగు వుత్తరాన్ని చదువుకున్న పెద్దనాయుడి ముఖం మాడిపోయింది.

అతికష్టంమీద కోపాన్ని అణచుకుని గంభీరంగా తలపంకించాడు.

గులాబిరరగు వుత్తరాన్ని మడతబెట్టి ఈరిగాడికి యిచ్చేస్తూ—

"ఈ వుత్తరం చిన్నమ్మగారు మాష్టారుకి యివ్వమన్నారు కదూ....?" సాధ్యమైనంత సరళంగా అడిగారు.

అవునన్నట్లు తలాడించాడు ఈరిగాడు.

"సర్లే. వుత్తరాన్ని తీసుకువెళ్ళి, మాష్టారుకి యిచ్చేయి. అయితే, నేనీ వుత్తరాన్ని చదివినట్లుగా ఎవ్వరి దగ్గరా చెప్పకు. చెప్పావా మక్కలిరగ కొడ్తాను" కళ్ళెర్రజేసి, హెచ్చరించాడు పెద్దనాయుడు.

బాగా చీకటిపడేక పశువుల్ని తోలుకుంటూ యింటికి బయలుదేరాడు ఈరిగాడు.

దార్లోనే పంతులు మాష్టారు యిల్లు.

భయం భయంగా ఆ వుత్తరాన్ని మాష్టారుకి అందచేశాడు ఈరిగాడు.

§ § §

అర్ధరాత్రివేళ—

ఏదో పీడకలకు భయంతో వులిక్కిపడి కళ్ళు తెరిచాడు ఈరిగాడు.

అంతా చీకటి.

కీచురాళ్ళు చీకటి సన్నివేశానికి లయవేస్తున్నాయి....రొదగా.

పక్కగదిలోనుంచి చిన్నగా మాటలు....

చెవులు రిక్కించాడు ఈరిగాడు అప్రయత్నంగా.

"మన మీనాక్షి మాష్టారుతో లేచిపోవడానికి సిద్ధపడింది రాజ్యం! .... మాష్టారుకి వుత్తరం వ్రాసింది" పెద్దనాయుడి కంఠస్వరమది.

"అంతకు తెగించిందా?" ఆశ్చర్యపోయింది పెద్దనాయుడి భార్య రాజ్యం.

"ఊఁ .... మరింక మనం చేతులుకట్టుకు కూర్చుంటే లాభం లేదు రాజ్యం!....అందుకనే ఆ మాష్టారు పీడను వొదిలించుకుంటున్నాను. శాశ్వతంగా."

"అంటే?"

"మన మనుషుల్ని పంపి ఈ రాత్రికి మాష్టార్ని మక్కలిరగతన్నమన్నాను."

"తన్నినంత మాత్రాన....మనసు మారిపోతుందా?" భార్య అనుమానం.

"ఊహూఁ....మారదు....ఆ సంగతి నాకు తెలుసు. అందుకనే, వాడ్ని చితుగా తన్ని యింట్లోపడేసి...కొంపకు నిప్పుపెట్టమన్నాను."

మాటలు ఆగిపోయాయి.

ఈరిగాడికి వొళ్ళంతా చెమటపట్టేసింది. శరీరం వణకసాగింది.

"పంతులు మాష్టార్ను కాల్చి చంపేస్తారా? బ్రతికున్న మనిషినే....! బాబోయ్....!!"

మరింక అక్కడ వుండలేకపోయాడు.

ఎంకడి పాక శ్మశానాన్ని అనుకునే వుంది. అర్ధరాత్రివేళ - చెమటలు కక్కుతుంటూ పరిగెత్తుకు వచ్చిన కొడుకుని చూసి ఎంకడు ఆశ్చర్యపోయాడు.

"మరింక....నిన్నిడ్చి నా నెక్కడికీ ఎల్లన్రా అయ్యా! నీతోనే వుండిపోతా...." భయం భయంగా అన్నాడు. వాడి కళ్ళముందు మంటలు....ఆ మంటల్లో మాష్టారు యింకా కదుల్తానే వున్నారు.


"ఏం జరిగిందిరా?" ఎంకడు కొడుకుని దగ్గరకు తీసుకుంటూ అనునయంగా అడిగాడు.

"ఇక్కడ మనం సచ్చినోళ్ళనే కాలుత్తాం. అయ్యా! అక్కడ .... బ్రతికునోళ్ళనే కాల్చేత్తున్నారు...." అన్నాడు.

కొడుకు మాటలు ఎంకడికి సరిగ్గా అర్థం కాలేదు. కొడుకుని ఆప్యాయంగా అక్కున చేరుద్చుకుంటూ "ఈడు తన దగ్గరకు తిరిగొచ్చేసినాడు. అదే పదివేలు" అనుకున్నాడు మనసులో. □








## సుబ్బారాయుడు-సుబ్బలక్ష్మి

చిత్ర నిర్మాణంలో చిరకాలానుభవం వున్న దర్శకుడు కె. హేమాంబరధరరావు తాజా చిత్రం యిది. షూటింగు, ఆరు పాటల చిత్రీకరణతోసహా పూర్తయింది. ఆరు పాటల్ని మాలగా కూర్చి యిటీవల పత్రికల వారి కోసం సౌతిండియన్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ వారి ప్రీవ్యూ థియేటర్‌లో ప్రత్యేకంగా గీతమాలా కార్యక్రమం యేర్పాటు చేశారు హేమాంబరధరరావుగారు. పాటలు బావున్నాయి. నూతన్ ప్రసాద్, కవిత, నరసింహరాజు, జ్యోతి (తూర్పువెళ్ళే రైలు) నాగభూషణం, పద్మనాభం, హరిబాబు, రావికొండలరావు దాశరధి కాక మరికొందరున్నారు తారాగణంలో.

## ఒక్క రూపాయి

ఈ పేరుతో సమ్రాట్ ప్రతాపరుద్ర ప్రొడ

'పరోపకారి పాపన్న'లో కాకరాల, కె. విజయ



క్షన్స్‌వారు తలపెట్టిన చిత్రానికి నవంబర్ 22న మూడు పాటలు, అరుణాచలమ్ స్టుడియో రికార్డింగ్ థియేటర్‌లో రికార్డ్ చేశారు. ఈ రికార్డింగ్ థియేటర్ ప్రస్తుతం గాయకుడు జేసుదాస్ సారధ్యంలో నడుస్తోంది. ఒక్క రూపాయి కథ రాసిందీ, దర్శకత్వం వహి స్తోందీ వనం మధుసూదనరావు, ఎమ్మే. ఈయన ఒకవైపు తెలుగులో ఏకాంకికలు అనే అంశంమీద పి. హెచ్. డీకి పరిశోధన చేస్తూ, మరొక వైపు ఈ చిత్ర దర్శకత్వ, రచనా బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. సంగీతం బి. వసంతా సుధాకర్. నిర్మాత: కె. మోహన

'జాతర'లో చిరంజీవి, హరిబాబు





'అత్తవత్తగ్గ కోడలు'లో జయసుధ, ఎస్. వరలక్ష్మి

రావు. పాటలన్నీ స్టీరియో ఎఫెక్టుతో రికార్డు చేస్తున్నట్టుమధుసూదనరావుగారు తెలియజేశారు.

## 'జాతర' చూశాక

జీవితాన్ని జీవితంగా, కళ్ళకి కట్టినట్టు చూపించడం కొందరికి మాత్రమే తెలిసిన విద్య. సినిమాలకి సంబంధించి, ఆ విద్యలో అరితేరినవాణ్నని రుజువు చేసుకున్నాడు ధవళా సత్యం తన తొలి చిత్రం "జాతర"తో. ఈ చిత్రం తొలి కాపీ ఇటీవల ప్రసాద్ లాబ్ థియేటర్‌లో చూసినప్పుడు రెండున్నర గంటలసేపు కుట్రలూ, కూహకాలూ నిండిన ఒక మారుమూల తెలుగు పల్లెలో ఒక మధ్యతరగతి రైతుకుటుంబం మధ్య, ఆ వూరి బీదబిక్కీతో కలిసి వారి జీవితసంఘర్షణలో పాలుపంచుకున్నట్లనిపించింది. మధురమైన సంగీతంఅరుదయిన కెమెరా పనితనం. నాగభూషణం, సువర్ణ, శ్రీధర్, చిరంజీవి, హరిబాబు నటించిన తీరు చాలా కొత్తగా సహజాతి సహజంగా వుంది. హిందీలో బాసు ఛటర్జీ, హృషీకేశ్ ముఖర్జీ తీస్తున్నవిధంగా, సినిమాని సినీమాగానూ, నిర్మాతలకి నష్టం కలగని విధంగానూ చిత్రాలునిర్మించే దర్శకుల తరం ఒకటి ధవళా సత్యంతో ప్రారంభమవుతోందని ఆశించడం అత్యాశ కాబోదు. ఇటువంటి చిత్రాన్ని నిర్మించిన నిర్మాతల అభిరుచిని అభినందించి తీరాలి.

## ఘంటసాలమీద పాటలు

ఘంటసాల పాడిన పాటలుపాడీ, ఆయన్ని అనుకరించీ, లేక ఆయన గానం నుంచి ఉత్తేజం పొందీ మంచి గాయకులుగా మారిన వారు, సినిమాలలో స్థిరపడిపోయినవారూ వున్నారుకానీ, యిలాగ ఘంటసాలకి అజ్ఞాత శిష్యరికం చేసిన, చేస్తున్న వారి ప్రతినిధిగా, ఆ మహాగాయకుడిమీద పాటలు రాయించి పాడినవారు యింతవరకు లేరు. ఆ ఘనతని

మధుర గాయని యస్, జానకి, వర్ధమాన గాయకుడు అనుపమ విల్సన్ దక్కించుకున్నారు. ఘంటసాల ప్రజ్ఞాప్రాభవాలనీ, గాన వైభవాన్నీ ప్రస్తుతిస్తూ జానకి, అనుపమ విల్సన్ పాడిన నాలుగు పాటల్ని నవంబరు నాలుగున సంగీత దర్శకుడు జె. పురుషోత్తం రికార్డు చేశారు. జానకి జగమెరిగిన గాయకురాలు. ఆమెని గురించి యేమి రాసినా అతిశయోక్తిగా కనిపించదు. అనుపమవిల్సన్ తిలక్‌గారి "భూమి కోసం" చిత్రంతో సినిమా గాయకుడిగా ప్రవేశించి, కొల్లేటి కాపురం, కరుణామయుడు, ఆణిముత్యాలు, పగడాల పడవ వంటి చిత్రాలలో కొన్ని పాటలు పాడారు. ఇటీవల అన్నపూర్ణా సినీ ఎంటర్ ప్రైజెస్‌వారి "మోసగాడు" చిత్రానికి చక్రవర్తి సంగీత దర్శకత్వంలో బాలసుబ్రహ్మణ్యంతో కలిసి ఒక పాట పాడారు. నిస్సందేహంగా తెలుగు చిత్ర పరిశ్రమ ప్రోత్సహించదగిన మరొక మంచి గాయకుడు విల్సన్. ఘంటసాల మీద ఈ యిరువురు పాడిన పాటల్ని వచ్చే జనవరిలో SEA రికార్డు కంపెనీవారు విడుదల చేయబోతున్నారు.

## సృష్టి రహస్యాలు:

సృష్టిరహస్యాన్ని ఛేదించడానికి విశ్వ ప్రయత్నాలు జరుగుతూనే వున్నాయి ఇంకా. కాగా స్త్రీ పురుషుల సంబంధాలలోని, వారి నిత్య దాంపత్యజీవితంలోని 'సంసార' రహస్యాలను వెలికి తీసి వివరించే ప్రయత్నం చేశారు రచయిత శ్రీ కొమ్మూరి వేణుగోపాలరావు తమ 'సృష్టిరహస్యాలు' చిత్రంలో. బయటకి చెప్పుకోలేని విషయాలు అనేకం



'లంబాడోళ్ళ రాందాసు'లో చలం, ఫటాఫట్ జయలక్ష్మి



'శివమెత్తిన సత్యం'లో కృష్ణంరాజు




'సృష్టి రహస్యాలు'లో అంజలీనాయుడు, సుధాకర్

వుంటాయి స్త్రీపురుషుల జీవితాలలో. అలా లోలోన అనుమానాలతో కుమిలిపోవడంకంటే మంచి డాక్టర్ని కలిసి కష్టసుఖాలు చెప్పుకుంటే కష్టాలుపోయి సుఖాలు మిగులుతాయన్నారు డాక్టర్ వేణుగోపాలరావు ఇటీవల పామ్‌గ్రోవ్ హోటల్లో ప్రతికల వారితో మాట్లాడుతూ. సృష్టిరహస్యాలు చిత్రంలో ఒక నవజీవన వేదాంత ప్రవక్త పాత్రలో జగ్గయ్య నటించడం విశేషం. డాక్టరుగారు చిత్రాన్ని సైంటిఫిక్ చిత్రంగా అభివర్ణించారు. అంటే శరీర సమస్యలను గురించి శాస్త్రీయంగా వివరించే చిత్రమన్న మాట. సెన్సార్ వారు ఏ సర్టిఫికేటిచ్చిన ఈ చిత్రానికి దర్శకుడు ప్రతాప్, నిర్మాత కె. రాంబాబు, సంగీతం పెండ్యాల.

## మరో మాయలఫకీరు!

బాలనాగమ్మ నాటకం ఆడుతున్నారంటే బళ్ళు కట్టుకుపోయి చూసివచ్చేవారు నిన్న మొన్నటి వరకూ తెలుగువాళ్ళు. బాలనాగమ్మ సినిమాలు కూడా వచ్చాయి మనకి తెలిసి. బాలనాగమ్మ కొడుకు చేతికి చిక్కి చచ్చిన మాయల ఫకీరు మళ్ళీ బతికి (?) ఈ నాటి సమాజంలోకి వస్తే యేమవుతుంది. యెలా వుంటుంది? అభినవ బాలనాగమ్మలని అల్సేషియన్ కుక్కలుగా మార్చి ఎత్తుకుపోతాడా, లేక రెండు వానచినుకులతో పెద్దపెద్ద డాముల్ని సైతం ఇసుక కుప్పలుగా మార్చే మన ఆధునిక మంత్రగాళ్ళను చూసి బిత్తరపోయి పారిపోతాడా? ఈ తమాషా ఇతివృత్తంతో పి. వి. రాజు దర్శకత్వంలో ఒక హాస్యరస ప్రధాన చిత్రం తయారవుతుంది. రెయిన్‌బో సినీ ఆర్ట్స్ పతాకంతో కె.వి.జి.కె. రెడ్డి, తలాటం వెంకటేశ్వరరావు, తోట వెంకటరమణ, పెద్దిరెడ్డి బాబూరావు నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీత దర్శకుడు: చక్రవర్తి, కెమెరా: దేవదాజ్, సంభాషణలు: ప్రకాష్. రంగుల్లో నిర్మించబడనున్న ఈ చిత్రానికి కథకుడు దర్శకుడే డిసెంబరులో రికార్డింగు జరుగుతుందని నిర్మాతలు తెలియజేశారు.





కె. వి. మహదేవన్, కె. విశ్వనాథ్-'శంకరాభరణం' వర్కింగ్ స్టిల్

## మేనత్త కూతురు

నటుడు, దర్శకుడు కొమ్మినేని తన నిర్మాణ సారథ్యంలోనే 'మేనత్త కూతురు' పేరుతో ఒక కొత్త చిత్రాన్ని ప్రారంభించారు. నవంబరు 14న ప్రసాద్ స్టూడియోస్ రికార్డింగ్ థియేటర్‌లో జాలాది రాసిన పాట రికార్డింగ్‌తో నిర్మాణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. నవంబరు 22 నుంచి నెల్లూరులో షూటింగ్ జరుగుతోంది. రంగనాథ్, ఈశ్వరరావు, లక్ష్మీకాంత్, కాంతారావు, కాకరాల, పద్మనాభం, వంకాయల, మాధవి, మమత, రాజసులోచన మొదలైనవారు నటిస్తున్న ఈ వర్ణచిత్రానికి సంగీతం చక్రవర్తి, రచన జంధ్యాల.

## నవత వారి నవతారలు

నవత ఆర్ట్స్ కృష్ణంరాజుగారు తమ 'ఓ ఇంటి భాగోతం' చిత్రంలో నవతాప్రసాద్, డాక్టర్ తాళ్ళూరి కృష్ణకుమారి అనే యిద్దరు కొత్తవారిని పరిచయం చేస్తున్నారు. డా. కృష్ణకుమారి ప్రముఖ బొంబాయి తార తాళ్ళూరి రామేశ్వరి సోదరి. ఇద్దరూ ఒకేసారి కనిపిస్తే, ఎవరు యెవరో పోల్చుకోవడం చాలా కష్టం. ఈ పోలిక నటన విషయంలో కూడా వుంటుందని ఆశించవచ్చు.

'ఓ ఇంటిభాగోతం' చిత్రానికి నవంబర్ 19న జెమినీలో మూడు పాటలు రికార్డు చేశారు జి. కె. వెంకటేష్. చంద్రమోహన్, ప్రసాద్‌బాబు, నూతన్ ప్రసాద్, వంకాయల, పి.ఎల్. నారాయణ, రాళ్ళపల్లి, దీప, రమాప్రభ వగైరా నటిస్తున్న ఓయింటి భాగోతాన్ని సెల్యులాయిడ్ మీద మలుస్తున్నది దేవదాస్. రచయిత ఎమ్వీయల్.



'భలేకృష్ణుడు'లో జయప్రద, నాగభూషణం

Edited&Published by V. Leelavathy Raghavaiah, at 17B Rajaram Colony Kodambakkam, Madras-600024&Printed by D. HanumanthaRao at Kranti Press, 12, Francis Joseph Street, Madras-600001.



'సర్కస్ రాముడు'లో ఎన్. టి. రామారావు, జయప్రద

## కరుణానిధీ మేనల్లుడి కలర్ సినిమా

తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, ప్రముఖ రచయిత తిరు కరుణానిధి మేనల్లుడు, ప్రముఖ నిర్మాత శ్రీ సెల్వం కృష్ణ కథానాయకుడుగా తెలుగులో ఒక కలర్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సత్యనారాయణ, నూతన్ ప్రసాద్, గుమ్మడి, జమున, కన్నడ మంజుల, యితర నటీనటులు. రచయిత త్రిపురనేని మహారథి. ఛాయాగ్రాహకుడు మణి. దర్శకుడు అమృతం. 1980 జూన్ నుంచి కృష్ణ యీ చిత్రానికి పని చేస్తారు.

—దేవీదాసు



శ్రీశ్రీని సన్మానిస్తున్న రాజా-లక్ష్మీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు
శ్రీ పి. వి. రమణయ్యరాజా.


## శ్రీశ్రీకి రాజా-లక్ష్మీ అవార్డు బహూకరణ

మద్రాసు న్యూ ఉడ్‌లాండ్స్ హోటల్‌లో నవంబరు 19 సాయంత్రం యేర్పాటు చేసిన ఒక సభలో, ముందుగా ప్రకటించిన విధంగా రాజా-లక్ష్మీ ఫౌండేషన్ (మద్రాసు)వారు మహాకవి శ్రీశ్రీకి పదివేల రూపాయలు బహూకరించారు. బెజవాడ గోపాలరెడ్డిగారు సభకి అధ్యక్షత వహించారు. ప్రముఖ రచయిత, ఆంధ్రజ్యోతి సంపాదకులు నండూరి రామమోహనరావుగారు శ్రీశ్రీని హృద్యమైన రీతిలో పరిచయం చేశారు. ఆంధ్రజ్యోతి వారపత్రిక సంపాదకులు పురాణం సుబ్రహ్మణ్యశర్మగారు శ్రీశ్రీ కవిత్వ తత్వాన్ని మనోహరంగా వివరించారు. ఇల్లస్ట్రేటెడ్ వీక్లీ మాజీ సంపాదకులు శ్రీ ఏ. ఎస్. రామన్‌గారు, చల్లా రాధాకృష్ణశర్మగారు, మరి కొందరూ ప్రసంగించారు. ఈ అవార్డు నెలకొల్పి తెలుగు సాహిత్య రంగానికి ఒక ఉత్తేజాన్ని కలిగించినందుకు పలువురు వక్తలు శ్రీ రమణయ్యరాజాని ప్రస్తుతించారు. శ్రీశ్రీ ఉచితరీతిని కృతజ్ఞతలు తెలియజేశారు.

జ్యోతి శ్రీశ్రీ నిధికి విరాళమిచ్చే శ్రీశ్రీ అభిమానుల నినాదం

**“నేను సైతం రెండుశ్రీలకు కానుకొక్కటి సమర్పిస్తాను”**

## శ్రీశ్రీ నిర్వహించు పదబంధ ప్రహేళిక



ఆధారాలు — జనవరి ’80

అడ్డం

1. పశుగ్రాసపు క్రియావాచకం
3. కొందరికి గొర్రెల మంద
5. నల్లసూటు
7. హిందీ చిత్రానికి తెలుగుమూలం
9. ఆ అయితే అటు, ఈ అయితే ఇటు
10. సినిమా తార
12. కొత్త అయితే
13. తేలు విషం ఇక్కడే
15. గడ్డితోనే ఇది
16. ధనం అబద్ధం
17. తెలుగుకి చివర, ఇంగ్లీషుకి మధ్య
18. :8 నిలువులో సగం
20. అ, ఈ, ఏ
22. పాముయొక్క బిడ్డ
23. శివాజీ?
25. అటీలేని దీపం సాక్షాత్తు స్వర్గమే
27. పాడితే వినాలని వుండదూ!
29. ఒక వృత్తికారుడు
31. తమిళనాడులో ఇది లేదు
32. అమ్రేడిస్తే కాంతి

నిలువు

1. వీటితో పెళ్ళిళ్ళు
2. ఒక పత్రిక
3. కొలత
4. తలలేని భజన
5. నడుంలేని పువ్వు
6. ఒంటికి వచ్చేది
7. కన్నడానికి లేదు
8. 18 నిలువులో రెండో సగం
11. ఈ యుగానికి చిహ్నం
14. జిల్లా తిరిగితే నిద్ర
15. మంత్రం, బంధం
18. చాలా మంది జిహ్వలకి సహజమే
19. ఉంటే రాయచ్చు
21. కుట్టొచ్చు, జాగ్రత్త
22. సాల
23. ప్రవాళంలో ఒకటికన్న ఎక్కువ భాషలు
24. తాత్పర్యం దీని తర్వాత
26. వాదులు
28. అతగాడి ఫాషన్
30. ఒక చెట్టు (తల కిందులు)

## డిసెంబర్ పదబంధ ప్రహేళికకు సమాధానాలు:

అడ్డం : 1. అవం. 3. గోరా. 5. సోమశిల 7. పడమర 9. లవ 10. యయాతి. 12. బావి. 13. సమం. 15. కణం. 16. జమ్మి. 17. జోల. 18. మరి. 20. పడి. 22. ఆహా. 23. బడబ. 25. గామా. 27. విభావరి. 29. లంకాపురి. 31. రంపి. 32. కాలు.

నిలువు : 1. అమవస. 2. వంశి. 3. గోడ. 4. రామబాణం. 5. సోల 6. లయ. 7. పతి. 8. రవి. 11. యామం. 14. మంజరి. 15. కలవ. 18. మహాభారం. 19. సీడ. 21. డిగాపులు. 22. అవి. 23. బరి. 24. బలం. 26. మారి. 28. వడి. 30. కాకా.

## నిబంధనలు గమనించండి!

పదబంధ ప్రహేళిక కొట్టివేతలు, దిద్దుబాట్లూ లేకుండా పూర్తిచేసి డిసెంబరు 25 వ తేదీలోపు మాకు చేరేట్టు పంపండి. తెల్లకాగితం మీద గళ్ళు గీసి పూర్తిచేసి పంపిన ఎంట్రీలు చెల్లవు. ఎంట్రీలు పంపేవారు వారి పూర్తి చిరునామా ఎంట్రీపైనే రాసి పంపాలి. ఆల్-కరెక్ట్ ఎంట్రీకి రు. 50/- బహుమతి. ఒకటికి మించి ఆల్ కరెక్ట్ ఎంట్రీలు వొచ్చినప్పుడు బహుమతి సొమ్ము విజేతలకు సమానంగా పంచబడుతుంది. ఆల్ కరెక్ట్ ఎంట్రీ ఒకటీ రాకపోతే బహుమతి సొమ్ము పై నెల బహుమతి సొమ్మురు కలిపి అందజేయబడుతుంది.

## డిసెంబరు ప్రహేళిక విజేతలు:

1) సి. శేషగిరిరావు—ఏలూరు. 2) కె. వి. ఉషాకల్యాణి—ఏలూరు. 3) కె. ముత్యాలు-ఏలూరు. 4) కె. జె. ఎమ్. కృష్ణారావు—ఏలూరు. 5) ఎమ్. హెచ్. వి. సుబ్బారావు—గుంటూరు. 6) మా. శివప్రసాదరావు—హైదరాబాద్. 7) తెన్నేటి సుధాదేవి—హైదరాబాదు. 8) సి. విజయకుమార్—హైదరాబాదు. 9) యం. శ్యామల—కర్నూలు. 10) వి. గోపాలకృష్ణ-మద్రాసు. 11) జి. వి. సీతారామరాజు—రాంబిల్లి. 12) జి. విశ్వేశ్వరరావు—శ్రీకాకుళం. 13) ఎస్. రామశాస్త్రి—వరంగల్. 14) ఎస్. గౌరి—సికింద్రాబాద్. 15) కె. కనకమహాలక్ష్మి-విశాఖపట్నం.